ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kurnool, Kadapa, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-8-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 188 పేజీలు: 8+4 వెల: 6.50



నీట్‌లో పెన్, పేపర్‌కు స్వస్తి!: కేంద్రం కసరత్తు
తెహల్కా మాజీ ఎడిటర్ తేజ్‌పాల్‌కు పదేళ్లు జైలు 5లో


# అమరావతిలో ట్విన్ టవర్స్

**ఒక్కొక్కటి 47 అంతస్తులతో నిర్మాణం**

**పాదచారుల భద్రత పాలసీకి కెబినెట్ ఆమోదం**

**విశాఖ వెలంపేట మురికివాడవాసులకు కొత్త భవనాలు**

**గోదావరి పుష్కరఘాట్‌లకు రూ. 210 కోట్లు**

**సిఎం చంద్రబాబు అధ్యక్షతన కెబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు**



గురువారం అమరావతిలో సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్రమంత్రివర్గ సమావేశం దృశ్యం

**విజయవాడ.ఆగస్టు 6,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి నిర్మాణం, పారిశ్రామికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో 34 అజెండా అంశాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ యాక్ట్-2026, ఎపి పిపిపి పాలసీ2026 ముసాయిదాలను ఆమోదించింది. ఎపి దిశా బిల్లు- 2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు-2024లను ఉపసంహరించి, కొత్త కఠినచట్టాలను తీసుకురావాలని నిర్ణయించింది. విశాఖ వెలంపేట మురికివాడ పేదలకు 28కోట్ల 44 లక్షలతో బహుళ అంతస్తుల భవనాలను మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది .రాజధాని అమరావతి పునర్నిర్మాణంలో భాగంగా అమరావతి క్వాంటమ్‌వ్యాలీ ట్విన్‌టవర్స్ పనులను రూ. వేయి కోట్లతో ఎల్ అండ్ టీ సంస్థకు అప్పగించి రుణం సమీకరించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అసెంబ్లీ, హైకోర్టు అదనపు డిజైన్ల వ్యయాన్ని 206 కోట్లకు పెంచుతూ సవరించిన అనుమతులు మంజూరుచేశారు. రైతుల యాన్యుటీ చెల్లింపుల కోసం తీసుకున్న 300 కోట్ల రుణానికి, అమరావతి ఐ ప్రాజెక్టు రీటెండర్లకు పచ్చజెండా ఊపారు. వైకుంఠపురం ఇనాం భూముల వివాదాన్ని 122 కోట్లరూపాయల పరిహారంతో శాశ్వతంగా పరిష్కరించేలా నిర్ణయం తీసుకున్నారు. కుప్పం ఎయిర్‌పోర్ట్ బాధితులకు ఎకరాకు 12 లక్షల 44వేల రూపాయల పరిహారం, >>2


**17 నుంచి 4 రోజులు అసెంబ్లీ సమావేశాలు 2లో**




# స్థానిక ఎన్నికలకు సమాయత్తం కండి

## మంత్రి లోకేష్ పిలుపు

**మెజారిటీ స్థానాలు కూటమికే రావాలి: మంత్రి**

**విజయవాడ, ఆగస్టు6, ప్రభాతవార్తప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని మంత్రులకు విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. గురువారం కేబినెట్ సమావేశానికి ముందు మంత్రులతో లోకేష్ బ్రేక్ ఫాస్ట్ సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల్లో మెజారిటీ స్థానాలను కూటమి అభ్యర్థులు కైవసం చేసుకోవాలన్నారు. ఈ ఎన్నికలు అనుకున్న సమయానికే జరుగుతాయని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ చేసిన విధ్వంసం, కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిన తీరును అందరికీ తెలియాలని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసం, దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను కూటమి ప్రభుత్వం ఎంతగా శ్రమించి గాడిలో పెట్టిందో ప్రజలకు వివరించాలని లోకేష్ స్పష్టం చేశారు. 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంట్లో కనీసం 3 నిమిషాల సమయం గడిపి, ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని వివరిస్తూ కుటుంబాలతో ఎమోషనల్ బాండింగ్ ఏర్పరుచుకోవాలని మార్గనిర్దేశం చేశారు. సర్ డ్రాఫ్ట్ నివేదిక వచ్చాక అర్హులెవరైనా ఓట్లు కోల్పోయి ఉంటే తిరిగి చేర్పించడంపై నేతలు దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీలో చర్చించాల్సిన అంశాలపై లోకేష్ వద్ద మంత్రులు చర్చించారు. ఎల్‌నినో పరిస్థితులను ప్రజలకు అసెంబ్లీ వేదికగా వివరిద్దామని మంత్రి తెలిపారు. జలాశయాల్లోకి వరద రావడం కాస్త ఊరటనిచ్చే అంశమని చెప్పుకొచ్చారు. తొలి ప్రాధాన్యం తాగునీరు, ద్వితీయ ప్రాధాన్యం పశుగ్రాసానికి ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారానికి అసెంబ్లీని వేదిక చేసుకుందామని మంత్రులకు లోకేష్ వివరించారు. >>2

# చేనేతకు మరింత చేయూత

**● 'నేతన్నల సేవలో' కింద ఒక్కో కుటుంబానికి రూ. 25 వేలు ● రూ. 179 కోట్లతో 71,536 చేనేత కుటుంబాలకు లబ్ధి ● నేడు చీరాలలో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమం**

**విజయవాడ, ఆగస్టు 6, ప్రభాతవార్తప్రతినిధి:** నేతన్నల కుటుంబాలకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ఇప్పటికే ఉచిత విద్యుత్, రాయితీలు, 50 యేళ్లకే పింఛన్ అందిస్తూ దన్నుగా ప్రభుత్వం ఉంటోంది. ఈ క్రమంలో తాజాగా వారి సంక్షేమానికి మరో అడుగు ముందుకేసింది. నేతన్న సేవలో పథకం కింద ఒక్కో చేనేత కుటుంబానికి రూ.25 వేల చొప్పున ప్రభుత్వం జమ చేయనుంది. 7వ తేదీన '12వ జాతీయ చేనేత దినోత్సవం'ను పురస్కరించుకుని 'నేతన్న సేవలో' పథకాన్ని సిఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఈ పథకంలో భాగంగా అర్హత కలిగిన ప్రతి నేతన్న కుటుంబానికి రూ.25 వేల సాయం దక్కనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 71,536 కుటుంబాలకు రూ.179 కోట్లను ప్రభుత్వం అందించనుంది. మేనిఫెస్టోలో హామీ ఇవ్వకపోయినా చేనేతల సంక్షేమాన్ని, వృత్తి వారసత్వాన్ని పరిరక్షించే లక్ష్యంతో సర్కారు సాయం అందిస్తోంది.



రాట్నం వడుకుతున్న సిఎం చంద్రబాబు

**చేనేత రంగం బలోపేతం దిశగా....**

తాజాగా ప్రవేశపెడుతోన్న నేతన్న సేవలో పథకమే కాకుండా ఇప్పటికే అనేక విధాలుగా ప్రభుత్వం లబ్ధి చేకూరుస్తోంది. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌కు 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ అందిస్తోంది. దీంతో 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కల్పిస్తోంది. దీనికి యేటా రూ.150 కోట్లు ఖర్చు కానుంది. అంతేకాకుండా 50 ఏళ్లు నిండిన 85 వేల మంది చేనేతలకు రూ.4 వేల చొప్పున యేడాదికి రూ.420 కోట్లు ఖర్చు చేస్తోంది. 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు అందించింది. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కుతో పాటు అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం కూడా ఏర్పాటు చేస్తోంది. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది.

ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం చీరాల నియోజకవర్గంలో పర్య >>2

# పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు బ్రేక్!

## పర్యావరణ అనుమతుల ప్రతిపాదన వెనక్కి!

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రతిపాదించిన పోలవరం - బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం కొర్రీ పెట్టింది. ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల ప్రతిపాదనను కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ వెనక్కి పంపింది. ఈ విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ లిఖిత పూర్వకంగా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేశారు. కేంద్ర పర్యావరణ శాఖలోని ఎన్విరాన్‌మెంట్ అసెస్‌మెంట్ కమిటీ (ఇఎసి) నివేదికల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. 1980 గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పుకు ఈ ప్రాజెక్టు రూపకల్పన, నీటి వినియోగ ప్రతిపాదనలు విరుద్ధంగా ఉన్నాయనే అభ్యంతరాలు వచ్చినట్లు వెల్లడించారు. అలాగే తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలపై ప్రభావం పడే అవకాశం ఉందనే అంశాన్ని కూడా ఇఎసి పరిగణనలోకి >>2






# సుప్రీంకోర్టు, ఇడి ఢిల్లీ పోలీసు పేరిట భారీ సైబర్ మోసం

## రూ. 1.43 కోట్లు కొట్టేసిన మోసగాళ్లు

**మచిలీపట్నం / విజయవాడ, ఆగస్టు 6 (ప్రభాతవార్త):** కృష్ణా జిల్లాలో భారీ సైబర్ మోసం వెలుగుచూసింది.ఢిల్లీ పోలీసు, ఈడీ అధికారులు, సుప్రీంకోర్టు పేర్లను ఉపయోగించి ఓ మహిళను భయభ్రాంతులకు గురిచేసిన సైబర్ నేరగాళ్లు ఆమె నుంచి రూ.1.43 కోట్లకు పైగా కాజేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడంతో జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. గురువారం మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ శ్రీనివాస్ కేసు వివరాలు తెలిపారు. మచిలీపట్నంలోని పరాసుపేటకు చెందిన వెంపటి అలవేలు మంగమ్మకు జూన్ 10న గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వచ్చింది. ఆమె పేరుతో మనీ లాండరింగ్ కేసు నమోదైందని, ఢిల్లీలోని కెనరా బ్యాంకు ఖాతా ద్వారా అక్రమ లావాదేవీలు జరిగాయని, ఆమెపై నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ అయిందని నమ్మించారు. తర్వాత వాట్సాప్ వీడియో కాల్స్ ద్వారా సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోందని చెబుతూ, న్యాయమూర్తి >>2


**అమెరికా వీసా మరింత కఠినం 2లో**
**ఎయిర్ పోర్టుల్లోనే అదుపులోకి తీసుకొంటున్న యుఎస్ ఐసి అధికారులు**





గురువారం విజయవాడలో జరిగిన ప్రభుత్వ ఆయుర్వేద, హోమియో, యునాని, సిద్ధ వైద్యుల రాష్ట్ర స్థాయి సదస్సులో ప్రసంగిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

# రూ.210 కోట్లతో ధర్మవరం, పిఠాపురంలో ఆయుర్వేద వైద్య కళాశాలలు

**ప్రొద్దుటూరులో యునాని కళాశాల ఏర్పాటుకు స్థల సేకరణ పూర్తి**

**వైద్యుల సదస్సులో మంత్రి సత్యకుమార్ యాదవ్**

**విజయవాడ,ఆగస్టు 6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవల విస్తృతికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. ఈ క్రమంలోనే ఆయుష్ సేవల అభివృద్ధి కోసం 2026- 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.257 కోట్లు మంజూరు చేయాలని వార్షిక ప్రణాళిక కింద నేషన్ ఆయుష్ మిషన్‌కు ప్రతిపాదన పంపించామని తెలిపారు. అలాగే వైద్యారోగ్య శాఖలో మాదిరిగానే ఆయుష్, ఫుడ్ సేఫ్టీ శాఖల్లో జీరో వేకేన్సీ కింద నియామకాలు >>2

# రాజమండ్రిలో దారుణం యువ వైద్యురాలిపై దూసుకెళ్లిన కారు

## డాక్టర్ ప్రియాంక బ్రెయిన్‌డెడ్, మెడికోల ఆగ్రహం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు6,ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి నగరంలో యువ వైద్యురాలిపై కారు దూసుకెళ్లిన ఘటన తీవ్ర సంచలనం రేపింది. ఇద్దరు యువకులు మద్యం మత్తులో నిరక్ష్యంతో కారు నడపడంతో ఓయువ వైద్యురాలు బలైంది. ఆసమయంలో మద్యంమత్తులో ఆయువకులున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. స్థానిక ఎవి అప్పారావు రోడ్డులోని ప్రసాదిత్యా మాల్ వద్ద జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు జిఎస్ఎల్ మెడికల్ కాలేజీలో డెర్మటాలజీ పీజీ చదువుతున్న 28 యేళ్ల డాక్టర్ ప్రియాంక ఈ దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించబడినట్లు వైద్య వర్గాలు తెలిపాయి. ఈనెల మూడో తేదీన నామవరంకు చెందిన ఇద్దరు యువకులు సురవరపు దాస్వంత్, ఆంద్రు జోసఫ్ మద్యం సేవించి సినిమాకు వచ్చారు. మద్యం సేవించి ఉండటంతో వీరిద్దరని గేటు వద్ద సెక్యూరిటీ గార్డ్ అడ్డుకున్నారు. దీంతో గొడవకు దిగారు. దీంతో కోపంగా ఆయువకులు కారుతో బయటికి వస్తుండగా స్కూటీపై వెళ్తున్న వైద్య విద్యార్థిని ప్రియాంకను >>2



గురువారం న్యూఢిల్లీలో మాజీ లోక్‌సభ స్పీకర్ గుర్దియాల్ సింగ్ ధిల్లాన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న స్పీకర్ ఓం బిర్లా

# పంచాయతీ,మున్సిపల్ సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సమీక్ష

**విజయవాడ,ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాల అందుబాటు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఎన్నికల సామగ్రి, వార్డుల విభజన తదితర వివిధ అంశాలపై చర్చించారు. స్థానిక పోరులో అత్యంత కీలకమైన బిసి రిజర్వేషన్ల వ్యవహారంపై డెడికేటెడ్ కమిషన్ సమర్పించే నివేదికను జులై 31 నాటికి సమర్పించాల్సి ఉంది. అయితే మరో నెలరోజులపాటు నివేదిక సమర్పణకు సమయం పొడిగించింది. ఆగస్టు 31 నాటికి ఈ కమిషన్ నివేదిక రానుంది. ఆ తర్వాతే బిసి రిజర్వేషన్ల అంశం నిర్ణయానికి రానున్నట్లు తెలుస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13,291 పంచాయతీలకు సంబంధించి ఇప్పటికే ఓటర్ల జాబితాలు సిద్ధమయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో పోలింగ్ కోసం ఏకంగా 1.36 లక్షల కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. మున్సిపల్ ఎన్నికలకోసం 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జనాభా ప్రాతిపదికన డివిజన్లు, వార్డుల పునర్విభజన ప్రక్రియ చురుగ్గా కొనసాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో కొన్ని కోర్టు వ్యాజ్యాలు కూడా ఉన్నాయి. వీటి అన్నింటిపైనా సంబంధిత అధికారులు సమీక్ష సమావేశంలో ఎన్నికల సంఘందృష్టికి తీసుకొచ్చారు. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా అందుకు అంతా సిద్ధంగా ఉండేలా యంత్రాంగాన్ని సమాయత్తం కావాలని ఎన్నికల సంఘం సూచించింది. రాష్ట్రంలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలన్నిటికీ ఒకేసారి ఎన్నికల నిర్వహణకు ప్రతిబంధకంగా ఉన్న చట్టంనంబరు 5ను ఉపసంహరించుకునే విషయాన్ని ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాలు పరిశీలిస్తున్నాయి. ఇందుకోసం న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నాయి. చట్టాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పెండింగ్ లోని కేసుల పరిష్కారానికి ఉపసంహరణే సరైన పరిష్కారమని అధికారులు భావిస్తున్నారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖపై సిఎం చంద్రబాబు ఇటీవల నిర్వహించిన సమీక్షలో 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలకూ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కోర్టు కేసుల కారణంగా 2021మార్చిలో వంద చోట్లే ఎన్నికలు నిర్వహించారు.

# ‘దిశ’ బిల్లు ఉపసంహారణకు ప్రభుత్వం నిర్ణయం

**విజయవాడ.ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ దిశ బిల్లు క్రిమినల్ లా (ఆంధ్రప్రదేశ్ సవరణ) బిల్లు-2019ను ఉపసంహరించాలని ఎపి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఎపి సమాచార, పౌరసంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్ధసారధి తెలిపారు. గురువారం ఆయన పబ్లిషిటి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలిలో దిశ బిల్లు ఉపసంహారణ చేసిన చేసిన ప్రతిపాదనకు ఆమోదం లభించిందిన్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలపై వేగవంతమైన దర్యాప్తు, విచారణ కోసం ఉద్దేశించిన ‘ఆంధ్రప్రదేశ్ దిశ బిల్లు క్రిమినల్ లా (ఆంధ్రప్రదేశ్ సవరణ) బిల్లు, 2019’ను రాష్ట్రపతి ఆమోదం కోసం గతంలో పంపిన ఈ బిల్లును పరిశీలించిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ.. పలు నిబంధనలపై వివరణలు కోరడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ శాఖల సూచనలు పొందుపరిచి కొత్త బిల్లును సమర్పించేలా ప్రస్తుత బిల్లును వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది.పాత ఐపిసి (ఐపిసి 1860).సిఆర్‌పిసి (సిఆర్‌పిసి 1973) చట్టాలస్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన భారతీయ న్యాయ సంహిత 2023భారతీయ నాగరిక్ సురక్షా సంహిత 2023 చట్టాలు 01.07.2024 నుండి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయి.

# అమెరికా వీసా మరింత కఠినం

**వాషింగ్టన్, ఆగస్టు 6:** అమెరికాలో నివసిస్తున్న భారతీయులు, ముఖ్యంగా ఉద్యోగాలు చేసే హెచ్1బీ వీసాదారులు, చదువుకునే ఎఫ్1 వీసా విద్యార్థులు ఇప్పుడు దేశీయంగా ప్రయాణించాలన్నా హడలిపోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. యుఎస్ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎయిర్ పోర్టులలో సోదాలు తీవ్రతరంచేశారు. వీసాగడువు ముగిసిన వారిని, ఇతర ఇమ్మిగ్రేషన్ స్టేటస్ దరఖాస్తులు పరిశీలనలో ఉన్నవారిని లక్ష్యంగాచేసుకుని విమానాశ్రయాల్లోనే అదుపులోకి తీసుకుంటుండటంతో భయాలు పెరిగాయి. ప్రెసిడెంట్ ట్రంప్ సర్కార్ నిర్దేశించిన నగరాల నుంచి వెళ్లగొట్టే లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు ఈ తరహా ఆకస్మిక దాడులకు దిగుతుండటంతో భారతీయ నిపుణులు, విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. సీఐఎస్ రిపోర్ట్ శాన్ ఫ్రాన్సిస్కో, లాస్ ఏంజెల్స్, డెన్వర్, లాస్ వేగాస్, నాష్‌విల్లె వంటి బిజీ ఎయిర్‌పోర్టుల్లో చెకిన్ కౌంటర్లు, బోర్డింగ్ గేట్ల వద్దే ప్రయాణికులను ఆపి తనిఖీ చేస్తున్నారు. వీసా గడువు తీరినవారు, ఐ94 రికార్డు కాలపరిమితి పూర్తయినవారు, అలాగే అమెరికా పౌరులను పెళ్లి చేసుకుని ఇంకా గ్రీన్ కార్డ్ రాని వారిని కూడా విచారించి కస్టడీలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ ఆపరేషన్లు ముఖ్యంగా విమానాల్లో తరచూ ప్రయాణించే మన భారతీయులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

# అమరావతిలో ట్విన్ టవర్స్

>> విశాఖ వెలంపేట స్లమ్ పేదలకు 28కోట్ల 44 లక్షలతో బహుళ అంతస్తుల భవనాలను మంజూరు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పాదచారుల భద్రతా పాలసీ2026 అమల్లోకి తెస్తూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గోదావరి పుష్కరాలు 2027 ఘాట్‌ల అభివృద్ధికి 210 కోట్ల రూపాయలు కేటాయించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. విద్యా వ్యవస్థ విస్తరణలో భాగంగా ఆర్‌విఎస్, ప్రగతి ప్రైవేట్ యూనివర్సిటీలతో పాటు కొత్త జిల్లాలకు 15 కొత్త డిఇఒ పోస్టులను మంత్రివర్గం ఆమోదించింది. పారిశ్రామిక విప్లవం కోసం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌యాక్ట్-2026, ఎపి పిపిపి పాలసీ 2026 ముసాయిదాలకు ఆమోదం తెలిపారు. పరిపాలనా, చట్టపరమైన సంస్కరణలలో భాగంగా ఎపి దిశా బిల్లు 2019, ల్యాండ్ గ్రాబింగ్ బిల్లు 2024లను ఉపసంహరించి కొత్త కఠిన చట్టాలను తీసుకురావాలని నిర్ణయించారు. పారిశ్రామిక వేగానికి బల్క్‌డ్రగ్ పార్క్ కోసం హుడ్కో నుంచి 680 కోట్ల రూపాయల రుణం, ఆక్వా రంగానికి యూనిట్‌కు రూపాయిన్నర విద్యుత్ రాయితీని కొనసాగించనున్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పునర్వ్యవస్థీకరణతో పాటు మున్సిపల్ భూముల లీజు గడువును 25 యేళ్లకు పైగా పెంచేలా చట్టసవరణలకు ఆమోదం తెలిపింది. డిఫామ్ లేని సాగుదారులకు ఎకరాకు రూ.12.44 లక్షల పరిహారం అందించేందుకు కేబినెట్ అంగీకారం తెలిపింది. అమరావతిలో 47 అంతస్తుల ట్విన్ టవర్స్ నిర్మాణానికి ఆమోదం లభించిందని, ట్విన్ టవర్స్‌లో కార్పొరేట్, క్వాంటమ్ సంస్థలకు అవకాశం ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. హైకోర్టు భవనం రీడిజైన్ ప్రతిపాదనకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది ఎపి పిపిపి పాలసీ 2026కు మంత్రిమండలి నుంచి ఆమోదం ముద్ర పడినట్లు చెప్పారు. పిపిపి ప్రాజెక్టులకు రూ.1,500 కోట్ల వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ ఏర్పాటు చేయాలని మంత్రివర్గం సమావేశంలో నిర్ణయించించారు భారీ పెట్టుబడుల ఆకర్షణే కొత్త పిపిపి పాలసీ లక్ష్యంగా సమావేశంలో సిఎం స్పష్టం చేసారు. మోతడకలో 2,344 ఎకరాల్లో ల్యాండ్ పూలింగ్‌కు ఆమోద ముద్ర పడిందన్నారు. హైస్పీడ్ రైలు, ఇన్నర్ రింగ్ రోడ్డుకు భూముల సమీకరణకు మంత్రివర్గం అంగీకారించింది.

# ఢిల్లీ పోలీసు పేరిట భారీ సైబర్ మోసం

>> పేరును ఉపయోగించి నకిలీ విచారణ నిర్వహించినట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది. కేసు నుంచి బయటపడాలంటే తన బ్యాంకు ఖాతాల్లోని నగదును తాత్కాలికంగాకోర్టుకు జమ చేయాలని, మూడు రోజుల్లో తిరిగి చెల్లిస్తామని మోసగాళ్లు నమ్మించారు.వారి సూచనల మేరకు బాధితురాలు జూన్ 15 నుంచి విడతల వారీగా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎల్ఐసి, కోఆపరేటివ్ బ్యాంక్‌లలోని డిపాజిట్లను రద్దు చేసి, ఆర్‌టిజిఎస్ ద్వారా మొత్తం 1 కోటి 43లక్షల 50 వేల రూపాయలను వారు సూచించిన బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశారు.అనంతరం జులై చివర్లో మరో రూ.95 లక్షలు చెల్లించాలని, లేనిపక్షంలో ఆమె ఆస్తులన్నింటినీ సీజ్ చేస్తామని బెదిరించడంతో బాధితురాలికి అనుమానం వచ్చింది. వెంటనే అమెరికాలో ఉన్న తన కుమారుడికి విషయం చెప్పగా, ఇది సైబర్ మోసమని గుర్తించారు. అనంతరం స్నేహితుల సహాయంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మోసగాళ్లు మొత్తం వ్యవహారంలో వాట్సాప్ వీడియో కాల్స్, ఐఎంఓ యాప్ ద్వారానే మాట్లాడారని, ఎప్పుడూ తమ ముఖాలు చూపించలేదని బాధితురాలు తెలిపింది. విషయం బయటకు చెబితే కుటుంబ సభ్యులను చంపేస్తామని కూడా బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు డిఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. పోలీసులు, సిబిఐ, ఇడి, కోర్టులు లేదా ఇతర ప్రభుత్వ సంస్థల పేరుతో ఎవరైనా ఫోన్ చేసి డబ్బు డిమాండ్ చేస్తే నమ్మవద్దని సూచించారు. అలాంటి కాల్స్ వస్తే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని, సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఆయుర్వేద వైద్య కళాశాలలు

>> చేపట్టేందుకు సిఎం చంద్రబాబు నాయుడుతో చర్చిస్తామని వెల్లడించారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో గురువారం ప్రభుత్వ ఆయుర్వేద, హోమియో, యునాని, సిద్ధ వైద్యులకు రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ జాతీయ ఆయుష్ కమిషన్ నుంచి వార్షిక ప్రణాళిక కింద నిధులు పొందడంలో ఆనాటి గత వైకాపా ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. 2024-25లో రూ.85 కోట్లు, 2025-26లో రూ.166 కోట్లు చొప్పున కూటమి ప్రభుత్వానికి మంజూరయ్యాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ భారీగా కేంద్రం నుంచి నిధులు మంజూరయ్యే అవకాశం ఉందని చెప్పారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లతో గుంటూరు సమీపంలో కేంద్ర యోగా, ప్రకృతి వైద్యానికి సంబంధించిన పరిశోధన సంస్థను ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం 15 ఎకరాలను కేటాయించిందని చెప్పారు. గత ప్రభుత్వం ఈ సంస్థ ఏర్పాటు కోసం కేటాయించిన భూమిని ఇళ్ల స్థలాలకు మళ్లించడంతో తదుపరి చర్యలు స్తంభించాయని విమర్శించారు.

**అవగాహన కల్పించిన అనంతరమే ఆయుర్వేదలో శస్త్ర చికిత్సలు**

తిరుపతి, గిద్దలూరు, నందిగామ, తెనాలి, టెక్కలి, రంపచోడవరంలలో ఒక్కొక్కటి రూ. 15 కోట్లు చొప్పున వ్యయం చేసి సమగ్ర ఆయుష్ ఆసుపత్రులను ఏర్పాటు చేస్తామన్నారు. ధర్మవరం, పిఠాపురంలలో ఆయుర్వేద, ప్రొద్దుటూరులో యునాని వైద్య కళాశాలల ఏర్పాటుకు రూ.70 కోట్లు చొప్పున రూ.210 కోట్లు ఖర్చు చేయబోతున్నామని చెప్పారు. అలాగే విశాఖలోరూ.70 కోట్లతో తలపెట్టిన నేచురోపతి వైద్య కళాశాల నిర్మాణం పనులు ముగింపు దశకు చేరుకున్నాయని తెలిపారు. అలాగే ఆయుష్ ఆరోగ్య మందిరాలకు పూర్తిస్థాయిలో కొత్త భవనాలను నిర్మించే పనులు చివరిదశకు వచ్చాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు వివిధ హోదాల్లో కలిపి 216 మంది ఆయుష్ వైద్యులను నియమించిందన్నారు.

ఆయుర్వేదంలోని శల్యతంత్ర, శాకల్యతంత్ర విభాగాలకు సంబంధించి 58 రకాల శస్త్ర చికిత్సలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చిందని మంత్రి తెలిపారు. సంబంధిత వర్గాలతో చర్చించి, ఈ చికిత్స విధానాలపై పూర్తి అవగాహన కల్పించిన తర్వాత అమలు చేస్తామని చెప్పారు. ఆయుష్‌కు ప్రాధాన్యతనివ్వడమంటే అల్లోపతి వైద్యాన్ని తగ్గించడం కాదని మంత్రి స్పష్టం చేశారు. అత్యవసర చికిత్స, శస్త్ర చికిత్సల్లో అల్లోపతి వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఉందని చెప్పారు. ఆహారపు అలవాట్లు, జీవన శైలిలో మార్పులు చేసుకోవడం, యోగా, ప్రకృతి వైద్య విధానాలను అవలంబించడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండొచ్చని చెప్పారు.

## వారం - వర్జ్యం

07-08-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేషకార్తె
తి.నవమి సా.4.34 న.కృత్తిక సా.6.40
వ.ఉ.7.25-ఉ.8.55
దు.1. ఉ.8.23-ఉ.9.14
దు.2. మ.12.38-మ.1.29
రాహు. ఉ.10.30-మ.12.00 శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** రావలసిన మొత్తాలు, క్లైములు చెల్లించవలసిన పద్దులు పరిష్కారమవుతాయి. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**వృషభం :** మీ కృషి ఫలిస్తుంది. ఆత్మీయులతో విహారయాత్రలు చేస్తారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**మిథునం :** పిల్లల విద్యా, వివాహ, ఉద్యోగ విషయాలలో శుభ పరిణామాలు కనిపిస్తాయి. విందు వినోదాలలో పాల్గొంటారు.

**కర్కాటకం :** మీ ప్రవర్తనలో గానీ, వ్యవహారాలలో గాని దాపరికం, ఏకాంతత అవసరం. శుభవార్తలు వింటారు.

**సింహం :** ఒక వ్యవహారంలో మర్మంగా వ్యవహరిస్తారు. ఋణాలు ఇవ్వటం తీసుకోవటం వంటి లావాదేవీలు జరుపకండి.

**కన్య :** సంతానం విషయంలో కొంత మానసిక ఆందోళనకు గురవుతారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**తుల :** మీ కుటుంబ వ్యవహారాలలో అతిగా జోక్యం చేసుకునే వారిని ఆదిలోనే తృంచి వేయండి.

**వృశ్చికం :** తామరాకు మీద నీటి బిందువులా ఉండటం వలన లాభ పడతారు. వస్తులాభం. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి.

**ధనుస్సు :** కారణం లేని చికాకులు మానసిక ప్రశాంతతకు భంగం కలిగిస్తాయి. సోదరుల కలయిక. స్వల్ప ధనలాభం పొందుతారు.

**మకరం :** ముఖ్యమైన పనుల విషయములో ఓర్పు వహించుట చాలా అవసరము. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

**కుంభం :** విదేశీ వస్తువుల ఆకర్షణ నుండి బయట పడుటకు జాగ్రత్తను వహించండి. జీవిత భాగస్వామి నుండి ధనలాభం.

**మీనం :** వినోదమును సౌకర్యమును కలిగించే వస్తువులకు, పూజలకు దాన ధర్మములకు కాలమును వెచ్చిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# పార్టీ ముసుగులో క్రిమినల్స్ వస్తున్నారు..

**శాంతిభద్రతల సమస్యలు సృష్టిస్తున్నారు..**
**17 నుంచి 4 రోజులు అసెంబ్లీ సమావేశాలు**
**13న సీడ్ యాక్సెస్ రోడ్డు ప్రారంభం**
**మంత్రులతో సిఎం చంద్రబాబు భేటీ**

**విజయవాడ.ఆగస్టు6, ప్రభాతవార్తప్రతినిధి:** రాజకీయ పార్టీల ముసుగులో క్రిమినల్స్ తయారవుతున్నారని, ప్రశాంతంగా ఉండే జిల్లాల్లో శాంతి భద్రతల సమస్య సృష్టిస్తున్నారని సిఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసారు.ఇటువంటి అరాచక శక్తుల నిజస్వరూపం మంత్రులు, ప్రజా ప్రతినిధులు ప్రజలకు వివరించాలన్నారు.కేబినేట్ సమావేశం ముగిసిన అనంతరం మంత్రులతో పలు కీలక అంశాలపై సిఎం చంద్రబాబు చర్చించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యర్థిపార్టీ మీటింగ్ అంటే లైసెన్స్ ఇచ్చినట్లు మందు తాగించి తరలిస్తున్నారని, గంజాయి బ్యాచ్‌ని జెన్‌జీ అని చెప్పుకోవడం గొడ్డలి పార్టీకే చెల్లిందన్నారు. పొగాకు రైతులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత తీసుకోవాలని మంత్రులకు సీఎం సూచించారు. ఎపి శాసనసభ సమావేశాలను ఈనెల 17, 18, 19, 20 తేదీల్లో 4 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు సిఎం చంద్రబాబు తెలిపారు. గత పాలకులు దిశ చట్టం పేరుతో ప్రజల్ని మోసగించి, కేవలం ఉత్తుత్తి పోలీస్ స్టేషన్లు, వాహనాలతో హంగామా చేశారని మహిళల భద్రతకు తీసుకున్న చర్యలు శూన్యమని మండిపడ్డారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే మహిళల భద్రత కోసం సమగ్రంగా చట్టసవరణ చేసి, మరింత పటిష్టంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఆక్వా రైతులకు ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్ అనే తేడా లేకుండా రూ.11 వందల కోట్ల విద్యుత్ రాయితీలు ఇచ్చామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. డిఎస్సీని పారదర్శకంగా నిర్వహించామనే అసూయతోనే వైఎస్సార్సీపీ నేతలు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసుల్ని న్యాయస్థానాలు కొట్టేసి చివాట్లు పెడుతున్నా బుద్ధి మార్చుకోవట్లేదన్నారు. ఈనెల 13న సీడ్ యాక్సిస్ రహదారి ప్రారంభిస్తామని సిఎం తెలిపారు. దుబాయ్ ఐవీల్ 250 మీటర్ల ఎత్తులో ప్రపంచంలో పెద్దదిగా ఉందని, అమరావతి ఐవీల్ అంతకంటే పెద్దదిగా ఉండాలన్నారు. ఈ నెల 13వతేదీన సీడ్‌యాక్సెస్ రోడ్డును ప్రారంభిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. సీడ్ యాక్సెస్‌రోడ్డులో సిఎం కాన్వాయ్ ప్రయాణించి నేరుగా ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్దకు వస్తుందని వెల్లడించారు. అక్కడ వాటి తాళాలను ముఖ్యమంత్రికి అందజేస్తారని చెప్పారు. విజయదశమి నాటికి మంత్రుల క్వార్టర్స్‌ను సిద్ధం చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. దసరా పండుగ నాటికి మంత్రుల విల్లాలనిర్మాణంకూడా పూర్తవుతుందని ఈ సమావేశంలో మంత్రినారాయణ సిఎంకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం పిలుపునిచ్చిన 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా, రాష్ట్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రతిబింబించేలా ఘనంగా నిర్వహించాలని సిఎం చంద్రబాబు సూచించారు. ఈనెల చివర్లోనే వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభిస్తామని సిఎం చంద్రబాబు ప్రకటించారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటిని సమర్థంగా వినియోగించుకుంటూ మంచినీటి ఎద్దడిని అధిగమించాలని, ఆ తర్వాత ప్రాధాన్యతగా పశుగ్రాసం కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సిఎం దిశానిర్దేశం చేశారు.గత పాలకులు దిశ చట్టం పేరుతో ప్రజల్ని మోసగించి, కేవలం ఉత్తుత్తి పోలీస్ స్టేషన్లు, వాహనాలతో హంగామాచేశారని మహిళల భద్రతకు తీసుకున్నచర్యలు శూన్యమని మండిపడ్డారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే మహిళల భద్రత కోసం సమగ్రంగా చట్టసవరణచేసి, మరింత పటిష్టంగా అమలుచేస్తామని స్పష్టం చేశారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలో బుధవారం అడవి పందులు పొలాల్ని నాశనం చేసిన తరహాలో గొడ్డలి పార్టీ శ్రేణులు వ్యవహరించారని సీఎం ధ్వజమెత్తారు. ఓ మహిళ చిరు వ్యాపారి పొట్ట గొట్టడంతో పాటు హిందూ దేవుళ్ల చిత్రపటాలు పగలకొట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పొగాకు బేళ్లను తొక్కి నాశనం చేసి పరామర్శ ముసుగు తగిలించుకున్నారని మండిపడ్డారు.

**అగ్రిగోల్డ్ అంశంపై చర్చ..**

అగ్రిగోల్డ్ అంశంపై కేబినెట్ అనంతరం మంత్రులతో సిఎం చంద్రబాబు సుదీర్ఘంగా చర్చించారు. అగ్రిగోల్డ్ వ్యవహారంలో కేబినెట్ సబ్ కమిటీ చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అగ్రిగోల్డ్ బాధితులు 11 రాష్ట్రాల్లో ఉన్నారని చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితులకు సాధ్యమైనంతవరకు త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. భూములు వేలం వేయడంలో సరైన ధర రావాలని సూచించారు. బాధితులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వేలంతో పాటు ఇతర ప్రత్యామ్నాయాలుకూడా చూడాలని కేబినెట్ సబ్ కమిటీకు సూచించారు. ఇప్పటికే 15 యేళ్ల పూర్తి అయిందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. కేబినెట్ సబ్ కమిటీ ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సిఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.



గురువారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న మంత్రులు, ప్రజాప్రతినిధులు

# తెలుగు ఎంపీల భేటీ

## ఢిల్లీలోని కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ నివాసంలో ఆత్మీయ సమ్మేళనం

**విజయవాడ ఆగస్టు 6,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఢిల్లీలోని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ నివాసం వద్ద ఏర్పాటు చేసిన రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్‌డిఎ ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అభివృద్ధి, ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంకు కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, గంగాపురం కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ఎంపీలు దగ్గుబాటి పురందరేశ్వరి, ఎం. శ్రీభరత్, గంటి హారీష్ మాథుర్, కేశినేని శివనాథ్, బైరెడ్డి శబరి, ఈటెల రాజేందర్, డికె అరుణ, బీదా మస్తాన్ రావు (బిఎంఆర్), కలిశెట్టి అప్పలనాయుడు, పాక సత్యనారాయణ, భాష్యం రామకృష్ణ,సానా సతీష్ బాబు, చింతకాయల విజయ్, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, సీనియర్ బిజెపి నాయకులు బంగారు లక్ష్మణ్, అలాగే పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కూడా ఈ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విచ్చేసిన కేంద్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ఆత్మీయ విందును ఏర్పాటు చేశారు. పార్లమెంట్ సమావేశాల బిజీ షెడ్యూల్ మధ్య రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్‌డిఎ ప్రజాప్రతినిధులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి ఈ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించినందుకు భూపతిరాజు శ్రీనివాస వర్మను పలువురు నేతలు అభినందించారు. రాష్ట్రాల అభివృద్ధి, ప్రజా ప్రయోజనాల సాధన కోసం ఇలాంటి సమన్వయ సమావేశాలు భవిష్యత్తులో కూడా తరచుగా నిర్వహించాలని సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు.

# యువ వైద్యురాలిపై దూసుకెళ్లిన కారు

>> కారుతో ఢీ కొట్టారు. దీనిపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేయగా, అనంతరం జరిగిన ఘటనలో ఆమె కారు కిందపడి తీవ్రంగా గాయపడింది. ఈ ఘటనలో ఇద్దరు యువకుల పాత్రపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.మొదట రాజమండ్రిలోని స్వతంత్ర ఆసుపత్రిలో చికిత్స అందించిన వైద్యులు, అనంతరం ఆమెను బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించినట్లు సమాచారం. చివరి ప్రయత్నంగా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై రాజమండ్రి వైద్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసనకు సిద్ధమవుతున్నారు. ఘటనకు సంబంధించి నామవరం ప్రాంతానికి చెందిన ఆ ఇద్దరు యువకులను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. రాజమండ్రి ప్రకాష్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# స్థానిక ఎన్నికలకు సమాయత్తం కండి

>> వర్షాభావం, ఎల్‌నినో పరిస్థితులు, తాగునీటి ఎద్దడి నివారణ, పశుగ్రాస కొరత రాకుండా చూడటం వంటి అంశాలకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తూ అసెంబ్లీ వేదికగా ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని లోకేష్ మంత్రులకు పిలుపునిచ్చారు.ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో మంత్రులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.ఇక ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ హామీల అమలు గురించి ప్రజలకు వివరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఇంటింటికీ టిడిపి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని మంత్రులు వివరిస్తున్నారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమై వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకోవడం ద్వారా ప్రజలకు మరింత చేరువయ్యే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రులు పేర్కొంటున్నారు. స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

# అనుసంధాన ప్రాజెక్టుకు బ్రేక్!

>> తీసుకుంది. ప్రాజెక్టుకు ముందు కేంద్ర జల సంఘం (సిడబ్ల్యూసి) ద్వారా వరద జలాల లభ్యతపై సమగ్ర అధ్యయనం చేయించాలని కేంద్రం సూచించింది. అంతర్రాష్ట్ర వివాదాలు పరిష్కరించిన తర్వాతే పర్యావరణ అనుమతుల కోసం మళ్లీ దరఖాస్తు చేయాలని స్పష్టం చేసింది. రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి నుంచి 200 టిఎంసిల వరద జలాలను రాయలసీమకు తరలించాలని ఎపి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల సుమారు 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అయితే కేంద్రం తొలి దశలోనే ప్రతిపాదనను వెనక్కి పంపడంతో ప్రాజెక్టు ముందడుగు తాత్కాలికంగా నిలిచిపోయింది.

# చేనేతకు మరింత చేయూత

>> టిస్తున్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు క్యాంప్ కార్యాలయం నుంచి బయలుదేరి వేటపాలెం మండలం కొత్తపేట గ్రామానికి 10.50 గంటలకు చేరుకుంటారు. 11.05 గంటలకు ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 01.35 గంటలకు జాండ్రపేటలో చేనేతల వర్క్‌షాప్‌లో లబ్ధిదారులతో ముఖాముఖి అవుతారు. కొత్తపేటలో 04.10 గంటలకు టిడిపి శ్రేణులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 04.45 గంటలకు సిఎం క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

# నీట్ విద్యార్థిని కానూరులో ఆత్మహత్య

## కుటుంబానికి దూరంగా ఉండలేక హాస్టల్ గదిలో ఉరివేసుకున్న హైదరాబాద్ యువతి

**విజయవాడ.ఆగస్టు6,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లాకానూరులోని ఓ కళాశాలలో నీట్ శిక్షణ పొందుతున్న హైదరాబాద్‌లోని బేగంపేటకు చెందిన విద్యార్థిని కంతేటి వైష్ణవి (19) ఓ కళాశాల వసతిగృహంలో ఆత్మహత్యకు పాల్పడింది. ఇటీవల రెండు రోజుల పాటు ఇంటికి వెళ్లి తిరిగి హాస్టల్‌కు వచ్చిన వైష్ణవి.. కుటుంబానికి దూరంగా ఉండటం తన వల్ల కావడం లేదని, ఇంత దూరంలో ఉండి చదవడం కష్టంగా ఉందని పలుమార్లు తల్లిదండ్రులకు ఫోన్‌లో తన ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే ఆమె భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు ధైర్యం చెబుతూ చదువుపై దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ నెల 4వ తేదీన ఆరోగ్యం బాగోలేదని చెప్పి వైష్ణవి తరగతులకు హాజరుకాకుండా హాస్టల్ గదిలోనే ఉండిపోయింది. రాత్రి సమయంలో గదిలో ఉన్న ఇతర విద్యార్థినులు తిరిగి వచ్చి తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో కళాశాల సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది కిటికీ నుంచి పరిశీలించగా వైష్ణవి ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఆమె అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థిని మృతి వార్త అందుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన కానూరుకు చేరుకున్నారు. చదువు కోసం పంపించిన కుమార్తె విగతజీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. వైష్ణవి మృతికి గల కారణాలు ఏమిటనే అంశంపై విచారణ కొనసాగుతోంది.

# రాష్ట్ర పండుగగా నేడు పొన్నమండ లక్ష్మణస్వామి జయంతి



**విజయవాడ, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** అగ్ని కుల క్షత్రియుల జాతిపిత పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ జయంతిని నేడు (శుక్ర వారం) రాష్ట్ర పండుగ గా నిర్వహించనున్నట్లు మంత్రి ఎస్.సవిత తెలిపారు. పొనమ్మండ లక్ష్మణస్వామివర్మ రాష్ట్ర స్థాయి జయంతిని కాకినాడ జిల్లా కోరింగలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. అగ్నికులక్షత్రియ సామాజిక వర్గం అభివృద్ధికి పొన్నమండ లక్ష్మణస్వామి విశేష కృషి చేశారన్నారు. తన సామాజిక వర్గంతో పాటు పేదల అభ్యున్నతికి విశేష కృషిన సమాజ సంస్కర్త అని కొనియాడారు. 1890లో కాకినాడ సమీపంలోని కోరంగి గ్రామంలో అగ్నికుల క్షత్రియుల ప్రప్రథమ రాష్ట్రస్థాయి మహాసభను నిర్వహించి, ఆ సామాజిక వర్గీయులను ఒక తాటిపైకి తీసుకొచ్చారన్నారు. ఆయుర్వేద వైద్య రంగంలోనూ పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ విశేష సేవలు అందించారన్నారు. 120 రకాల ఔషధాలను తయారు చేసి దేశ విదేశాలకు పంపిణీ చేసిన మహనీయుడని కొనియాడారు. అగ్నికుల క్షత్రియ సమాజానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. ఆయన కృషి ఫలితంగానే 1927లో జీవో నెం. 271 ద్వారా అగ్నికుల క్షత్రియులు అనే అధికారిక గుర్తింపు లభించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారిక రాష్ట్ర పండుగగా నిర్వహించాలని నిర్ణయించడం సమాజానికి దక్కిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు నిర్ణయంపై మంత్రి హర్షం వ్యక్తంచేశారు.

# అమరావతిలో మళ్లీ భూ సమీకరణ

- మోతడకలో 2,340 ఎకరాలు తీసుకోవాలని నిర్ణయం



**విజయవాడ, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతిలో మళ్లీ భూ సమీకరణను సిఆర్‌డిఎ (క్రడా) చేపడుతుంది. రెండోవిడతలో 20,494 ఎకరాలు తీసుకుంటున్న ప్రభుత్వం తాజాగా మూడోవిడత కూడా చేపట్టనుంది. దీనిలో భాగంగా తొలిదశలో మోతడక గ్రామంలో సమీకరణ కోసం 2,340 ఎకరాలు తీసుకోవాలని నిర్ణయించింది. రైల్వే ప్రాజెక్టు కోసం దీన్ని తీసుకుంటున్నామని, గ్రామస్తుల కోరిక మేరకే ఈ ప్రక్రియ చేపట్టామని ప్రభుత్వం చెబుతున్నా వాస్తవంగా గతంలోనే ఈ ప్రాంతంలో సమీకరణకు వీలుగా గ్రామసభలను పూర్తి చేయడం గమనార్హం. తాడికొండ మండలంలోని మోతడకలో మొత్తం 2, 376 ఎకరాల భూమి ఉండగా మొత్తం సమీకరణ పథకం కింద తీసుకోవాలని నిర్ణయించారు. గ్రామంలో మొత్తం 972 నివాసాలు ఉండగా 3,200 మంది నివాసం ఉంటున్నారు.


తాడికొండ మండలం మొత్తంలో 48,500 ఎకరాల భూమి ఉంది. గతంలో ఈ మండలం పరిధిలోని గ్రామాల్లో భూ సమీకరణకు వీలుగా గ్రామసభలు నిర్వహించారు. 12 రెవెన్యూ గ్రామాల్లో సభలు పూర్తి చేశారు. వాటిల్లో తాడికొండ పరిధిలోని పాములపాడు, బండారుపల్లె, పొన్నెకల్లు, రావెల, లామ్, బేజాత్పురం, దామరపల్లె గ్రామాలు కూడా ఉన్నాయి. గతంలో ఉన్న అనుభవాల దృష్ట్యా ఈసారి మొత్తం గ్రామాలు ఒకేసారి కాకుండా గ్రామసభలు నిర్వహించి, వారి కోరిన తరువాతే భూ సమీకరణ పథకానికి వెళ్లాలని నిర్ణయించి దానిలో భాగంగా భూ సమీకరణ పథకాన్ని అమలు చేస్తున్నారు. ముఖ్యంగా రైల్వేలైను ఏర్పాటు కోసం భూ సమీకరణ చేస్తున్నామని చెబుతున్నా వాస్తవంగా అంతకుముందే ఈ గ్రామాలను రాజధానిలో కలపాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం మోతడకలో 2340 ఎకరాలు తీసుకుంటున్నారు.

## గ్రామసభల్లో పూలింగ్ కోసం తీర్మానం

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తుళ్లూరు మండలంలో మిగిలిన గ్రామాలతోపాటు అమరావతి, తాడికొండ, పెదకూరపాడు మండలాల పరిధిలోని పలు చోట్ల గ్రామసభలు నిర్వహించారు. దీనిలో తాడికొండలో 5179 హెక్టార్లు, బందరుపల్లిలో 1930, పాములపాడులో 1694, పొన్నెకల్లులో 1546, కంతేరులో 1486, బేజాత్పురంలో 1342, దామరపల్లెలో 1168 హెక్టార్ల భూమిని సమీకరణ కింద ఇచ్చేలా ఎమ్మెల్యే తదితరులు గ్రామసభల్లో తీర్మానం చేయించారు. అయితే నిడుముక్కల గ్రామంలో 815 హెక్టార్లు తీసుకోవాలని తీర్మానం చేసినా రెండో విడత జరిగిన గ్రామసభలో అక్కడి ప్రజలు వ్యతిరేకించారు. తాము పూలింగుకు ఇవ్వబోమని అభ్యంతరం తెలిపారు.

## రెండోదశ మాస్టర్ ప్లానుకు సిద్ధం

రెండోదశలో సమీకరించిన భూమికి మాస్టర్ ప్లాను తయారు చేసే బాధ్యతను సింగపూరుకు చెందిన సుర్బానాకు అప్పగించారు. దీనికి సంబంధించిన సమగ్ర సమాచారం సీఆర్డీఏ సుర్బానాకు అందిస్తోంది. త్వరలోనే ప్లాను పూర్తి చేసే అవకాశం ఉందని తెలిసింది. ప్రాథమిక అంచనాలు పూర్తయినా సమగ్ర ప్లాను తీసుకొచ్చేదిశగా ఏర్పాట్లు చేస్తున్నారు.



గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన వల్లూరి అజయ్‌బాబు, ఆయన కుటుంబసభ్యులతో మంత్రి నారా లోకేష్

# అజయ్.. దేశానికి గర్వకారణంగా నిలిచారు

- కామన్వెల్త్ గేమ్స్ పతక విజేతను అభినందించిన మంత్రి లోకేష్

**విజయవాడ, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతిష్టాత్మక గ్లాస్గో కామన్వెల్త్ క్రీడల్లో వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రజత పతకం సాధించిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వల్లూరి అజయ్ బాబు, కుటుంబ సభ్యులతో కలిసి గురువారం విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను ఉండవల్లి నివాసంలో కలిశారు. ఇటీవల గ్లాస్గోలో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో విజయనగరం జిల్లా కొండవెలగాడ గ్రామానికి చెందిన అజయ్ బాబు వెయిట్ లిఫ్టింగ్ 79 కేజీల విభాగంలో రజత పతకాన్ని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. కామన్వెల్త్ క్రీడల్లో అద్భుత ప్రదర్శన కనబరచిన వల్లూరి అజయ్ బాబును ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు. రజత పతకం సాధించి దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. 2010లో ఢిల్లీలో జరిగిన కామన్వెల్త్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో తండ్రి కాంస్య పతకం సాధించగా కుమారుడు 16యేళ్ల తర్వాత రజత పతకం సాధించి రికార్డ్ సృష్టించారని ప్రశంసించారు. వచ్చే ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే లక్ష్యంగా అజయ్ బాబు ముందుకు సాగాలని మంత్రి ఆకాంక్షించారు. అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం అజయ్ బాబును మంత్రి శాలువాతో సత్కరించి, ప్రత్యేక జ్ఞాపికను బహూకరించారు.

ఈ కార్యక్రమంలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండి ఎస్.భరణి పాల్గొన్నారు.

**వెయిట్‌లిఫ్టర్‌కు సన్మానం:** కామన్వెల్త్ గేమ్స్ రజత పతక విజేత వల్లూరి అజయ్ బాబుకు విజయవాడ శాప్ కార్యాలయంలో ఘన సన్మానం జరిగింది. శాప్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవినాయుడు, విసి, ఎండి భరణి పాల్గొని ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. అజయ్‌బాబు మరిన్ని విజయాలు సాధించాలని రవినాయుడు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టం తన పని తాను చేస్తుంది

- హోంమంత్రి వంగలపూడి అనిత



**సచివాలయం, ఆగస్టు 6 ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి రెండేళ్ళు పూర్తవుతున్న తరుణంలో రాష్ట్రంలో జరిగిన మంచి-చెడులను, గత పాలనకు ప్రస్తుత పాలనకు ఉన్న తేడాను ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. ఒక ప్రజాప్రతినిధిగా, ఒక మహిళగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను రెండు కోణాల్లోనూ చూస్తున్నానని పేర్కొన్నారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో మీడియ సమావేశంలో హోంమంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు 75ఏళ్ళు దాటిన వయస్సులోనూ రోజుకు దాదాపు 18గంటలు రాష్ట్రం కోసం శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాలు తీసుకురావాలనే లక్ష్యంతో దేశ విదేశాల్లో పర్యటిస్తూ పెట్టుబడిదారులతో సమావేశమవుతున్నారన్నారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం అందిస్తుండగా, మంత్రి నారా లోకేష్ పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఒకవైపు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం శ్రమిస్తుంటే.. మరోవైపు జగన్ బయటకు వచ్చిన ప్రతిసారీ ఏదో ఒక వివాదం, ఉద్రిక్తత ఎందుకు ఏర్పడుతోంది? పరామర్శ పేరుతో వెళ్ళిన చోట ప్రజలకు భరోసా కల్పించేలా అలజడి సృష్టించాలా? అని హోంమంత్రి ప్రశ్నించారు.

**పరామర్శకు వెళ్తున్నారా... రాజకీయ ఉద్రిక్తతలకు వెళ్తున్నారా?:** మిర్చి, పొగాకు, మామిడి రైతుల పరామర్శ పేరుతో నిర్వహించిన పర్యటనల్లో చోటుచేసుకున్న ఘటనలపై జగన్ ప్రజలకు సమాధానం చెప్పాలని హోంమంత్రి డిమాండ్ చేశారు. రైతులకు అండగా నిలబడాల్సిన సందర్భాలను రాజకీయ ప్రదర్శనలుగా మార్చడం వల్ల రైతులకు మేలు జరుగుతుందా అని ప్రశ్నించారు. "రైతు కంటతడి తుడవడానికి వెళ్తున్నారు? రాజకీయ ఉద్రిక్తతలు సృష్టించడానికి వెళ్తున్నారా? రైతులు పేరుతో నిర్వహించే కార్యక్రమాల్లో రైతులకే నష్టం జరిగితే దానికి ఎవరు బాధ్యత వహిస్తారు" అని ప్రశ్నించారు. పొగాకు రైతుల పరామర్శ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో రాళ్ళు, చెప్పులు విసిరిన ఘటనలు, మహిళా పోలీసుల విధులకు ఆటంకం కలిగించినట్లు వచ్చిన ఆరోపణలను జగన్ ఖండించారా అని ప్రశ్నించారు. మహిళల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు చేసిన వారిని పరామర్శించడం ద్వారా సమాజానికి ఎలాంటి సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. మహిళల భద్రత గురించి మాట్లాడే నాయకులు ముందుగా మహిళా పోలీసులకు, సాధారణ మహిళలకు గౌరవం ఇవ్వాలని సూచించారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేసిన కఠిన చర్యలు చేపడుతోందని హోంమంత్రి అనిత తెలిపారు. యువతను మాదకద్రవ్యాల నుంచి కాపాడేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్న సమయంలో, నేరారోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల పరామర్శల ద్వారా సమాజానికి ఎలాంటి సంకేతం ఇస్తున్నారో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. "జెన్ జి నా వెనుక ఉందని చెప్పడం కాదు.. ఆ జెన్ జి భవిష్యత్తును కాపాడాలి. యువత చేతిలో గంజాయి కాదు.. ఉద్యోగం ఉండాలి.. మాదకద్రవ్యాలు కాదు.. నైపుణ్యం ఉండాలి. అదే మా ప్రభుత్వ లక్ష్యం" అని మంత్రి అనిత పేర్కొన్నారు. చివరిగా రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి మంత్రి అనిత మాట్లాడుతూ "గతపాలనను చూశారు.. ఈ రెండేళ్ళ కూటమి పాలనను చూస్తున్నారు. ఎవరు అభివృద్ధి చేస్తున్నారు? ఎవరు పెట్టుబడులు తెస్తున్నారు? ఎవరు ఉద్యోగాల కోసం శ్రమిస్తున్నారు? ఎవరి పర్యటనలతో ఉద్రిక్తతలు వస్తున్నాయి? అన్నది ప్రజలే ఆలోచించాలి. మాది అభివృద్ధి రాజకీయమైతే.. అరాచక రాజకీయాలకు ప్రజలే సమాధానం చెప్పాలి" అని పేర్కొన్నారు.



# భక్తులతో తిరుమలకొండ కిటకిట

**తిరుమల, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** వరుససెలవులు... ఆపై వారాంతం కలసి రావడంతో ఏడుకొండలు భక్తులతో నిండిపోయింది. గురువారం ఉదయానికి భక్తుల లైన్లు శిలాతోరణం వరకు చేరాయి. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమంది వరకు భక్తులు తిరుమలకు చేరుకోవడంతో గురువారం ఉదయానికి కొండ కిటకిటలాడుతోంది. వారాంతం శుక్ర, శని, ఆదివారాలు, తెలంగాణలో సోమవారం కూడా సెలవు కలసి రావడంతో ఉదయం 6గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-2 క్యూకాంప్లెక్స్ నిండిపోయి భక్తుల క్యూలైన్లు వెలుపలకు చేరాయి. వెలుపల లైన్లల్లో భక్తులు వేలాదిమంది బారులుతీరి నిలబడ్డారు. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 20గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో ఆరేడుగంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. దీంతో టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలు అందిస్తున్నారు. వైకుంఠం కంపార్టుమెంట్లలో, క్యూలైన్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, టీ శ్రీవారి సేవకులు పంపిణీ చేస్తున్నారు. సాయంత్రం వరకు 55వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

# కృష్ణా డెల్టా, హంద్రీనీవా, కెసి కెనాల్‌కు తక్షణమే నీరు వదలాలి

**విజయవాడ, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కృష్ణా డెల్టా, హంద్రీనీవా మరియు కేసీ కెనాల్‌కు వెంటనే సాగునీటిని విడుదల చేయాలని పలు రైతు సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జమలయ్య, రైతు సంఘం సీనియర్ నాయకులు వై. కేశవరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్నీడి యలమందారావు, అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర నాయకులు ఎస్.వి.వి. సత్యనారాయణ, రైతు సంఘం రాష్ట్ర నాయకులు అనుమోలు సురేంద్రనాథ్ బెనర్జి తదితరులు కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. కృష్ణా డెల్టా సంప్రాదాయకంగా వరి, చెరకు పంటలపై ఆధారపడి ఉందని బాపట్ల, గుంటూరు, కృష్ణా, ఏలూరు, ప్రకాశం జిల్లాల్లో దాదాపు 13 లక్షల ఎకరాల్లో వరి పంటే ప్రధాన జీవనాధారమని, సాగునీరు ఇవ్వకపోతే రైతాంగం తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడటమే కాకుండా, లక్షలాది మంది వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోతారని విన్నవించారు.

# ఎల్‌నినోతో పాడిపరిశ్రమపై పెనుప్రభావం

- ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో వెబినార్‌లో పలువురు వక్తలు



**తిరుపతి(విద్య), ఆగస్టు 6 ప్రభాతవార్త:** పశుసంపద, కోళ్ల ఉత్పత్తిపై ఎల్‌నినో చూపే ప్రతికూల ప్రభావాలను ఎదుర్కొనేందుకు వీలుగా శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం (ఎస్వీవీయూ) ఆధ్వర్యంలో రెండు రోజుల ఆన్‌లైన్ వెబినార్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. పశుసంపద, కోళ్లపై ఎల్‌నినో ప్రభావాలను ఎదుర్కొనే వ్యూహాలు అనే అంశంపై నిర్వహిస్తున్న ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయి పశువైద్యులు, పశుసంవర్ధక శాఖ అధికారులు, వర్సిటీ అధ్యాపకులు, ప్రగతిశీల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విస్తరణ సంచాలకులు డాక్టర్ బి. శోభామణి స్వాగత ప్రసంగం చేస్తూ పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడే ఎల్‌నినో వల్ల దేశంలో నైరుతి రుతుపవనాలు బలహీనపడతాయని వివరించారు. దీని ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగి, ముఖ్యంగా అధిక పాలదిగుబడి ఇచ్చే పశువులు తీవ్ర వేడి ఒత్తిడికి (హీట్ స్ట్రెస్) గురవుతాయని తెలిపారు. వేడి ఒత్తిడి వల్ల కేవలం పాల దిగుబడి తగ్గడమే కాకుండా పాలలో కొవ్వు శాతం పడిపోవడం, సంతానోత్పత్తి సామర్థం తగ్గడం, గర్భస్రావాలు కావడం, తక్కువ బరువుతో దూడలు పుట్టడం వంటి దీర్ఘకాలిక సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీ గౌరవ ఉపకులపతి డాక్టర్ జె.వి. రమణ మాట్లాడుతూ ఎల్‌నినో తీవ్రత వల్ల పచ్చిమేత, పొడి మేత, దాణా కొరత ఏర్పడి, వాటి ధరలు విపరీతంగా పెరుగుతాయని పేర్కొన్నారు. బలహీనమైన రుతుపవనాల వల్ల ఇప్పటికే ఉన్న మేత కొరత మరింత తీవ్రమై రైతులపై ఆర్థిక భారం పడుతుందని వివరించారు. అనంతరం పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి. దామోదర్ నాయుడు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావాలను తగ్గించి పశుసంపదను కాపాడుకునేందుకు అవసరమైన శాస్త్రీయ పద్ధతులను రైతుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ప్రభుత్వం ఆదేశించినట్లు తెలిపారు. సదస్సులో వర్సిటీ ప్రముఖ అధ్యాపకులు పశువులు, పౌల్ట్రీ పరిశ్రమలో ఆశ్రయ నిర్వహణ, మేత మేనేజ్‌మెంట్, వ్యాధుల నియంత్రణ వంటి కీలక అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ల ద్వారా వివరించారు. ఈ వెబినార్ కార్యక్రమం శుక్రవారం కూడా కొనసాగుతుందని, మొదటి రోజు సదస్సుకు విశేష స్పందన లభించిందని విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.శోభామణి వెల్లడించారు.

# మరో రెండు ఎయిమ్స్ ఇవ్వండి

## కేంద్ర మంత్రి జెపి నడ్డాకు ఎంపి లింగమనేని రమేశ్ వినతి



**విజయవాడ, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు మరో రెండు కొత్త ఎయిమ్స్ (ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) మంజూరు చేయాలని, జనసేన పార్టీ రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రస్తుతం సేవలందిస్తున్న మంగళగిరి ఎయిమ్స్‌ను పూర్తిస్థాయి జాతీయ స్థాయి అత్యుత్తమ వైద్య కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ మేరకు ఆయన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి. నడ్డాకు గురువారం వినతిపత్రాన్ని సమర్పించారు.

రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు ఐదు కోట్ల జనాభాకు ఒకే ఒక ఎయిమ్స్ సరిపోవడం లేదని ఎంపీ లింగమనేని రమేష్ వివరించారు. భౌగోళిక విస్తృతిని, ప్రాంతీయ అవసరాలను పరిగణనలోకి తీసుకుని రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో ఒక్కొక్కటి చొప్పున ఎయిమ్స్ మంజూరు చేయాలని ఆయన కోరారు. గుండె జబ్బులు, క్యాన్సర్, న్యూరో, అవయవ మార్పిడి, అత్యవసర ట్రామా కేర్ వంటి వైద్య సేవల కోసం ఈ ప్రాంత ప్రజలు వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని, ఈ ఇబ్బందులను తొలగించాలంటే ఆయా ప్రాంతాల్లో కొత్త ఆస్పత్రుల నిర్మాణం అవసరమని పేర్కొన్నారు.

గతంలో జమ్మూ కశ్మీర్, బిహార్ వంటి చోట్ల ఒకటికి మించి ఎయిమ్స్ సంస్థలను కేంద్రం మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఎపికి కూడా అదే ప్రాతిపదికన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న మంగళగిరి ఎయిమ్స్‌ను మరింత విస్తరించి కాంప్రహెన్సివ్ క్యాన్సర్ సెంటర్, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ ఇన్‌స్టిట్యూట్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోసైన్సెస్, అడ్వాన్స్‌డ్ కార్డియాక్ కేర్ సెంటర్‌లతోపాటు మరిన్ని పడకలు, బోధనా సిబ్బందిని కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో ఉచిత, నాణ్యమైన వైద్య సదుపాయాల కల్పనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రధాన్ మంత్రి స్వస్థ్య సురక్ష యోజన తదుపరి విడతలో ఈ ప్రతిపాదనలకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర మంత్రి నడ్డాను లింగమనేని రమేశ్ కోరారు.

# దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో 70 స్టేషన్ల అభివృద్ధి పనులు

## దక్షిణ తీర రైల్వే రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్



**గుంతకల్ రైల్వే, ఆగస్టు 4 ప్రభాతవార్త:** దక్షిణ కోస్తా రైల్వే జోన్ జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ మీడియాతో మాట్లాడుతూ, జూన్-2026 నుండి జోన్ పనితీరుపై వివరాలు వెల్లడించారు. 2026 జూన్ 1 నుంచి కార్యకలాపాలు ప్రారంభించిన దక్షిణ తీర రైల్వే కొత్త రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించిన సవాళ్లను విజయవంతంగా కేవలం రెండు నెలల కార్యకలాపాల్లోనే విశేష విజయాలు సాధించిన అధిగమిస్తూ మౌలిక సదుపాయాల అభివృద్ధి, భద్రత, ప్రయాణికుల సేవలు, కార్యనిర్వహణలో విశేష పురోగతి సాధించింది. కొత్త జోన్ ఏర్పాటులో మౌలిక సదుపాయాల నిర్మాణం, సిబ్బంది నియామకం, ఆర్థిక వ్యవస్థ ఏర్పాటు, బడ్జెట్ కేటాయింపు, ప్రాజెక్టుల పునర్విభజన, నియంత్రణ వ్యవస్థల ఏర్పాటు, కార్యాచరణ నియమావళి అమలు వంటి అనేక కీలక పనులు చేపట్టబడ్డాయి. ప్రస్తుతం ఈ జోన్‌లో నాలుగు డివిజన్లు ఉండగా, మొత్తం 3,532 రూట్ కిలోమీటర్లు, 6,455 ట్రాక్ కిలోమీటర్లు (టికెయం) పరిధిలో సేవలు అందిస్తోంది. వార్షిక మూల ఆదాయం సుమారు రూ.15,500 కోట్లు, సరుకు రవాణా 100 మిలియన్ టన్నులకు పైగా ఉండనుంది. ఈ జోన్ పరిధిలో 7 లోకో షెడ్లు, 3 వర్క్‌షాప్‌లు, 7 కోచింగ్ డిపోలు, 4 ఫ్రైట్ డిపోలు, నాలుగు ప్రధాన నౌకాశ్రయాలు ఉన్నాయి. జోన్ ఏర్పడిన నాటి నుంచే భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చారు. గత రెండు నెలల్లో సీనియర్ అధికారులు సుమారు 1,700 రూట్ కిలోమీటర్లు (3,000 ట్రాక్ కిలోమీటర్లు) పరిశీలించి, మౌలిక సదుపాయాలు, ప్రజల అవసరాలు, కొనసాగుతున్న పనులు, భద్రతా ప్రమాణాలను సమీక్షించారు. ప్రస్తుతం 5 కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టులు, 24 మల్టీట్రాకింగ్ పనులు సుమారు రూ.54,479 కోట్ల వ్యయంతో అమలులో ఉన్నాయి. అదనంగా రూ.70,865 కోట్ల విలువైన ప్రాజెక్టులు ప్రణాళిక దశలో ఉన్నాయి. అలాగే భద్రత, రహదారి అనుసంధానాన్ని మెరుగుపరచేందుకు 300కు పైగా రోడ్ ఓవర్ బ్రిడ్జిలు (ఆర్‌ఓబి), అండర్ బ్రిడ్జి(ఆర్‌యుబి)లు నిర్మాణంలో ఉన్నాయి. రాజమహేంద్రవరంలో జరగనున్న గోదావరి పుష్కరాల సందర్భంగా రైల్వే ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష చేపట్టింది. కేవలం రెండు నెలల్లోనే విశాఖపట్నం యార్డ్ రీమోడలింగ్ ప్రాజెక్టుకు రూ.300 కోట్ల ఆమోదం లభించింది. ఇందులో అదనంగా ఆరు లైన్లు, 8 నుంచి 14 వరకు ఆరు కొత్త ప్లాట్‌ఫారాలు, ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్, ప్లాట్‌ఫారాల విస్తరణ వంటి పనులు ఉన్నాయి. అలాగే రూ.1,205 కోట్లతో గుంతకల్-బళ్లారి నాలుగు లైన్ల ప్రాజెక్టు, తిరుపతిలో రూ.20 కోట్ల విలువైన రద్దీ నిర్వహణ సదుపాయాలు కూడా ఆమోదం పొందాయన్నారు. నర్సాపూర్-విజయవాడ, గరుడబల్లి-విశాఖపట్నం యార్డ్ రీమోడలింగ్ పనులు పూర్తయ్యాయి. నెల్లూరు-తెలమంచి సెక్షన్‌లో ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్ విస్తరించబడింది. దాదాపు 100 లోకోమోటివ్‌లలో 'కవచ్' భద్రతా వ్యవస్థ అమర్చగా, ఈ ఏడాది చివరి నాటికి తొలి 100 కిలోమీటర్ల కవచ్ సెక్షన్ ప్రారంభం కానుంది. ప్రయాణికుల సౌకర్యాల అభివృద్ధిలో భాగంగా రాయనపాడు, మంగళగిరి, కంభం అమృత్ భారత్ స్టేషన్లు ప్రారంభించబడ్డాయి. మరో 70 స్టేషన్ల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. విశాఖపట్నం, తిరుపతి ప్రాంతాల్లో రద్దీ తగ్గించేందుకు మూడో, నాలుగో రైల్వే లైన్లు, సింహాచలం నార్త్, రేణిగుంట యార్డ్‌ల అభివృద్ధి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 4 ట్రైన్‌ఆన్‌డిమాండ్ సేవలను రెగ్యులర్ రైళ్లుగా మార్చారు. 76 ప్రత్యేక రైళ్లు నడిపి దాదాపు 86 వేల మంది ప్రయాణికులకు సేవలందించారు. 408 అదనపు కోచ్‌లు జతచేయడంతో పాటు సింహాద్రి ఎక్స్‌ప్రెస్, గుంటూరు-వికారాబాద్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఐసీఎఫ్ కోచ్‌ల నుంచి ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లుగా మార్చారు.

విజయవాడ రైల్వే స్టేషన్‌లో స్లీపింగ్ పాడ్స్, విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో "డెక్కన్ చాయ్స్" ప్రీమియం క్యాటరింగ్ సేవలు ప్రారంభించారు. రైల్వే రక్షణ దళం (ఆర్‌పిఎఫ్) మొదటి రెండు నెలల్లో 28ఎన్‌డిపిఎస్ కేసులను గుర్తించి, రూ.2.37 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుంది. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో విస్తృత పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు 5,152 మంది నిబంధనల ఉల్లంఘనదారులపై చర్యలు తీసుకుంది. కొత్త జోన్ ఏర్పాటు సవాళ్ల మధ్య కూడా దక్షిణ తీర రైల్వే రూ.671 కోట్ల ప్రయాణికుల ఆదాయం, 2.94 కోట్ల మంది ప్రయాణికులు, 3 శాతం వార్షిక వృద్ధి, మొత్తం రూ.2,493 కోట్ల ఆదాయం సాధించి దేశంలోని అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న రైల్వే జోన్లలో ఒకటిగా నిలిచింది. 'స్లిమ్ అండ్ స్మార్ట్ రైల్వే హెడ్‌క్వార్టర్స్' లక్ష్యంతో తొలి రోజు నుంచే ఈఆఫీస్ విధానాన్ని అమలు చేసింది. రైల్వే మహిళా సంక్షేమ సంఘం, క్రీడా సంఘం, సాంస్కృతిక సంఘం, గుర్తింపు పొందిన కార్మిక సంఘాలను ఏర్పాటు చేసి ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని మొక్కలు నాటి ఘనంగా నిర్వహిస్తూ పర్యావరణ పరిరక్షణపై తన నిబద్ధతను చాటుకుందన్నారు. ఈ సమావేశంలో చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ వై.బాలాజీ కిరణ్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (కన్‌స్ట్రక్షన్) అంకుష్ గుప్తా, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ బీఎస్‌కే రాజ్‌కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కె.సాంబశివరావు, ఐజీ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ ఏ.కే. సిన్హా, చీఫ్ ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ షిఫాలి కుమార్, ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ టెలికాం ఇంజనీర్ ఓ.వి. సురేష్ కుమార్, ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ డా. పూడి హరిప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

వార్త

అభిప్రాయాలను మార్చుకోలేని వ్యక్తి తన తప్పుల్ని సరిదిద్దుకోలేడు. నేటి కంటే రేపు ఎక్కువ వివేకం ప్రదర్శించాలనుకుంటే మనిషిలో మార్పు అవసరం.

-తిరుక్కురళ్

# ప్రజారోగ్యాన్ని కాటేస్తున్న కాలుష్యం

కాలుష్య నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణ యోగ్యం కానీ విధానాలతో ప్రయోగాలు చేస్తూ రోజు రోజుకు సమస్యను మరింత జటిలం చేస్తున్నారు. అన్నిటి కంటే ముఖ్యంగా కాలుష్య నివారణకు రూపొందిస్తున్న నిబంధనలను, చట్టాలను త్రికరణశుద్ధిగా అమలు చేయక పోవడంతో పర్యావరణం విషతుల్యంగా మారుతున్నది. ఫలితంగా దేశవ్యాప్తంగా కోట్లాది మంది రకరకాల వ్యాధులకు లోనవుతున్నారు. ఇందులో కొందరు దీర్ఘకాలిక వ్యాధుల బారినపడి మంచానికే పరిమితమై అసువులు బాస్తున్నారు. అంతకంతకు కాలుష్యమేఘాలు కమ్ముకోవడం ఆందోళన కలిగించే అంశం. గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉన్నా నగరాల్లో పరిస్థితి మాత్రం దారుణంగా తయారవుతున్నది. వర్షాకాలం ముఖ్యంగా చలికాలంలో పరిస్థితి అదుపు తప్పిపోతున్నదని పర్యావరణ శాస్త్రవేత్తలు ఏనాటి నుంచో హెచ్చరిస్తూనే ఉన్నారు. భారత్‌లో ఢిల్లీతోసహా అనేక నగరాల పరిస్థితి యేడాది యేడాదికి దారుణంగా తయారవుతున్నది. ముఖ్యంగా దీపావళి పండుగ సందర్భంగా పాలకులు విధించే నిబంధనలను కొందరు పాటించకపోవడం, ఇష్టానుసారంగా దీపావళి మందులు కాల్చడంతో కాలుష్యం పరాకాష్ఠకు చేరుతుందనే చెప్పొచ్చు. గత నాలుగైదు ఏళ్లుగా ఢిల్లీ లాంటి నగరాల్లో పది రోజులకు పైగా పాఠశాలలకు సెలవులు ప్రకటించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇక కోల్‌కతా, ముంబయి నగరాలతో పాటు దక్షిణాది బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, వాయు నాణ్యత క్షీణిస్తున్నది. ఢిల్లీకి పొరుగునున్న యుపి, హర్యానా, పంజాబ్, రాజస్థాన్‌లలో కూడా రోగధూళి విస్తరిస్తున్నాయి. దేశంలో ఆరు మెట్రోనగరాలు బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, ముంబాయి, హైదరాబాద్, ఢిల్లీ, తదితర నగరాల్లో జరిపిన సర్వేల్లో విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. నీటి, గాలి నాణ్యత వాతావరణ మార్పులు అటవీ విస్తీర్ణం, చెత్త నిర్వహణ, తదితర అంశాలపై జరిపిన ఆ సర్వేలో వాయుకాలుష్యం నగర జీవి ఊపిరితిత్తులకు పోట్లుపోడుస్తున్నదన్న విషయం వెలుగుచూసింది. కొన్ని నగరాల్లో వాయుకాలుష్యం తీవ్రంగా ఉన్నదని వెల్లడయింది. మరికొన్ని ప్రాంతాల్లో పారిశ్రామిక కాలుష్యం అగ్రస్థానంలో ఉంది. హైదరాబాద్ నగరంలో నీటి, వాయు కాలుష్యంతోపాటు నిర్మాణ రంగం వల్ల వెలువడే గాలిలో ధూళికణాలు అధికంగా ఉన్నట్లు బయటపడింది. మరొకపక్క గ్రామాల నుండి నగరాలకు వలసలు పెరిగిపోవడం, ఒక పద్ధతి, ప్రణాళిక లేకుండా కాలనీలు వెలుస్తున్నాయి. మురికివాడల నిర్మూలనకు ప్రత్యేక కార్యక్రమం తీసుకుంటున్నా, మరొకపక్క వలసలతో అవి ఎక్కడికక్కడ పెరిగిపోతున్నాయి. కాలుష్యాన్ని తగ్గించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా ఫలించడం లేదు. ఆరేడేళ్ల క్రితం భారత్‌లో ఎంపిక చేసిన 102 నగరాల్లో ధూళికణాల ముప్పును ఇరవై నుండి ముప్పైశాతం మేర తగ్గించేందుకు జాతీయ వాయుశుద్ధి కార్యక్రమాన్ని ఆరంభించారు. ఆతర్వాతక్రమేపీ మరో ముప్పైనగరాలకు పైగా విస్తరించారు. 2025-26 నాటికి సూక్ష్మకణాలను నలభైశాతానికి నియంత్రిస్తామంటూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాదాపు ఏడువేల కోట్ల రూపాయల వరకు వెచ్చించినా పరిస్థితుల్లో పెద్దగా మార్పురాలేదు. పశ్చిమ బెంగాల్, పంజాబ్, యుపి, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల్లో నిబంధనలు పట్టించుకోవడం లేదు. అంతర్జాతీయంగా ప్రధానంగా చైనా, అమెరికా లాంటిదేశాలు వాయు కాలుష్యాన్ని నియంత్రించడంలో సఫలీకృతం అవుతున్నట్లు అనేక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కాలుష్యానికి మూలమైన దాదాపు ఐదువందలకుపైగా కారు మోడళ్లను నిషేధించి ప్రజారవాణా వ్యవస్థను కాలుష్యరహితంగా మార్చేందుకు చైనా తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. బొగ్గు ఆధారిత విద్యుత్ కర్మాగారాల నిర్మాణానికి దాదాపు ఆయా దేశాలు ఫుల్‌స్టాప్ పెట్టాయి. కానీ మన దేశంలో నేటికీ వాటిని కొనసాగించడమేకాక కొత్త, కొత్త ప్రాజెక్టుల వైపు అడుగులు వేస్తున్నారు. అడవుల సంరక్షణకు ఎన్నో దేశాలు పటిష్టమైన చర్యలు తీసుకుంటూ కాపాడుకుంటున్నాయి. మనదేశంలో పరిస్థితి అందుకుభిన్నంగా ఉన్నదేమోననిపిస్తున్నది. రోజూ దాదాపు 330 హెక్టార్లకు పైగా అటవీ సంపద హరించుకుపోతున్నది. మరొకపక్క పర్యావరణాన్ని కాలుష్యం చేస్తూమోతాదుకు మించిన పొగను వదులుతున్న వాహనాలు భారత్‌లో కోట్ల సంఖ్యలో ఉండొచ్చు. వాటిని నియంత్రించేందుకు ఎన్నోచట్టాలు తీసుకువచ్చారు. నిబంధనలను విధించారు. జరిమానాలు వేస్తున్నారు. అన్నికాగితాలకే పరిమితమవుతున్నాయి. పెట్రోలు, డీజిల్‌లో జరుగుతున్న కల్తీ ఈకాలుష్యాన్ని మరింతపెంచుతున్నది. వాహన కల్తీని నిరోధించేందుకు అధికారగణం తీసుకుంటున్న చర్యలు ఫలితాలు ఇవ్వడం లేదు. మొత్తం మీద తీవ్రస్థాయిలో వెలువడుతున్న విషవాయువుల వల్ల పర్యావరణం విషతుల్యంగా మారి ప్రజారోగ్యాన్ని కాటేస్తున్నది. గతంలో పర్యావరణ పరిశోధన శాస్త్రజ్ఞులు చేసిన అధ్యయనంలో 132దేశాల కంటే భారత్ అట్టడుగునున్నట్లు వెలుగుచూసింది. ధూళికణాలు ఉండాల్సినస్థాయికన్నా ఐదు రెట్లు అధికంగా ఉండి శ్వాసకోశ సమస్యల నుంచి కేన్సర్‌దాకా అనేక వ్యాధులకు కారణమవుతున్నాయని ఆ నివేదిక వెల్లడించింది. ప్రత్యేకించి భావితరంబాలికలబతుకు దీపాలను ఈకాలుష్యం చిదిమేస్తున్న విషయం వెలుగుచూసింది. ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ఈ కాలుష్య భూతాన్ని నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సమస్య తీవ్రతను గుర్తించి నివారణకు ఆచరణయోగ్యమైన విధానాలు ప్రకటించడమేకాదు, అమలుకు త్రికరణ శుద్ధిగా కృషిచేయాలి. అన్నిటికంటే ముఖ్యంగా పర్యావరణం పట్ల ప్రజల్లో అవగాహన పెంచేందుకు కృషి జరగాలి.



పేదరికం కారణంగా ఇంతవరకూ ఏ దేశం సమిసిపోలేదు. అవినీతి కారణంగానే దేశాలు నేలమట్టమయ్యాయి.

నానీ పాల్కీవాలా



ఇతరులు అనుసరించడానికి, తమనే ఉదాహరణగా తీసుకోవాలని తమకు తామే ఎవరైతే అనుకుంటారో వారు అభివృద్ధి చెందలేరు.

గోల్డ్‌స్మిత్

## ప్రజావాక్కు

### జనరిక్ ఔషధాలపై సుంకాలు

అమెరికా దిగుమతి చేసుకునే జనరిక్ ఔషధాలపై భారీగా సుంకాలు విధించే ప్రతిపాదన ఆందోళన కలిగించే పరిణామం. జాతీయ భద్రత పేరుతో ఇలాంటి చర్యలు తీసుకోవడం ఆరోగ్య రంగంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. అమెరికాలో ఉపయోగించే ప్రిస్క్రిప్షన్ ఔషధాల్లో పెద్దభాగం జనరిక్ మందులేకావడంతో, వాటి సరఫరాకు ఆటంకం ఏర్పడితే మధుమేహం, క్యాన్సర్, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న కోట్లాది మందిరోగులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ప్రపంచ ఔషధ రంగంలో భారత్‌కు ప్రత్యేక స్థానం ఉంది. తక్కువ ఖర్చుతో నాణ్యమైన జనరిక్ మందులను అందిస్తూభారత్ అనేక దేశాల అవసరాలను తీర్చుతోంది. ఔషధాల సరఫరాను అడ్డుకునే విధానాలు అమలు చేస్తే మందుల కొరతతో పాటువైద్య ఖర్చులుకూడా పెరిగే అవకాశంఉంది. దీని ప్రభావం ముఖ్యంగా సాధారణ ప్రజలు, తక్కువ ఆదాయ వర్గాలపై ఎక్కువగా పడుతుంది.

- హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అసెంబ్లీలో చోటు సంపాదించిన వ్యూహకర్త

ఎన్నికల వ్యూహకర్తగా దశాబ్దం పాటు వెలిగిన ప్రశాంత్ కిశోర్ బీహార్ అసెంబ్లీలోకి తన పార్టీ తరపున ఏకైక సభ్యునిగా అడుగిడుతున్నారు. 2014 ఎన్నికల్లో మొదటి సారిగా బీజేపీ తరపున వ్యూహకర్తగా పనిచేసి అందరి దృష్టిని ఆకర్షించిన ఆయన తరువాత దేశవ్యాప్తంగా పలు పార్టీల ఎన్నికలకు పనిచేశారు. 2024లో బీహార్ లో జనసురాజ్ పార్టీ స్థాపించారు. తన నాయకత్వంలో గత ఎన్నికల్లో ఆ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పోటీ చేసినా విజయం నాస్తి. ఇప్పుడు మళ్లీ అదేబీజేపీ తననూతనజాతీయ అధ్యక్షుని స్థానం ఖాళీచెయ్యగా వచ్చిన ఉప ఎన్నికలో, దానికి ఎదురొడ్డిమొదటిసారిగా పోటీ చేసిన ఆయన విజయాన్ని అందుకున్నారు. ఆ స్థానం బీజేపీకి కంచుకోట.

- డా.డి.వి.జి.శంకరరావు, విజయనగరం

### సర్ తప్పులకు అవకాశం

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఓటరు ప్రక్షాళన జాబితాలో భాగంగా ఇదివరకే పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారంలో ఏవైనా తప్పులు ఉంటే సవరణలకు 10వతేదీ వరకు అవకాశం ఉంది. కావున ఇంకా ఎవరైనా ఫారాలు బూత్ లెవెల్ అధికారులకు ఇవ్వని వారు ఎవరైనా ఉంటే త్వరగా ఇవ్వాలని అధికారులు సూచిస్తున్నారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### దొంగబాబాలదే పెత్తనమా!

ఆకివీడు దగ్గర ప్రభుత్వ భూమిలో చర్చి ఉన్నదని ఆభూమిని స్వాధీనం చేసుకుంటున్నారు అక్కడి పోలీసులు. మరి రాష్ట్రంలో దొంగబాబాలు అక్రమించిన ప్రభుత్వ భూముల సంగతి ఏమిటి ? శాపాలు పెడతారని ప్రభుత్వానికి భయమా !మీకు ఆ భయంఅవసరం లేదు. హేతువాదులు ఉన్నారు. బాబాలకు విరుగుడు మందు మావద్ద ఉంది. నెహ్రూ ప్రధానిగా ఉన్నపుడు దేశంలో బాబాలు ఎక్కడ కనిపించేవాళ్ళు కాదు. ఒకవేళ ఉన్నా జనం ఉతికి ఆరేస్తారనీ భయం కావచ్చు. ఈరోజు సాక్షాత్తు పార్లమెంటు భవన ప్రారంభానికి వందమంది బేతాళ మాంత్రికులు వచ్చారు. వారికి ప్రధాని సాష్టాంగపడ్డాడు. అమరావతి కరకట్ట మీద నదీపరివాహిక సూత్రాలకు విరుద్ధంగా నిర్మించిన ఆశ్రమాల సంగతి ఏమిటి? నీళ్ల తాగితే రోగాలు పోతాయని చెప్పుకునే నీళ్ళరాజు ఆశ్రమం ఇవన్నీ అక్రమనిర్మాణాలే! వీటిని ఎందుకు కూల్చరు? మరి ఆకివీడులో చర్చిని కూలుస్తున్నట్లుగా రాష్ట్రంలో దొంగబాబాలు ఆక్రమించిన భూములను కూడా స్వాధీనం చేసుకోండి. అపుడు రాష్ట్ర ప్రజలు మిమ్మల్ని నమ్ముతారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### యువత జాగ్రత్త

యువత దేశ భవిష్యత్తుకు బలమైన పునాది. సిగరెట్, గుట్కా, మద్యం, మత్తు పదార్థాలు వంటి వ్యసనాలు శారీరక, మానసికఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. సోషల్ మీడియా, మొబైల్ ఆన్‌లైన్ గేమ్‌లను అతిగా ఉపయోగించడం కూడా హానికరమైన అలవాట్లే. ఈవ్యసనాలు చదువు, ఆరోగ్యం, కుటుంబ ఆనందంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ప్రతిరోజూ వ్యాయామం, యోగా, ధ్యానం చేయడం మంచిది. పుస్తకాలు చదవడం, కొత్తనైపుణ్యాలు నేర్చుకోవడం అలవాటు చేసుకోవాలి. సమస్యలు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు లేదా ఉపాధ్యాయులతో మాట్లాడాలి. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యసాధనకు కృషిచేయాలి. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆదర్శ యువతగా సమాజానికి స్ఫూర్తిగా నిలవాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### తెరముందు కథ

తెరలేపారు. తెరదించారు వెనుక విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయంటే అతిశయోక్తికాదు. వెండితెర, బుల్లితెర, బుజ్జితెర పలువిధాలుగా మార్పుచెందింది. ఒకప్పుడు సినిమా హాల్లో, సిల్వర్ స్క్రీన్‌కు రక్షణగా తెరుండడం చాలా మందికి తెలిసే ఉంటుంది. ఇక దోమ తెర ఆరోగ్యానికి చిహ్నం. ప్రేక్షక రారాజులకు పరదాకు అవినాభావ సంబంధం ఉంది.

-ఆర్. వెంకటేష్ చరన్, బెంగళూరు

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# జీవకళ కోల్పోతున్న 'చేనేత'!

**భారత ప్రభుత్వం చేనేత దినోత్సవాన్ని ప్రకటించి దశాబ్ద కాలం గడిచినా ప్రధానమంత్రి దేశ విదేశాలలో తరచుగా మాట్లాడుతూ విశ్వగురు పాత్ర పోషించే అవకాశం కేవలం చేనేత రంగానికే ఉందని చెబుతున్నా చేనేతకు సంబంధించిన అన్నిరకాల వస్త్ర ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం ఎన్నడు లేని విధంగా టెక్స్‌టైల్స్‌తో సమానంగా చేనేతకు జిఎస్టిని విధించింది. అంగట్లో అన్నీఉన్నా అల్లునినోట్లో శనిఅన్నట్టు బడ్జెట్ కాగితాల్లో వేలకోట్లు కనిపిస్తున్నా చేనేతకు అరకొర నిధులు కేటాయిస్తున్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి నిధుల కొరతతోకొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వాలు మాత్రం వందల కోట్లు ఖర్చుచేస్తూ పర్యటనలు ప్రచారాలతో హంగు ఆర్భాటాలతో వృధాఖర్చు చేస్తున్నారు. పాలకులకు చేనేత సంక్షేమంపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే ప్రచారాల ఆర్భాటాల వెనుక ఉన్న వృధా ఖర్చులను తక్షణమే అరికట్టి వందల కోట్లను నేరుగా చేనేత రంగానికి మళ్ళిస్తేనే చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండుతాయి.**



డాక్టర్ చిక్కా దేవదాసు

చేనేత భారతదేశపు సాంస్కృతిక సుసంపన్నమైన వారసత్వానికి ప్రతీక. వేల సంవత్సరాలుగా భారతీయుల జీవన విధానంలో అంతర్భాగంగా బాసిల్లుతూ చేనేతకు ప్రత్యేక స్థానం ఉంది. దీనికి తోడు చేతితో నూలు వడకడం, చేనేత వస్త్ర ఉత్పత్తులలో వృత్తి నైపుణ్యంలో చేనేత కార్మికుడు ఎవరికి తీసిపోడు. స్వాతంత్ర్య పోరాట ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన రాట్నం నేడు రక్షణకు నోచుకోలేక విలవిలలాడుతుంది. విదేశీ వస్త్ర బహిష్కరణ ఆనాటి ఆంగ్లేయుల ప్రభుత్వాన్ని బెంబేలెత్తించింది. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాదిమందికి అధిక సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న చేనేత పరిశ్రమ సాటిలేని పనితనం, వారసత్వ అనుభవం గల ఈ ప్రాచీన పరిశ్రమకు మన దేశపు చేనేత వస్త్రాల నైపుణ్యం, కళాత్మకత ప్రపంచమంతటా మన్ననలు పొందాయి. ఒకప్పుడు ఎంతో గర్వంగా దేశానికే ప్రతిష్టతెచ్చే విధంగా మనగలిగిన చేనేతకు, చేనేత కార్మికులకు స్వాతంత్ర్యనంతరం నుండి నేటివరకు వచ్చిన ప్రభుత్వాలు, పాలకులు చేనేత పరిశ్రమను రక్షిస్తామని, చేసేది గోరంత... చెప్పేది కొండంత అన్న చందాన గొప్పగానే చెబుతున్నా ఆచరణకు ఆమడ దూరంలో విధివిధానాలు రూపొందిస్తూ సరైన ప్రోత్సాహకం అందించక చేనేత కార్మికుల బతుకులను భారంగా మారుస్తూ చేనేత పరిశ్రమను నేడు అంతరించే దశకు దిగజారుస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలోచేనేత వస్త్ర ఉత్పత్తులకు, ముచ్చట గొలిపే పనితనానికి, కళాత్మకతతో తయారైన వస్త్రాలకు ఆదరణ లభించడానికి అందం ఒకటే ప్రధానం కాదు, నేసిన వస్త్రంలోని ప్రతి అంగుళం యంత్ర సహాయం లేకుండా చేనేత కళాకారుడు చూపగల కళా నైపుణ్యానికి ప్రత్యక్ష నిదర్శనం. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో చేనేత కార్మికులు అప్పుల బారిన పడి ఆకలి చావులు, ఆత్మహత్యలతో నిండునూరేళ్ళు బతకాల్సిన నేతన్నలు ప్రభుత్వ చేనేత పథకాలు, విధివిధానాలు వికటించి, పేదరికంతో అనారోగ్యంతో రోగాల బారినపడి, తిండి దొరకక మృత్యులోగిళ్లలోకి వెళుతున్నారు. ప్రభుత్వాల ఉదాసీన వైఖరి నిర్లక్ష్యం వల్ల ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన బతకలేక పూటగడవక బతుకు పోరుబాట పట్టలేక యాచక వృత్తి ఆశించలేక, ప్రభుత్వాన్ని నిలదీసే శక్తి లేక, పని భద్రత లేక, కనీసం వేతనాలు అందక, సౌకర్యాలు కరువై, భవిష్యత్తుపై భరోసా లభించక చేనేత కార్మికులు నేసే మగ్గం దారమే ఉరితాడుగా నిండు ప్రాణాలను బలి తీసుకుంటూ ఆత్మహత్యలకు పాల్ప డుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ ఎన్నికల మేనిఫెస్టోలో చేనేత రంగానికి అనేక హామీలు ఇచ్చి అధికారంలోనికి రాగానే చేనేత కార్మికుల సంక్షేమం కోసం అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోకపోగా 45 మంది చేనేత కార్మికులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికులకు కొత్త పథకాలు అమలు చేయకపోగా పాత పథకాలకి కోతలు విధిస్తూ నమ్మినచేనేతలను, చేనేత కార్మికులను నిట్ట నిలువునా మోసం చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే. దశాబ్ద కాలంగా తెలంగాణ ప్రభుత్వం చేనేత సహకార సంఘాల వద్ద టెస్కో ద్వారా చేనేత వస్త్ర ఉత్పత్తులను చేనేత కార్మికులకు పని కల్పించాలనే ఉద్దేశంతో జీవో నెంబర్ 1 ద్వారా చేనేత సహకార సంఘాలలో ఉత్పత్తి అయిన వస్త్రాలను టెస్కో ద్వారా కొనుగోలు చేసి వాటిని గురుకుల పాఠశాలలకు షర్టింగ్, షూటింగు, దుప్పట్లు, తువాళ్లు, కార్పెట్లు, ప్రభుత్వ ఆసు



పత్రులు, కారాగారాలు, హాస్టళ్లకు సప్లైజరిగేది. అలా ఇప్పటి వరకు కొనసాగింది. కానీ నేటి తెలంగాణ ప్రభుత్వం దీనికి వ్యతిరేకంగా జీవో నెంబర్ 15 తీసుకొచ్చి టెస్కో ద్వారా కాకుండా బహిరంగ టెండర్ ద్వారా తీసుకోవాలని నిర్ణయించడం వలన నాలుగు నెలలుగా మగ్గాల ద్వారా ఉత్పత్తి అయిన వస్త్రాల కొనకపోవడం వలన మగ్గాలు మూతపడ్డాయి. చేనేత కార్మికులు రోడ్డున పడి అడుక్కుతినే పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రభుత్వానికి కాంట్రాక్టులు, కమీషన్ల పైనే ఆసక్తి ఉంది తప్ప, చేనేత రంగ సమస్యలు మాత్రం పట్టించుకోకుండా మూలిగే నక్క మీద తాటికాయ పడ్డ చందాన కొత్తగా తెచ్చిన టెండర్ విధానం చేనేత రంగానికి, చేనేత కార్మికులకు తీవ్ర నష్టం జరగడమే కాకుండా సహకార సంఘాలను నిర్వీర్యం చేసేందుకే ప్రభుత్వం కుట్రచేస్తుంది. చేనేత నూతన టెండర్ విధానం తక్షణమే రద్దుచేసి పాత టెండర్ విధానాన్ని అమలు చేయాలి. చేనేత సహకార సంఘాలకు 13ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా 15 దఫాలుగా చేనేత సహకార సంఘాలకుపర్సన్ ఇంఛార్జిలతో కొనసాగించి సంఘాలను తీవ్ర నష్టానికి గురి చేసిఎట్టకేలకు ఎన్నికలు నిర్వహించింది. కానీ వెంటనే టెస్కోకు పూర్తి పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి సహకార సంఘాలకు రక్షణగా నిలవాలి. 30నెలల కాంగ్రెస్‌ప్రభుత్వం సభల ద్వారా చేనేత రుణమాఫీ చేస్తామని పదేపదే చెప్పి అమలు చేయలేదు. కానీ చేనేత కార్మికుల పోరాటాలద్వారా ఎట్టకేలకు ఎంతో కాలంగా ఎదురుచూసిన చేనేత కార్మికుల చేనేతల రుణమాఫీ జరిగింది. చేనేత పొదుపు పథకం ఏప్రిల్ 25 నుండి అమలులో ఉన్నప్పటికీ చేనేత కార్మికులు 16 నెలలుగా క్రమంతప్పకుండా రికవరీ డిపాజిట్ బ్యాంక్ ఖాతాలో జమ చేయగా ప్రభుత్వవాటా మాత్రం కేవలం రెండునెలలు మాత్రమే జమ చేసింది. తక్షణమే ప్రభుత్వ వాటాను చేనేత కార్మికుల ఖాతాలో జమ చేయాలి. చేనేత భరోసా పథకం కార్మికులకు సంవత్సరానికి 18వేలు, అనుబంధ కార్మికునికి 6000 వేలు అందజేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు, వెంటనే అమలు చేయాలి. తెలంగాణ చేనేత సహకార సంఘాలకు ఇచ్చిన క్యాష్ క్రెడిట్ రుణాలు మాఫీచేస్తామని ఇప్పటికీ అమలుజరగలేదు. ఎలాంటి షరతులు లేకుండా చేనేత బీమా పథకంలో 60 సంవత్సరాలు పైబడినవారికి నష్టపరిహారం ప్రభుత్వం వద్ద 16 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. విడుదల చేయాలి. 28 నెలలుగా పావలా వడ్డీ పథకం ద్వారా చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన పావలా వడ్డీ రుణాలు వెంటనే విడుదల చేయాలి. చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన మార్కెటింగ్ ప్రోత్సాహకాలు 20శాతం రిబేట్ విడుదల చేయాలి. నకిలీ ప్రింటెడ్ వస్త్రాల అరికట్టి చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి. రైతుల ధాన్యం కొనుగోలు చేసినట్లుగా చేనేత వస్త్రాలు, దేవతామూర్తులకు సమర్పించే వస్త్రాలు, భక్తులకు అందించే ఆశీర్వచన వస్త్రాలు చేనేతలో తయారైతే దైవ సేవతోపాటు సంప్రదాయ సంరక్షణ కూడా సాధ్యమవుతూ దేవాలయాలకు ప్రతి సంవత్సరం లక్షలాది వస్త్రాలు అవసరమవుతాయి కాబట్టి, ఈ అవసరాన్ని చేనేత రంగం ద్వారా తీర్చే విధానాన్ని ప్రభుత్వాలు అమలు చేస్తే వేలాదిమంది చేనేత కార్మికులకు స్థిరమైన ఉపాధిలభిస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతూ అంతరించిపోతున్న సంప్రదాయ చేనేత వృత్తులకు పునర్జీవం లభిస్తుంది. భారత ప్రభుత్వం చేనేత దినోత్సవాన్ని ప్రకటించి దశాబ్ద కాలం గడిచినా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ విదేశాలలో తరచుగా మాట్లాడుతూ విశ్వగురు పాత్ర పోషించే అవకాశం కేవలం చేనేత రంగానికే ఉందని చెబుతున్నా చేనేతకు సంబంధించిన అన్ని రకాల వస్త్ర ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం ఎన్నడు లేని విధంగా టెక్స్‌టైల్స్‌తో సమానంగా చేనేతకు జిఎస్టిని విధించింది. అంగట్లో అన్నీ ఉన్నా అల్లునినోట్లో శని అన్నట్టు బడ్జెట్ కాగితాల్లో వేల కోట్లు కనిపిస్తున్నా చేనేతకు అరకొర నిధులు కేటాయిస్తున్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండి నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతుంటే ప్రభుత్వాలు మాత్రం వందల కోట్లు ఖర్చు చేస్తూ పర్యటనలు ప్రచారాలతో హంగు ఆర్భాటాలతో వృధా ఖర్చు చేస్తున్నారు. పాలకులకు చేనేత సంక్షేమంపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే ప్రచారాల ఆర్భాటాల వెనుక ఉన్న వృధా ఖర్చులను తక్షణమే అరికట్టి వందల కోట్లను నేరుగా చేనేత రంగానికి మళ్ళిస్తేనే చేనేత కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండుతాయి. ●

# చుక్కలనంటుతున్న ఎరువుల ధరలు


కామిడి సతీష్ రెడ్డి

ఎల్‌నినో ప్రభావంతో సరైన వర్షాలు లేక ఆందోళన చెందుతున్న రైతులకు ఎరువుల ధరలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు ప్రభుత్వం ధరలు పెంచడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం సాగు చేసిన పంటలకు యూరియా, సాగు చేయాల్సిన పంటలకు డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల అవసరం ఉంది. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు ఎమ్మార్పీ కంటేఎడా, పెడా పెంచి సొమ్ము చేసుకుంటున్నారు. అన్ని జిల్లాల్లో వర్షాలు అంతంత మాత్రంగానే ఉండడంతో ఇప్పటి వరకు సగం మాత్రమే సాగు చేశారు. వర్షాలు కురిస్తే మిగతా పంటలు సాగు చేయాలని రైతులు ఎదురుచూస్తున్నారు. పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులు, ఎరువుల తయారీకి అవసరమైన ముడిపదార్థాల దిగుమతి ఖర్చులు పెరగడం, సరఫరా నిలిపిపోయిందని సాకులు చెప్పి మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో పలుచోట్ల డీఏపీ, యూరియా నిల్వలు లేక రైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. డీఏపీ ఒక్కో బస్తాకు రూ.1,350 ఎమార్పీ ఉంటే రూ. 1,700 నుంచి రూ.2,000 వరకు విక్రయిస్తున్నారంటే అతిశయోక్తి కాదు. యూరియా బస్తా రూ.266కు అమ్మాల్సి ఉండగా రూ.400కు విక్రయిస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువులు రకాలను బట్టి రూ.1,200 నుంచి రూ.2,000ల వరకు ధర ఉంది. కొన్ని రోజుల క్రితమే ప్రభుత్వ ధరలను పెంచింది. ఒక్కోబస్తాను రూ.125ల నుంచిరూ.650ల వరకు పెంచింది. కాంప్లెక్స్ ఎరువులు పెంచకముందు బస్తాకు రూ.400 నుంచి రూ.600 వరకు విక్రయిస్తున్నారు. అయితే ధరలు పెంచిన తర్వాత 20:20:0:13 రూ. 3వేలకు విక్రయిస్తున్నారని రైతులు వాపోతున్నారు. అన్ని జిల్లాల్లో అధిక ఎకరాల్లో పంటలు సాగుచేస్తారని అంచనా. అందుకు అన్ని రకాల ఎరువులు లక్షల టన్నుల ఎరువుల అవసరమని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే ఇప్పటి వరకు మార్కెట్‌లో 40శాతం ఎరువులు నిల్వలు కూడా లేవని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. రైతులకు ఎరువులు కావాలంటే ముందు యాప్‌లో నమోదు చేసుకోవాలి. అలా అయితేనే ఎరువులు దొరుకుతున్న పరిస్థితి. ఇందులోనూ రాజకీయ నేతల ప్రభావం ఉన్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. రాజకీయ నాయకులు చెప్పిన సమయానికి యాప్‌లో నిల్వలు ఉంచి వారు బుకింగ్ చేసుకున్నతర్వాత మూసేస్తున్నారు. అప్పటికే ఆయా దుకాణాలకు కేటాయిం చిన ఎరువులు ఖాళీ అయిపోతున్నాయి. రైతులు బుక్ చేసుకుందామనే లోపే నిమిషాల వ్యవధిలో ఖాళీ కావడంతో ఎరువుల కోసం నానాఅవస్థలు పడుతున్నారు. సాగులో ఎరువుల వినియోగం ఏటేటా పెరుగుతోంది. ఎరువు బస్తా లేనిదే పంటలు పండవన్న భావనలో రైతులు ఉం టున్నారు. ఎకరాకు గతేడాది మూడు బస్తాలు వేస్తే, ఈసారి నాలుగు బస్తాలకు పెంచుతున్నారు. వానాకాలం ప్రారంభంలో కురిసిన వానలకు రైతులు పత్తి, కంది, మొక్క జొన్న ఇతర పంటలు సాగు చేశారు. తడిలేక మొలకలు ఎండిపోతున్నాయి. పంటలపై యూరియాను నీటిలో కలిపి పిచికారీ చేయాలని అధికారులే సూచిస్తున్నారు. అయితే మార్కెట్‌లో యూరియా దొరకని పరిస్థితి. కాంప్లెక్స్ ధరలు అధికంగా ఉండడంతో యూరియాపై ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. ఒక్క బస్తా అవసరం ఉన్నచోట రెండు బస్తాలను వినియోగిస్తున్నారు. దీంతో యూరియా కొరత ఏర్పడుతోంది. రవాణా జాప్యం వల్ల కూడా కొంత సమస్యకు దారి తీస్తోందని చెబుతున్నారు. ●

# విద్య ఆశయాలు ఘనం, పంపిణీలో విలంబనం!

రామ కిష్టయ్య సంగన భట్ల

పాఠశాల పునఃప్రారంభమై నెలరోజులు దాటిపోతున్నా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందాల్సిన విద్యా కిట్లు పూర్తిస్థాయిలో చేరకపోవడం విద్యా పరిపాలనా యంత్రాంగపు ప్రణాళికారాహిత్యానికి, నిరంతర అలసత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది. విద్యా సంవత్సరం తొలి రోజునుంచే సమాన అవకాశాలతో, నాణ్యమైన చదువును అందించడంతో పాటు పేద కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించాలనే ఉన్నతాశయంతో ప్రభుత్వం ఉచితంగా రెండు జతల యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, వర్క్‌బుక్లు, నోట్ బుక్లు, పాఠశాల బ్యాగు, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టు, టైలతో కూడిన సమగ్ర విద్యా కిట్లను ప్రతి ఏటా పంపిణీ చేస్తోంది. తొలి రోజు నుంచే విద్యార్థులందరూ ఎలాంటి ఆత్మన్యూనతా భావానికి లోనుకాకుండా సమభావనతో, ఆత్మవిశ్వాసంతో తరగతి గదుల్లోకి అడుగు పెట్టాలన్న ఈ శ్రేయోరాజ్య ప్రాథమిక లక్ష్యానికి క్షేత్రస్థాయిలోని నిర్వహణ లోపాలు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి. చిరిగిపోయిన, వర్ణం వెలసిన పాత దుస్తులతోనే బడికి వస్తున్న పిల్లల దృశ్యాలు ఒకవైపు కాగా, కొనుగోలు శక్తి లేక తోటి విద్యార్థుల నుంచి కాగితాలు అడిగి తెచ్చుకుని నోట్లు రాసుకుంటున్న దృశ్యాలు మరొకవైపు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కనిపిస్తుండటం విద్యా వ్యవస్థ తీరుపై తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ విద్యా సంక్షేమ పథకాల విస్తృతిని పరిశీలిస్తే, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీలు, మోడల్ పాఠశాలలు, గురుకులాల్లో అభ్యసిస్తున్న లక్షలాది మంది విద్యార్థులకు విద్యా సామగ్రిని ఉచితంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిసారీ బడ్జెట్‌లో వందల కోట్ల రూపాయలు కేటాయిస్తోంది. నేటి ఆర్థిక పరిస్థితుల్లో ఒక సగటు నిరుపేద శ్రామిక కుటుంబానికి ఇద్దరు పిల్లలు ఉంటే, వారి విద్యా సామగ్రి, నూతన దుస్తుల కొనుగోలుకే బహిరంగ మార్కెట్లో వేలాది రూపాయలు వెచ్చించాల్సివస్తుంది. అటువంటి ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, పాఠశాలల్లో నమోదు శాతాన్ని గరిష్ఠస్థాయికి పెంచడం, మధ్యలోనే బడి మానేసే ప్రవృత్తికి అడ్డుకట్ట వేయడం, ధనికపేద వ్యత్యాసాలు లేని సమ్మిళిత విద్యా వాతావరణాన్ని ప్రోత్సహించడంలో ఈ కిట్ల పంపిణీ కీలకంగా మారింది. అయితే, ఏడాది కేడాది పునరావృతమవుతున్న సరఫరా జాప్యాలు ఈ పథకవిస్తృత ఆశయాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ఈ జాప్యానికి అధికారుల వైపు నుంచి అనేక కారణాలు వ్యక్తమవుతున్నాయి. టెండర్లను ఖరారు చేయడంలో చోటుచేసుకునే సాంకేతిక, పరిపాలనా ఆలస్యాలు, తయారీ సంస్థలకు ఆర్డర్లు ఇవ్వడంలో జాప్యం, మార్కెట్‌లో వస్త్ర ముడిసరుకు ధరల అస్థిరత ప్రధాన అవరోధాలుగా నిలుస్తున్నాయి. దీనికితోడు వస్త్రాల నేత, కుట్టుపనులు, నాణ్యతా ప్రమాణాల పరిశీలనకు ఎక్కువ సమయం పట్టడం, రవాణా ఇబ్బందులు, జిల్లా స్థాయి గిడ్డంగుల నుండి మారుమూల పాఠశాలలకు సరఫరా చేయడంలో సమన్వయ లోపం ఉండటం సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి.



విద్యా సంవత్సరం ప్రారంభంలో సంభవించే కొత్త చేరికల ఆధారంగా అదనపు అవసరాలను ముందస్తుగా ఖచ్చితంగా అంచనా వేయలేకపోవడం కూడా ఈ లోపానికి తోడవుతోంది. కొన్ని వస్తువుల నాణ్యత ప్రమాణాల విషయంలో అధికారులు తీసుకుంటున్న అదనపు జాగ్రత్తల వల్ల పంపిణీ మరింత ఆలస్యమైందని వివరణ ఇస్తున్నప్పటికీ, సమయపాలన లేని నాణ్యత విద్యార్థుల సమయ నష్టానికి పరిహారం కాలేదు. సంక్షేమ పథకాలు కేవలం నిధుల కేటాయింపుతోనో, ప్రకటనలతోనో సంపూర్ణం కావు. వాటి అమలులోని సమయపాలన మాత్రమే నిజమైన విజయానికి కొలమానంగా నిలుస్తుంది. పాఠశాల తెరిచిన తొలిరోజే విద్యార్థి చేతికి కావలసిన పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్లు అందితేనే బోధనా అభ్యసన ప్రక్రియ నిరంతరాయంగా సాగుతుంది. తరగతి గదిలో విద్యార్థులందరూ ఒకే విధమైన దుస్తులు ధరించడం ద్వారా వారిలో సమానత్వ భావన, క్రమశిక్షణ పెంపొందుతాయి. సామాజిక శ్రేణులు, ఆర్థిక తారతమ్యాలను తుడిచిపెట్టే ఈ సమభావన సూత్రం, సామగ్రి సమయానికి అందకపోవడం వల్ల ఆటంకానికి గురవుతోంది. నెలరోజులు దాటినా నోట్‌బుక్లు, పుస్తకాలు చేతికి రాకపోవడంతో రోజువారీ పాఠ్యాంశాల అభ్యాసన వెనుకబడి, విద్యా సంవత్సరం ఆరంభంలోనే విద్యార్థులలో నిరాసక్తత చోటుచేసుకుంటోంది. ఈ పరిపాలనా అలసత్వం వల్ల అత్యంత ప్రతికూల ప్రభావానికి గురవుతున్నదిగ్రామీణ, గిరిజన ప్రాంతాల నిరుపేద విద్యార్థులే. కొన్ని ప్రాంతాల్లో ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు చొరవతీసుకుని తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ, అది సంపూర్ణ పరిష్కారం కానేరదు. రాబోయే విద్యా సంవత్సరానికి కావలసిన పంపిణీ ప్రక్రియలను కనీసం మూడునుండి నాలుగు నెలల ముందే, అంటే విద్యా సంవత్సరం ముగిసే సమయానికే ప్రారంభించాలి. మార్చి మాసానికే టెండర్లను పూర్తి చేసి, మే నెలాఖరు నాటికి పంపిణీకి సిద్ధంగా ఉంచేలా కఠినమైన కాల పట్టికను నిర్దేశించుకోవాలి. కొనుగోలు, తయారీ, నాణ్యతా పరిశీలన, రవాణా ప్రక్రియల పర్యవేక్షణ కోసం డిజిటల్ ట్రాకింగ్ విధానాన్ని (జియోటాగింగ్, క్యూఆర్ కోడ్ ఆధారిత పర్యవేక్షణ) ప్రవేశపెట్టాలి. దీని ద్వారా ఏ వస్తువు ఏదశలో ఉందో సెంట్రల్ డాష్‌బోర్డ్ ద్వారా తక్షణమే గుర్తించి చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది. అంతేకాకుండా, కేంద్రీకృత కొనుగోలు వ్యవస్థలపైనే ఆధారపడకుండా వికేంద్రీకరణ పద్ధతులను ప్రోత్సహించాలి. స్థానిక మహిళా స్వయం సహాయక బృందాలు (మెప్మా, సెర్ప్), చేనేత సహకార సంఘాలు, చిన్న తరహా పరిశ్రమలకు యూనిఫారాల కుట్టుపనులు, అనుబంధ విద్యా సామగ్రి తయారీ బాధ్యతలను అప్పగించడం ద్వారా సమయపాలన సాధ్యమవ్వడ మే కాకుండా, స్థానిక గ్రామీణ ఆర్థికవ్యవస్థకు ఊతం లభిస్తుంది. నాణ్యతలో లోపాలు రాకుండా కఠినమైన నిబంధనలు అమలు చేస్తూనే, సరఫరాదారులకు సమయానికిబిల్లుల చెల్లింపులు జరిగేలా పారదర్శకతను నెలకొల్పాలి. అత్యవసరంగా పెరిగే విద్యార్థులసంఖ్యకు ప్రతి జిల్లాస్థాయిలో అదనపునిల్వలను సిద్ధంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలి. విద్యారంగానికి ప్రభుత్వం చేసే ఖర్చు కేవలం సంక్షేమవ్యయం మాత్రమే కాదు, అది దేశ భవిష్యత్తు కోసంచేసే అత్యంత ప్రాధాన్యమైన మూలధన పెట్టుబడి. ●

# నీట్‌లో పెన్, పేపర్‌కు స్వస్తి!




## సుప్రీంకోర్టుకు కేంద్రం అఫిడవిట్ దాఖలు

## పేపర్ లీక్‌ల నిర్మూలనకు చర్యలు

## 19వ తేదీకి విచారణ వాయిదా

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** పేపర్ లీక్‌లు, వ్యవస్థాగత వైఫల్యాలను తొలగించేందుకు జాతీయ అర్హతప్రవేశ పరీక్ష (నీట్) నిర్వహణలో సమగ్ర మార్పులు చేపట్టినట్లు కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. జస్టిస్ పిఎస్ నరసింహా నేతృత్వంలోని ధర్మాసనం ముందు దాఖలు చేసిన ఒక అఫిడవిట్‌లో, విద్యా మంత్రిత్వ శాఖ ఈ సంస్కరణల లక్ష్యం సంస్థాగత స్మృతిని పరిరక్షించడం, పరీక్ష భద్రతను బలోపేతం చేయడం, భవిష్యత్తులో పేపర్ లీక్‌లు లేదా ఇతర అవకతవకల ఘటనలను నివారించేందుకు ఒక పటిష్టమైన, సంస్థాగతమైన వ్యవస్థను సృష్టించడమేనని పేర్కొంది. భవిష్యత్తులో నీట్ పరీక్షలను ఎలా నిర్వహిస్తారు, రాబోయే సంవత్సరాలలో పరీక్షా ప్రక్రియలను మెరుగుపరచడానికి నియంత్రణ సంస్థలు సంస్థాగత స్మృతిని ఎలా నిర్మించి, నిలుపుకుంటాయో వివరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ మే 29న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశానికి అనుగుణంగా ఈ అఫిడవిట్ దాఖలు చేసింది. ఈ అఫిడవిట్‌లో ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షా నియమావళి, ఇంకా ఎన్‌టిఏ ప్రవేశపెట్టిన ఇతర భద్రతా చర్యలకు సంబంధించిన వివరాలు ఉన్నట్లు తెలుస్తోంది. విద్యా మంత్రిత్వ శాఖ జాతీయ పరీక్షల ఏజెన్సీని పర్యవేక్షిస్తుండగా, పరీక్షల ఇండెంటింగ్ ఏజెన్సీ అయిన ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖతరపున ఎన్టీఏ నీట్ పరీక్షను నిర్వహిస్తుందని ప్రభుత్వం తెలిపింది. నీట్‌యుజి 2026 పేపర్ లీక్‌పై కొనసాగుతున్న సిబిఐ దర్యాప్తు యోగ్యతల గురించి అఫిడవిట్‌లో వ్యాఖ్యానించలేదని కూడా పేర్కొంది. ప్రశ్నాపత్రాల లీకులు, నకిలీ గుర్తింపు, కంప్యూటర్ వ్యవస్థలను తారుమారు చేయడం, ఇతర పరీక్షలకు సంబంధించిన నేరాలను నేరంగా పరిగణించిన 2024 చట్టాన్ని విస్తరిస్తూ, పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ చట్టం, 2026 ద్వారా పరీక్షల మోసానికి వ్యతిరేకంగా పార్లమెంట్ చట్టపరమైన వ్యవస్థను మరింత బలోపేతం చేసిందని కేంద్రం తెలిపింది. అనుభవం, డేటా, సమాచారాన్ని క్రమపద్ధతిలో ఉపయోగించడం ద్వారా గత పరీక్షల నుండి నేర్చుకోగల బలమైన సంస్థాగత చట్రాన్ని సృష్టించడం, తద్వారా బలహీనతలను తగ్గించి, పర్యవేక్షణను మెరుగుపరచడం ఈ సంస్కరణల ఉద్దేశ్యమని ప్రభుత్వం తెలిపింది. జులై 27న ఏర్పాటు చేసిన హెచ్‌పిటిఎఫ్‌కు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, ఆధార్ రూపశిల్పి నందన్ నీలేకని నేతృత్వం వహిస్తున్నారని పేర్కొంది. పరీక్షల నిర్వహణను సురక్షితం చేయడానికి ఎఐ, బ్లాక్‌చెయిన్‌ను ఉపయోగించడంపై దృష్టి సారిస్తూ, సమగ్ర సంస్కరణలపై మూడు నెలల్లోగా సిఫార్సులను సమర్పించాలని ఈ టాస్క్ ఫోర్స్‌ను ఆదేశించినట్లు అది పేర్కొంది. గతంలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా నిరోధించడానికి, అధికారులు "కోట్ట నమూనాగా అభివర్ణించే 10దశల భద్రతా ప్రోటోకాల్‌ను ఎన్‌టిఏ అమలు చేసిందని అఫిడవిట్ తెలిపింది. అనువాద దశలో లీకేజీలను నివారించడానికి, ప్రభుత్వం ప్రాథమిక ముసాయిదా కోసం 'ఎయిర్‌గ్యాప్డ్ (ఆఫ్‌లైన్) ఎఐ వ్యవస్థలను ఉపయోగిస్తోందని, ఆ తర్వాత పరిమిత మానవ ధ్రువీకరణ జరుగుతుందని అది పేర్కొంది. ప్రస్తుతం ప్రతి ప్రశ్నపత్రం, ఓఎంఆర్ షీట్‌పై ఒక నిర్దిష్ట అభ్యర్థికి సంబంధించిన ప్రత్యేక క్రమ సంఖ్య ఉంటుందని అదితెలిపింది. ప్రశ్నపత్రాలను ఆరు పొరల ట్యాంపర్ ఎవిడెంట్ ప్యాకేజింగ్‌లో ఉంచారు, ఇందులో కేవలం కత్తిరించి మాత్రమే తెరవగల వన్‌టైమ్‌యూజ్ తాళాలతో కూడిన స్టీల్ ట్రంకులుకూడా ఉన్నాయని అది పేర్కొంది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ చట్టం, 2026 ప్రకారం, ఇప్పుడు 10 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ. 1 కోటి వరకు జరిమానా విధించే అవకాశం ఉందని అఫిడవిట్‌లో పేర్కొంది.

**కేంద్రం అఫిడవిట్‌పై విచారణను 19కి వాయిదా**

జెఇఇ (మెయిన్స్ మరియు అడ్వాన్స్‌డ్) తరహాలో నీట్ యుజి పరీక్షను పెన్‌అండ్‌పేపర్ విధానం నుండి కంప్యూటర్ ఆధారిత విధానానికి మార్చడంపై చురుగ్గా పరిశీలిస్తున్నట్లు కేంద్రం దాఖలు చేసిన అఫిడవిట్‌పై, డాక్టర్ల సంఘంతో సహా పిటిషనర్లు తమ సమాధానాలను దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ అంశాన్ని ఆగస్టు 19న విచారిస్తామని, కేంద్రం దాఖలు చేసిన కౌంటర్‌అఫిడవిట్‌పై పిటిషనర్లు తమ సమాధానాలను దాఖలు చేయవచ్చని జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం తెలిపింది. ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఎఫ్ఎఐఎంఎ) తరపున హాజరైన న్యాయవాది తన్వి దూబే ధర్మాసనానికి ఒక విషయాన్ని వివరించారు.

ఒకవేళ కంప్యూటర్ ఆధారిత విధానానికి మారే ప్రణాళిక ఏదైనా ఉంటే, దానిని వీలైనంత త్వరగా అమలు చేయాలి. ఎందుకంటే ప్రస్తుతం విద్యార్థుల సన్నద్ధత పెన్‌అండ్‌పేపర్ విధానం ఆధారంగానే సాగుతోంది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పిన ధర్మాసనం, సంబంధిత పక్షాలను తమ సమాధానాలు, సూచనలను దాఖలు చేయాలని కోరింది.



## అమెరికా మళ్లీ దాడులు చేస్తే పశ్చిమాసియా అగ్నిగుండమే

### - ఇరాన్ హెచ్చరిక

**టెహ్రాన్, ఆగస్టు 6:** తమ దేశంలోని విద్యుత్ గ్రిడ్లు, వంతెనలు, పౌర మౌలిక సదుపాయాలపై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభిస్తే చూస్తూ ఊరుకోబోమని ఇరాన్ స్పష్టం చేసింది. మొత్తం పశ్చిమాసియా ప్రాంతాన్ని అగ్నిగుండంగా మార్చేస్తామని హెచ్చరించింది. ఇక హార్ముజ్‌లో సమన్వయంపై ఒమన్‌తో అంగీకారానికి వచ్చినట్లు ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ వెల్లడించారు. మూడో పక్షం (అమెరికాను ఉద్దేశిస్తూ) జోక్యం లేకుంటే త్వరలో సంయుక్త ప్రకటన విడుదల చేస్తామని తెలిపారు. దీంతో ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధి తిరిగి పూర్తిగా తెరుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**అణ్వాయుధాలను అనుమతించం: ట్రంప్**

మరోవైపు పశ్చిమాసియాలోని పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. ఇరాన్‌తో చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అయితే, ఆ దేశం అణ్వాయుధాలు తయారు చేసేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని పునరుద్ఘాటించారు. తమ సైనిక చర్యలతో టెహ్రాన్ బలహీనపడిందన్నారు. ప్రస్తుతం చర్చలు సానుకూలంగా సాగుతున్నాయన్నారు. వెనుజులాతో అనుసరించిన విధానాన్నే ఇరాన్ విషయంలోనూ అమలు చేస్తున్నామని ట్రంప్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అమెరికాను ఇప్పుడు టెహ్రాన్ గౌరవిస్తోందని.. తమ చర్యలు ఫలించాయని వ్యాఖ్యానించారు.

## పెళ్లైన 7 రోజులకే విడాకులు

### ఇండోర్ ఫ్యామిలీ కోర్టు మంజూరు

**ఇండోర్, ఆగస్టు 6:** మధ్యప్రదేశ్‌లో నూతన వధూవరులు పెళ్ళైన కేవలం ఏడు రోజులకే చట్టబద్ధంగా తమ వివాహ బంధానికి ముగింపు పలికారు. కోర్టు విచారణల ప్రకారం, పెళ్లికి ముందు తాను వేరొకరితో సంబంధంలో ఉన్నానని, తన కుటుంబ సభ్యులే బలవంతంగా ఈ పెళ్లి చేశారని వధువు అత్తగారింటికి చేరిన వెంటనే వెల్లడించడంతో వారి వివాహ బంధం విచ్ఛిన్నమైంది. వరుడి కుటుంబం ఫ్యామిలీ కోర్టులో పరస్పర విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేసింది. కౌన్సెలింగ్ సెషన్‌లు, విచారణలు, న్యాయపరమైన ప్రక్రియల కారణంగా విడాకుల కేసులకు సాధారణంగా కనీసం 18 నెలల సమయం పడుతుందని ఫ్యామిలీ కోర్టు న్యాయవాది వర్షా గుప్తా తెలిపారు.

అయితే, వివాహ బంధాన్ని కొనసాగించే అవకాశం లేదని ఇరు పక్షాలు అంగీకరించడంతో, న్యాయస్థానం ఈ కేసును భిన్నంగా పరిగణించింది. "పెళ్లికి ముందు వధువుకు మరో సంబంధం ఉందని, పెళ్లి జరిగిన వెంటనే ఆ విషయాన్ని తన అత్తమామలకు తెలియజేసిందని కోర్టు పరిగణనలోకి తీసుకుంది. భర్తకు, అతని కుటుంబానికి విడాకులపై ఎలాంటి అభ్యంతరం లేకపోవడంతో, కోర్టు ఏడు రోజుల్లోనే డిక్రీని జారీ చేసింద్ని అని గుప్తా అన్నారు. సుప్రీంకోర్టు 'వివాహం కోలుకోలేని విధంగా విచ్ఛిన్నమైత్తే అనే సూత్రంపై ఆధారపడి, దంపతుల మధ్య రాజీకి ఆస్కారం లేదని ఫ్యామిలీ కోర్టు నిర్ధారించిందని గుప్తా తెలిపారు. కోర్టు తక్షణమే వివాహాన్ని రద్దు చేయాలని నిర్ణయించడంతో, ఇరుపక్షాలు సంవత్సరాల తరబడి ఎడబాటు, సుదీర్ఘ న్యాయ ప్రక్రియల నుండి తప్పించుకున్నారు.

## దక్షిణ ఫిలిప్పీన్స్‌లోభూకంపం

### రిక్టర్ స్కేలుపై 6.3 తీవ్రత నమోదు

**మనీలా, ఆగస్టు 6:** దక్షిణ ఫిలిప్పీన్స్ తీరంలో 6.3 తీవ్రతతో భూకంపం సంభవించిందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే తెలిపింది. మధ్యాహ్నం 12:14 గంటలకు సరంగాని అనే చిన్న ద్వీపానికి నైరుతి దిశలో 32 కిలోమీటర్ల దూరంలో సంభవించిన ఈ భూకంపం సునామీ హెచ్చరికను జారీ చేయలేదు. ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరిగినట్లు తక్షణ నివేదికలు ఏవీ లేవు. ప్రభుత్వ రాయితీని అందుకోవడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడిన సమయంలో భూకంపం సంభవించిందని సరంగాని ద్వీప రక్షకుడు హార్లీ సారో ఏఎఫ్‌పీకి తెలిపారు. ఈ భూకంపం 62 కిలోమీటర్ల లోతులో సంభవించినట్లు పేర్కొంది. సమీపంలోని మిండనావో ద్వీపంలో జూన్ 8న సంభవించిన శక్తివంతమైన భూకంపం భవనాలను కూల్చివేసి, కొండచరియలు విరిగిపడటానికి కారణమై, కనీసం 76 మంది మరణానికి కారణమైన తర్వాత ఈ భూకంపం సంభవించింది.



## బయో ఎనర్జీ పథకం గోబర్‌ధన్‌కు రూ.23,731కోట్లు

### కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** జాతీయ సర్క్యులర్ బయోఎనర్జీ పథకం గోబర్‌ధన్ పథకం కింద సిబిజి పథకాన్ని 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2035-36 వరకు అమలు చేసేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈమేరకు కీలక తీసుకున్నారు. మొత్తం రూ.23,731 కోట్ల వ్యయంతో చేపట్టనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశ భవిష్యత్ ఇంధన అవసరాల్లో కంప్రెస్డ్ బయోగ్యాస్ కీలక పాత్ర పోషించేలా ఈ పథకాన్ని రూపొందించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. కేబినెట్ భేటీ తర్వాత కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వివరాలు వెల్లడించారు. వ్యవసాయ అవశేషాలు, పశువుల పేడ, చెరకు పరిశ్రమల నుంచి వచ్చే ప్రెస్‌మడ్, మున్సిపల్ సేంద్రియ వ్యర్థాలు, ఇతర జీవ పదార్థాలను శుద్ధ ఇంధనం, సేంద్రియ ఎరువు, గ్రామీణ ఆదాయం, ఆర్థిక విలువగా మార్చడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని కేంద్రమంత్రి తెలిపారు. పరిశుభ్రమైన ఇంధన రంగంలో భారత్‌కు ఇది కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పథకం కింద కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తికి హామీతో కొనుగోలు, స్థిరమైన ధరలు, మూలధన సబ్సిడీ, పైప్‌లైన్ అనుసంధానం, రుణ సదుపాయాలు, సాంకేతిక అభివృద్ధి వంటి అంశాలను ఒకే వేదికపైకి తీసుకురానున్నారు. దీంతో దేశంలో సిజిబి ఉత్పత్తి దాదాపు పది రెట్లు పెరగడంతో పాటు ప్రైవేట్ పెట్టుబడులు కూడా పెరుగుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ పథకం ఇప్పటికే అమలులో ఉన్న సతత్, సేంద్రియ ఎరువుల మార్కెట్ అభివృద్ధి పథకం, బయోమాస్ అగ్రిగేషన్ మెషినరీ, పైప్‌లైన్ మౌలిక వసతుల అభివృద్ధి, జాతీయ బయోఎనర్జీ కార్యక్రమం కింద సీబీజీ ప్లాంట్లకు అందిస్తున్న కేంద్ర ఆర్థిక సహాయం వంటి పథకాలకు కొనసాగింపుగా ఈ పథకం అమలు కానుంది. ఈ పథకాల ద్వారా ఇప్పటికే దేశంలో 200కుపైగా సిజిబి ప్లాంట్లు ప్రారంభమయ్యాయని ప్రభుత్వం తెలిపింది. ఉత్పత్తి, కొనుగోలు వ్యవస్థలు, సేంద్రియ ఎరువుల విలువ శ్రేణి బలోపేతం కావడంతో పాటు వివిధ ప్రాంతాల్లో సిజిబి వినియోగ సాధ్యత కూడా నిరూపితమైందని వివరించింది. పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలయ్యే ఈ గోబర్‌ధన్ పథకం ద్వారా సిజిబి ఉత్పత్తి నుంచి పంపిణీ వరకు మొత్తం వ్యవస్థను ఒకే జాతీయ విధానంలోకి తీసుకురానున్నారు. దేశంలో రవాణా, గృహ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో సహజవాయువు వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సిజిబి ఆ అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తుందనిమంత్రి తెలిపారు. సహజ వాయువుతో రసాయనికంగా సమాన లక్షణాలు కలిగిన సిజిబిని ప్రస్తుతం ఉన్న గ్యాస్ నెట్‌వర్క్‌లోనే వినియోగించవచ్చని దీంతో దిగుమతి చేసుకునే శిలాజ ఇంధనాలపై ఆధారపడటం తగ్గుతుందని కేంద్ర మంత్రి వెల్లడించారు. ప్రతి సిజిబి ప్లాంట్ ద్వారా ముడి పదార్థాల సేకరణ, రవాణా, ప్లాంట్ నిర్వహణ, సేంద్రియ ఎరువుల తయారీ, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ, హరిత గృహ వాయువుల ఉద్గారాల తగ్గింపు వంటి అంశాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం లభిస్తుందని కేంద్ర మంత్రి వివరించారు.

## 65 దేశాల్లో ప్రధాని మోడీ పర్యటనలు, 316 ఒప్పందాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** ప్రధాని నరేంద్రమోడీ 2021 నుంచి ఇప్పటివరకు 44 విదేశీ పర్యటనలపరంగా 65 దేశాలను సందర్శించినట్లు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ రాజ్యసభలో గురువారం వెల్లడించింది. ఈ పర్యటనల సందర్భంగా మొత్తం 316 ద్వైపాక్షిక, బహుళపాక్షిక ఒప్పందాలు జరిగాయని తెలిపింది. ప్రధాని విదేశీ పర్యటనలు భారత్‌కు ఇతర దేశాలతో ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ స్థాయిలో సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ పర్యటనల ద్వారా సాంకేతికత, ఆవిష్కరణలు, వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, ఇంధన సహకారం, సరఫరా గొలుసుల బలోపేతం వంటి పలు రంగాల్లో భాగస్వామ్యాలు విస్తరిస్తున్నాయని వెల్లడించింది. విదేశాంగ శాఖ పార్లమెంట్‌కు సమర్పించిన వివరాల ప్రకారం, 2021లో ప్రధాని విదేశీ పర్యటనలపై రూ.36.18 కోట్లు ఖర్చు కాగా, 2022లో అది రూ.55.81 కోట్లకు పెరిగింది. 2023లో ఖర్చు గణనీయంగా పెరిగి రూ.102.12 కోట్లకు చేరగా, 2024లో స్వల్పంగా తగ్గి రూ.100.58 కోట్లుగా నమోదైంది. ఆ ఏడాది రష్యా, ఉక్రెయిన్, అమెరికా, బ్రెజిల్ తదితర 16 దేశాలను ప్రధాని సందర్శించారు. 2022 మే నుంచి డిసెంబర్ 2024 మధ్య కాలంలో ప్రధాని మోడీ చేసిన 38 విదేశీ పర్యటనలకు దాదాపు రూ.258 కోట్లు వ్యయ మైనట్లు ప్రభుత్వం తెలిపింది. వీటిలో జూన్2023లో అమెరికా పర్యటన అత్యధికంగా రూ.22.89 కోట్లు ఖర్చు కాగా, 2024 సెప్టెంబర్‌లో అమెరికా పర్యటనకు రూ.15.34 కోట్లు వ్యయమైంది. 2025లో అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి బాధ్య తలు చేపట్టిన అనంతరం జరిగిన ప్రధాని అమెరికా పర్యటనకు రూ.16.54 కోట్లు ఖర్చైనట్లు వెల్లడించింది. అదే ఏడాదిలో విదేశీ పర్యటనలపై మొత్తం రూ.67 కోట్లకు పైగా వ్యయమైనప్పటికీ, కొన్ని పర్యటనలకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు ఇంకా పూర్తి కాలేదని, ఈ గణాంకాలు తాత్కాలికమైనవని తెలిపింది. 2026లో ఇప్పటివరకు ప్రధాని మోడీ 13 దేశాలను సందర్శించగా, నార్వే పర్యటన అత్యధిక వ్యయంతో నిలిచింది. ఈ పర్యటనకు రూ.12.46 కోట్లకు పైగా ఖర్చైనట్లు విదేశాంగ శాఖ వెల్లడించింది. 2021 ఏప్రిల్ నుంచి 2025 డిసెంబర్ వరకు భారత్‌కు మొత్తం 381.8 బిలియన్ అమెరికన్ డాలర్ల ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు వచ్చినట్లు విదేశాంగ శాఖ రాజ్యసభకు తెలిపింది.

## క్యా బోల్తీ పబ్లిక్ పేరిట జనంలోకి సిజెపి: దీప్కే

**శంభాజీనగర్, ఆగస్టు 6:** కాక్‌రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే కీలక ప్రకటన చేశారు. క్యా బోల్తీ పబ్లిక్ పేరుతో దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ ప్రచారం ద్వారా ప్రజల్ని నేరుగా కలిసి వారి సమస్యలు, దేశ పరిస్థితులపై వారి అభిప్రాయాలను తెలుసుకుంటామని చెప్పారు. మహారాష్ట్రలోని ఛత్రపతి సంభాజీనగర్‌లో జరిగిన పార్టీ కోర్ కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం అతిపెద్ద సమస్యగా మారిందని, దానిని దేశవ్యాప్తంగా ప్రధాన చర్చనీయాంశంగా తీసుకెళ్తామని ఆయన అన్నారు. విద్యా సంస్కరణలపై కూడా ప్రత్యేక దృష్టిసారిస్తామని చెప్పారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్యా ఖరీదైందిగా మారిందని, విద్యను లాభార్జన మార్గంగా మార్చారని దానిని తాము మార్చాలని అనుకుంటున్నట్లు చెప్పారు. విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్రప్రధాన్ రాజీనామా గురించి మాట్లాడుతూ ఆయన రాజీనామా చేయడం ఉద్యమానికి లభించిన అతి పెద్ద విజయమని, గత 10-12 యేళ్లుగా మోడీ ప్రభుత్వం ప్రజల్ని తొక్కిపెట్టి ఉంచిందని, తమ ఉద్యమంతో ప్రజల్లో భయం పోయిందని, ప్రజలు మరింతగా వీధుల్లోకివచ్చి తమ హక్కులకోసం పోరాడతారని వ్యాఖ్యానించారు. అంబేద్కర్, గాంధీ, నెహ్రూ కలలుగన్న అభివృద్ధి చెందిన భారత నిర్మాణమే తమ లక్ష్యమని దీప్కే అన్నారు.



## తెహల్కా మాజీ ఎడిటర్ తేజ్‌పాల్‌కు పదేళ్ల జైలు

### బాంబే హైకోర్టు తీర్పు



**ముంబై, ఆగస్టు 6:** తన జూనియర్ సహోద్యోగితో 2013లో జరిగిన లైంగిక దాడి కేసులో మాజీ తెహెల్కా ఎడిటర్ తరుణ్ తేజ్‌పాల్‌కు బాంబే హైకోర్టు గురువారం 10యేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. భారత శిక్షా స్మృతి (ఐపిసి) కింద అత్యాచారం, ఇతర నేరాలకు పాల్పడినట్లు నిర్ధారించి, ఆయనకు నిర్దోషిగా విడుదల చేయడాన్ని రద్దు చేసి, శిక్షను ఖరారు చేసింది. జస్టిస్‌లు నీలా గోఖలే, అమిత్ జమ్సందేకర్‌లతో కూడిన ధర్మాసనం ఈ శిక్షను ప్రకటించి, జైలు అధికారుల ఎదుట లొంగిపోవడానికి తేజ్‌పాల్‌కు రెండు వారాల సమయం ఇచ్చింది.

అంతకుముందు, తేజ్‌పాల్‌ను అన్ని ఆరోపణల నుంచి నిర్దోషిగా విడుదల చేసిన మపుసాలోని సెషన్స్ కోర్టు మే 2021 తీర్పుపై గోవా ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌ను జస్టిస్ గోఖలే నేతృత్వంలోని ధర్మాసనం అనుమతించింది. అప్పీల్ విచారణ సందర్భంగా, నిందితుడికి వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యాలను అంచనా వేయకుండా, సెషన్స్ కోర్టు బాధితురాలి సంఘటనానంతర ప్రవర్తన, నేపథ్యంపై దృష్టి సారించిందని ప్రాసిక్యూషన్ వాదించింది. ఫిర్యాదుదారు ఆ పత్రిక అప్పటి మేనేజింగ్ ఎడిటర్‌తో ఆరోపణలు చేసిన తర్వాత తేజ్‌పాల్ పంపినట్లు ఆరోపించబడిన క్షమాపణ ఇమెయిల్‌తో సహా, కీలకమైన సాక్ష్యాలను విచారణ కోర్టు విస్మరించిందని కూడా అది సమర్పించింది. ఇరుపక్షాల వాదనల అనంతరం తీర్పును ప్రకటిస్తూ, బాంబే హైకోర్టు తేజ్‌పాల్‌ను ఐపిసిలోని సెక్షన్లు 376(2)(ఎఫ్), 376(2)(కె) (అత్యాచారం), 354ఎ (లైంగిక వేధింపులు), 354బి (మహిళను వివస్త్రను చేసే ఉద్దేశ్యంతో ఆమెపై దాడి చేయడం లేదా నేరపూరిత బలప్రయోగం చేయడం) కింద దోషిగా నిర్ధారించింది. ఆ తర్వాత, శిక్షను ఖరారు చేసే విషయాన్ని తర్వాతకు వాయిదా వేసింది.

శిక్షకు సంబంధించిన విచారణ సందర్భంగా, తేజ్‌పాల్ తరఫు న్యాయవాది, సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు వీలుగా ఎనిమిది వారాల పాటు దోషిగా నిర్ధారించడాన్ని నిలిపివేయాలని కోరారు. ఈ తీర్పు నిర్దోషిగా విడుదల చేయడాన్ని రద్దు చేసిందని, అతనిపై మరో క్రిమినల్ కేసు ఏదీ లేదని ఆయన వాదించారు. జస్టిస్ గోఖలే నేతృత్వంలోని ధర్మాసనాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, తేజ్‌పాల్ కూడా తాను బాధితుడినని నమ్ముతున్నానని, శిక్షను నిర్ణయించేటప్పుడు హైకోర్టు కరుణతో వ్యవహరించాలని అభ్యర్థిస్తూ, కనికరం చూపాలని కోరారు. అనంతరం ధర్మాసనం తుదితీర్పు వెల్లడించింది.

## సంక్షిప్త వార్తలు

### జెన్ జెడ్ నిరసనలు దేశద్రోహం కాదు: మోహన్ భగవత్



**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ జెన్ జెడ్ యువత ఆందోళనలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద యువత ఆధ్వర్యంలోని సదస్సుల్లో ఒకటైన ది రోల్ ఆఫ్ యూత్ ఇన్ యూనైటింగ్ ది వరల్డ్, ది ఇండియన్ వేసదస్సులో పాల్గొన్న ఆయన, జెన్ జెడ్ యువ తను దేశద్రోహులుగా ముద్ర వేయడం సరికాదన్నారు.'జెన్ జెడ్ యువత ఆందోళన చేస్తున్నారంటే వారు దేశవ్యతిరేకులు కారు. వారు మనవాళ్లే మన తదుపరి తరం. వారి సమస్యలను వినాలి, పరిష్కరించాలి' అని భగవత్ పేర్కొన్నారు.

### పాక్ సర్కారుకు సెప్టెంబరు 27 తుదిగడువు

**ఇస్లామాబాద్, ఆగస్టు 6:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్ (పిటిఐ) అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్ అరెస్టు అయి మూడేళ్లవుతోంది. ఈ క్రమంలోనే ఆయనను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. పాక్ వ్యాప్తగా మళ్లీ నిరసనలు చోటుచేసుకున్నాయి. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణల్లో 100 మందికిపైగా అరెస్టయ్యారు. ఈ నిరసనలు ప్రధానంగా పిటిఐ అధికారంలో ఉన్న ఖైబర్ ఫఖ్తుంఖ్వాలో ప్రారంభమయ్యాయి.ఆయనకు న్యాయం దక్కకపోతే పాక్ ప్రజలు సెప్టెంబరు 27న ఇస్లామాబాద్‌కు మార్చ్‌గా వస్తారని హెచ్చరించారు.

### అతీక్ అహ్మద్ కుమారుడు ప్రమాదంలో మృతి

**ఝాన్సీ, యుపి, ఆగస్టు 6:** దివంగత గ్యాంగ్‌స్టర్, రాజకీయవేత్త అతీక్ అహ్మద్ చిన్న కుమారుడు ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అతీక్ అహ్మద్ ఐదుగురు కుమారులలో చిన్నవాడైన అబాన్ అహ్మద్, ఝాన్సీకి వెళ్తుండగా అతని కారు హైవేపై డివైడర్‌ను ఢీకొనడంతో మరణించాడు. అబన్ తన స్నేహితులతో కలిసి తెల్లటి క్రెటా కారులో ప్రయాణిస్తుండగా ఆ కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కారులోని సోను అనే మరో వ్యక్తి కూడా మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు.

### అప్రూవర్‌గా మారుతానంటూ దర్శన్ కేసు నిందితుడి పిటిషన్

**బెంగళూరు, ఆగస్టు 6:** కన్నడ సూపర్ స్టార్ దర్శన్, ఇతరులు ప్రమేయం ఉన్న రేణుకాస్వామి (అభిమాని) హత్య కేసులో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో 14వ నిందితుడిగా ఉన్న ప్రదోష్, నేరానికి సంబంధించిన వాస్తవాలను వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొంటూ, 'అప్రూవర్ఞ్‌గా మారడానికి అనుమతి కోరుతూ నగర కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. ప్రదోష్ గురువారం తన న్యాయవాది ద్వారా 59వ సిసిహెచ్ కోర్టులో దరఖాస్తు సమర్పించాడు. ఈ కేసులోని అన్ని వాస్తవాలను వెల్లడించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అప్రూవర్‌గా మారి కోర్టు నుండి క్షమాభిక్ష పొందాలని కోరుతున్నట్లు అందులో పేర్కొన్నాడు.

### యుపిలో ఏకైక బిఎస్‌పి ఎమ్మెల్యే కన్నుమూత

**లక్నో, ఆగస్టు 6:** ఉత్తరప్రదేశ్‌లోని బహుజన్ సమాజ్ పార్టీ ఎమ్మెల్యే ఉమాశంకర్ సింగ్ మృతిచెందారు. రస్డా నియోజకవర్గం నుంచి ఆయన ఎమ్మెల్యేగా ఉన్నారు. యూపీ అసెంబ్లీ సామర్థ్యం 403 కాగా, దాంట్లో ఉమాశంకర్ ఒక్కరే బీఎస్పీ పార్టీకి చెందినవారు. బ్రెయిన్ ట్యూమర్‌కు ఆయన చికిత్స తీసుకుంటున్నట్లు తెలిసింది. ఢిల్లీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో బుధవారం రాత్రి 8.30 నిమిషాలకు ఆయన ప్రాణాలు విడిచినట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఉమాశంకర్ మృతి పట్ల సిఎం యోగి ఆదిత్యనాథ్ సంతాపం వ్యక్తం చేశారు. బీఎస్పీ ప్రెసిడెంట్ మాయావతి కూడా ఎమ్మెల్యే మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు.

### రష్యాపై భారీ సంఖ్యలో డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి

**మాస్కో, ఆగస్టు 6:** ఉక్రెయిన్ భారీ సంఖ్యలో డ్రోన్లతో రష్యాపై దాడి చేసింది. యరోస్లావిల్ సిటీపై జరిగిన దాడిలో ఆయిల్ రిఫైనరీ దెబ్బతిన్నది. ఆ నగరం నుంచి దట్టమైన నల్లటి పొగలు వ్యాపిస్తున్నాయి. తమ నగరంపై అతి పెద్ద అటాక్ జరిగినట్లు గవర్నర్ మైఖస్త్రల్ ఎవ్రేవ్ తెలిపారు. సుమారు 92 డ్రోన్లను ధ్వంసం చేసినట్లు ఆయన చెప్పారు. రష్యాలో ఉన్న అతిపెద్ద 5 ఆయిల్ రిఫైనరీల్లో ఇదొకటి. మరో వైపు రష్యా చేసిన దాడిలో బాలక్లియా సిటీలో ముగ్గురు మృతిచెందినట్లు ఉక్రెయిన్ తెలిపింది. 12 మంది గాయపడ్డారు.




## డిఎస్సీపై సిబిఐ విచారణ జరిపించాలని దీక్ష

**తిరుపతి, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం నిర్వహించిన డిఎస్సీ నియామకాలు ముఖ్యంగా క్రీడా కోటా ఎంపికలపై సిబిఐ వంటి స్వతంత్ర సంస్థతో నిష్పక్షిక విచారణ జరిపించి నిజానిజాలను ప్రజల ముందుంచాలని వైసిపి నేతలు డిమాండ్ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి నాయకత్వంలో తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ దీక్షలో మాజీ మేయర్ డాక్టర్ శిరీష, తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్ర రెడ్డి,పార్టీ నాయకులు ఉదయ్‌వంశీ, ఆరే అజయ్,కేతం జయచంద్రారెడ్డి, పసుపులేటి సురేశ్, ప్రవీణ్, ఇమామ్, రాకేశ్, కార్యకర్తలు, యువత, మహిళలు,విద్యార్థులు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు. ఈ రిలే నిరాహార దీక్షలు ఆగస్టు 9 వరకు ప్రతిరోజూ ఉదయం 8 నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనున్నాయని వైసిపి నేతలు తెలిపారు. మెగా డిఎస్సీ నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వేలాది మంది నిరుద్యోగ యువత ఆశలను దెబ్బతీసిందని నేతలు విమర్శించారు. ఈ పరిస్థితికి రాజకీయంగా, పరిపాలనా పరంగా బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.




## క్రీడలతో మానసికోల్లాసం

• ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. తిరుపతిలో ఈనెల 4 నుండి మూడు రోజుల పాటు జరిగిన 48వ అఖిల భారత ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ అథ్లెటిక్, చెస్ ఛాంపియన్ షిప్, బాల్ బ్యాడ్మింటన్, క్యారమ్ టోర్నమెంట్ గురువారం ముగిసింది. ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో గురువారం జరిగిన టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధుల నిర్వహణలో ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు దోహదపడతాయని తెలిపారు. వివిధ క్రీడల్లో పాల్గొని జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యుత్ ఉద్యోగులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల నుంచి వివిధ విద్యుత్ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న 246 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనడం గొప్ప విషయమన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు ట్రాఫికలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె.గురవయ్య, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు ఎం.మురళి కుమార్, సిహెచ్ రామచంద్రరావు, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్, స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు వి.చంద్రశేఖర రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి జి.గంగాధర్ రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ టిడి కుమార వడివేలు, స్పోర్ట్స్, గేమ్స్ కార్యదర్శి లీలారామ్, పురుషోత్తం, జయప్రకాష్, ముని ప్రసాద్, రమేష్ బాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**అథ్లెటిక్స్‌లో ఓవరాల్ ఛాంపియన్ తమిళనాడు:** ఈ టోర్నమెంట్‌లో భాగంగా అథ్లెటిక్స్ విభాగంలో తమిళనాడు ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. కర్ణాటక రాష్ట్రం ద్వితీయ స్థానంలోనూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తృతీయ స్థానంలోనూ నిలిచాయి. ఇక బ్యాడ్మింటన్ పోటీల్లో తమిళనాడు మొదటి స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో ఆంధ్రప్రదేశ్, తృతీయ స్థానంలో కర్ణాటక నిలిచాయి. చెస్ పోటీల్లో తెలంగాణ మొదటి స్థానంలోనూ, కేరళ ద్వితీయ స్థానంలోనూ, ఆంధ్రప్రదేశ్ తృతీయ స్థానంలోనూ నిలిచాయి. ఇక క్యారమ్స్ పోటీల్లో తమిళనాడు మొదటి స్థానంలో నిలవగా, ఆంధ్రప్రదేశ్ ద్వితీయ స్థానంలోనూ, కర్ణాటక తృతీయ స్థానంలో నిలిచాయి.

## వైసిపి, టిడిపి వర్గాల వాగ్వాదం

• విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో తీవ్ర ఉద్రిక్తత

**విజయవాడ, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. డిఎస్సీ నిర్వహణలో అవకతవకలు జరిగాయంటూ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆధ్వర్యంలో వైసిపి నేతలు చేపట్టిన నిరాహార దీక్ష తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. దీక్షా వేదిక వద్ద నుంచి మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని వైసిపి నేతలు డిమాండ్ చేయడంతో స్థానిక టిడిపి శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీక్షా శిబిరం వద్దకు చేరుకున్న టిడిపి కార్యకర్తలు టెంట్‌ను తొలగించడంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి క్రమంగా చేయిదాటి ఉభయ పక్షాల కార్యకర్తలు పరస్పరం దాడులకు దిగడంతో హైటెన్షన్ నెలకొంది. అనుమతి లేని దీక్ష చేపట్టారంటూ మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణును పోలీసులు అదుపులోకి, అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉద్రిక్తతలు తగ్గకపోవడంతో, ఘర్షణలను అదుపు చేసేందుకు పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసారు. చివరికి వారిని అక్కడ నుంచి పంపించారు. విష్ణు, ఇతర నాయకులను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని టిడిపి ఎమ్మెల్యే బొండా ఉమా తీవ్రస్థాయిలో హెచ్చరించారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వైసిపి నేతలు చేపట్టిన నిరాహార దీక్ష వద్ద చోటుచేసుకున్న పరిణామాలపై ఆయన తీవ్రస్థాయిలో స్పందించారు. డిఎస్సీ నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు చేయడంపై మండిపడిన ఆయన... అసలు అక్రమాలపై చర్చకు రమ్మంటే వైసిపి నేతలు పారిపోయారని ఎద్దేవా చేశారు. పోలీసుల అనుమతి లేకుండా రోడ్డుపై కూర్చుని చంద్రబాబు, లోకేశ్‌లను బూతులు తిడితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "శాంతియుతంగా నిరసన తెలపాలనుకుంటే ధర్నా చౌక్‌లో చేసుకోవాలి. అంతేకాని రోడ్డుపై కూర్చుని మా నాయకులపై దాడి చేస్తామంటే చూస్తూ ఊరుకోం. తొలుతిస్తాం. వెల్లంపల్లి శ్రీనివాస్ ఎక్కడ కనిపిస్తే అక్కడ కట్టేస్తాం అని హెచ్చరించారు. ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తే ఇకపై సహించేది లేదని, ప్రతిఘటన తప్పదని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## రైతులను ఆదుకున్నది మేమే

• మంత్రి లోకేష్ స్పష్టీకరణ... వీడియో విడుదల

**విజయవాడ, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** పొగాకు రైతులు సంక్షోభంలో ఉన్న ప్రతిసారి ఆదుకున్నది టీడీపీ ప్రభుత్వమేనని మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. ప్రస్తుత సంవత్సరంలో టొబాకో బోర్డు లక్ష్యం 131 మిలియన్ కిలోలు కాగా, రైతులు రికార్డు స్థాయిలో ఏకంగా 241 మిలియన్ కిలోల పొగాకును ఉత్పత్తి చేశారన్నారు. అధిక ఉత్పత్తి ఉన్నప్పటికీ సుమారు 100 మిలియన్ కిలోల పొగాకుకు ప్రతి కిలోకు 10 రూపాయల చొప్పున మొత్తం 100 కోట్ల రూపాయలను ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ఈ పంపిణీ ప్రక్రియను ఐదారు నుంచే ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. గతంలోనూ రూ.280 కోట్లు వెచ్చించి 25 మిలియన్ కిలోల బర్లీ పొగాకును కొనుగోలు చేశామన్నారు. అలాగే 2014-15లో మార్కెట్లో ధరలు పడిపోయినప్పుడు కూడా కిలోకు రూ.20 ఆర్థిక సాయం అందించిన విషయాన్ని గుర్తు చేశారు. 2019, 2020లలో పొగాకు ధరలు 121, 123 రూపాయలకు పడిపోయినప్పుడు జగన్ ప్రభుత్వం ఒక్క కిలో కూడా కొనుగోలు చేయకుండా రైతులను నడిరోడ్డుపై వదిలేసిందని లోకేశ్ ఆరోపించారు. జగన్ పొగాకు రైతులకు లక్ష రూపాయలు వడ్డీ లేని రుణాలు ఇవ్వామని చెబుతున్నారని కానీ, క్షేత్రస్థాయిలో తమకు ఎలాంటి రుణం అందలేదని స్వయంగా రైతులే స్పష్టం చేస్తున్న వీడియోను లోకేశ్ విడుదల చేశారు. ఆ వీడియోలో మాజీ సిఎం జగన్‌ను ఉద్దేశించి పొగాకు రైతులు వడ్డీ లేని రుణాలిచ్చామని మీరు అబద్ధాలు చెబుతుంటే, ఇవ్వలేదని రైతులు మీ ఎదుటే నిలదీస్తున్నారు. పొగాకు రైతులను సంక్షోభంలో ఎల్లప్పుడూ ఆదుకున్నది టీడీపీనే. అదనపు దిగుబడి ఉన్నా, ప్రతి కిలోకు రూ.10 చొప్పున రూ.100 కోట్ల ఆర్థిక సాయాన్ని నేటి నుంచే పంపిణీ చేస్తున్నాం. మీ హయాంలో ధరలు పడిపోతే రైతులను నడిరోడ్డుపై వదిలేశారని మంత్రి లోకేష్ ఎద్దేవా చేశారు.

## తిరుమలలో కర్ణాటక భక్తుడు అదృశ్యం

**తిరుమల, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం తిరుమలకు వచ్చిన కర్నాటక భక్తబృందంలో ఓ భక్తుడు తప్పిపోయినట్లు బాధితులు గురువారం తిరుమల 1టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఉడిపి జిల్లాకు చెందిన సుందర పూజారి (65) తన కుటుంబ సభ్యులు బంధువులతో కలిసి గతనెల 27న శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. దర్శనానంతరం ఆలయం వెలుపల సుందర పూజారి కాళ్ల నొప్పితో బాధపడు తుండటంతో, ఆయనను లడ్డూ కాంప్లెక్స్ ఎదుట కూర్చోబెట్టి కుటుంబ సభ్యులు ప్రసాదాలు తీసుకురావడానికి వెళ్లారు. ఆ తరువాత తిరిగి వచ్చి చూడగా ఆయన అక్కడ కనిపించలేదు. కుటుంబ సభ్యులు తిరుమల, తిరుపతి పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలించినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సిసిటివి ఫుటేజీని పరిశీలించగా సుందర పూజారి బాలాజీ బస్ స్టాండ్ వద్ద ఆరోజు రాత్రి 9.30 గంటలుకు చివరిగా కనిపించినట్లు తరువాత ఆయన ఆచూకీ తెలియలేదు. దీనిపై గురువారం ఆయన అల్లుడు రాఘవేంద్ర పూజారి తిరుమల 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## తిరుపతిలో టిడిపి నేత ఇంటిపై వైసిపి శ్రేణుల దాడి

**తిరుపతి, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి జెబి శ్రీనివాస్ నివాసముంటున్న తిరుచానూరు మార్గంలోని మామిడికాయల మండి సమీపంలో ఉన్న ఆయన ఇంటి పై గురువారం దుండగులు దాడి చేశారు. వైసిపి నేత భూమన కరుణాకర్‌రెడ్డి అనుచరులు రౌడీషీటర్ బెల్ట్ మురళీ భార్యతోబాటు వైసిపి నేత వాసు యాదవ్ అతని అనుచరులు 30 మంది వరకు కత్తులు, రాడ్లు, రాళ్లతో దాడికి పాల్పడి వీరంగం సృష్టించారనేది జెబి వర్గం ఆరోపిస్తోంది. ఆ సమయంలో జెబి శ్రీనివాస్ ఇంట్లో ఉండగానే ఈ పరిస్థితి నెలకొందని టిడిపి వర్గాలు తెలిపాయి. ఊహించని పరిణామంతో బయటకు వచ్చిన జెబి వ్యక్తిగత సహాయకులపై దాడికి దిగారని, వైనం రాఘవేంద్ర, లోకేష్‌కు గాయాలయ్యాయని తెలిపారు. ఈ సంఘటనపై తిరుపతి రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు.


బుధవారం కోర్టు నుంచి చిన్న అనే వ్యక్తిని కిడ్నాప్ చేసిన వైసిపి

నాయకులు సంఘటనతో పోలీసులు కేసు నమోదు చేయడంతో జీర్ణించుకోలేక భూమన అనుచరులు దాడికి పాల్పడ్డారని టిడిపి వర్గాల ఆరోపిస్తున్నాయి.

గురువారం మధ్యాహ్నం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్లు ఎమ్మెల్యే మురళీమోహన్, పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, దంపూరి భాస్కర్ యాదవ్, మన్నెం శ్రీనివాసులు, ఇతర నేతలు జెబిని పరామర్శించారు. ఇంటిపై దాడి హేయమైన చర్య అని, రాజకీయ ముసుగులో వైసిపి దాడులకు తెగబడు తోందని ఇదీ మంచి సంస్కృతి కాదని పేర్కొన్నారు. దాడులకు భయపడమని, కుట్రలు చేస్తే వెనక్కి వెళ్ళమని హెచ్చరించారు. ఏ దురుద్దేశంతో ఈ పని చేసారనేది తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. మారణాయుధాలతో డాడి చేయడానికి వచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నేతలు డిమాండ్ చేశారు.


# తిరుమల సమాచారం



## తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి టిటిడి సారె

**తిరుమల, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** తమిళనాడు తిరుత్తణిలో వెలసిన వళ్ళీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి తిరుమల వేంకటేశ్వరస్వామి తరపున గురువారం మధ్యాహ్నం టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామివారి అనుగ్రహంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఆలయంలో నిర్వహించే అనేక ఉత్సవాలలో ఆడికృత్తిక అత్యంత ప్రముఖమైనదని, ఈ సందర్భంగా భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూలతో అలంకరించిన కావడులను ఎత్తుకు వెళ్ళి మొక్కుబడలు చెల్లించడం విశేషంగా ఉంది. పట్టువస్త్రాలు సమర్పించిన కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, డిప్యూటీ ఇఒ లోకనాథం, అధికారులు పాల్గొన్నారు.

## నేడు కోదండరామస్వామి పవిత్రోత్సవాలకు అంకురార్పణ



**తిరుమల, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కోదండరామస్వామి ఆలయ పవిత్రోత్సవాలకు నేటి సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించనున్నారు. 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. వైదిక సంప్రదాయం ప్రకారం జాతా శౌచం, మృతా శౌచం వంటి వేళల్లో ఆలయ ప్రవేశం నిషిద్ధం. యాత్రీకుల వల్లగానీ, సిబ్బంది వల్ల గానీ తెలియక దోషాలు జరుగుతుంటాయి. ఇలాంటి వాటివల్ల ఆలయ పవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు ప్రతి ఏడాదీ మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. పవిత్రోత్సవాల్లో భాగంగా మొదటిరోజు యాగశాలలో పవిత్ర ప్రతిష్ఠ, శయనాధివాసం, రెండో రోజు పవిత్ర సమర్పణ, యాగశాలలో వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మూడో రోజు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. ప్రతిరోజూ ఉదయం స్నపనతిరుమంజనం, సాయంత్రం తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. గృహస్తులు(ఇద్దరు) 500 రూపాయలు చెల్లించి పవిత్రోత్సవాల్లో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, ఒక రవికె, చివరిరోజు ఒక పవిత్రం బహుమానంగా అందజేస్తారు. ఈ సందర్భంగా టిటిడిహిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## సెప్టెంబర్ 15నుండి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

• తొమ్మిదిరోజుల పండుగకు సిద్ధమవుతున్న ఏడుకొండలు

**తిరుమల, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలంకొండల్లోని కలియుగ వైకుంఠం తిరుమలలో తొమ్మిదిరోజుల ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగే దేవుని ఉత్సవాలకు సిద్ధమవుతోంది. బ్రహ్మోత్సవాలు జరిగే రోజుల్లో ప్రతిరోజూ ఉదయం, రాత్రి వాహన సేవల్లో శ్రీవారి ఉత్సవమూర్తులు మలయప్ప స్వామి ఉభయదేవేరులతో కలసి ఆలయ మాఢవీధుల్లో ఊరేగనుండటం భక్తులకు భక్తిపరవశమే. నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లే తిరుమలకొండపై ప్రతిరోజూ ఉత్స వాలు, సేవలే. ఏడాదికోసారి తొమ్మిదిరోజులు జరిగే బ్రహ్మోత్సవాలకు దేశవిదేశాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. వైకుంఠం నుండి కలియుగవైకుంఠానికి శ్రీమహా విష్ణువు వేంకటేశ్వరునిగా ఆవిర్భవించడం, ఆనాటి నుంచి నేటికీ అంగరంగవైభవంగా దేవుని బ్రహ్మోత్సవాలను అకుంఠత దీక్షతో, భక్తిశ్రద్ధలతో టిటిడి పెద్దలు జరిపిస్తుండటం పరిపాటి. సెప్టెంబర్ 15నుండి 23వరకు జరగనున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో 15వ తేదీ తొలిరోజు మంగళవారం సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి పెద్దశేష వాహనసేవతో వాహనసేవలు మొదలవుతాయి. ఐదవరోజు 19వ తేదీ శనివారం రాత్రి వడ్డీకాసుల వేంకటేశ్వరుడికి అత్యంత ప్రీతిపాత్రమైన గరుడ వాహనసేవ జరుగుతుంది. 21న సోమవారం సాయంత్రం బంగారురథం, 23వ తేదీ బుధవారం ఉదయం చక్రస్నానం మహోత్సవం ప్రధాన ఘట్టాలు. ఆ తరువాత 18రోజుల విడిదిలో అక్టోబర్ 11నుండి 20వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు కూడా జరగనున్నాయి.

ఈ బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడం, భక్తులకు సకల సౌకర్యాలు కల్పించే దిశగా టిటిడి యంత్రాంగం పనులు మొదలు పెట్టింది. ఇప్పటికే గత ఆరురోజులుగా తిరుమలలో స్వామివారి పుష్కరిణి మూసివేసి అభివృద్ధి పనులు చేపడుతోంది. ఇంకా ఆలయ మాఢవీధుల్లో, ఆలయుం ముందు, వాహన మండపం ప్రాంతాల్లో బారికేడ్లు, గ్యాలరీలు ఏర్పాటు, అదనంగా మరుగుదొడ్లు, తాగునీటి కొళాయిలు, రంగురంగుల రంగవల్లులు తీర్చి దిద్దాల్సిన వంటి పనులు చేపట్టేలా టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి




అన్ని విభాగాలను ఉత్తేజపరిచేలా సూచనలు చేస్తున్నారు. భారీగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని పటిష్టంగా ఏర్పాట్లు చేయనున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది పూర్తిస్థాయిలో సకల సౌకర్యాలు, సదుపాయాలు కల్పించేందుకు టిటిడి యంత్రాంగం సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 15వ తేదీ నుండి మొదలుకానున్న శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు 23వతేదీతో ముగుస్తాయి. బ్రహ్మోత్సవాలకు తొలిఘట్టంగా ధ్వజారోహణం జరిగే సెప్టెంబర్ 15నే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు.

## సమష్టిగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు విజయవంతంగా నిర్వహిద్దాం

• టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

**తిరుమల, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** ఈ ఏడాది అధికమాసం రావడంతో ఏడుకొండల వేంకటేశ్వరునికి రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహించుకోనున్నామని, ఈ బ్రహ్మోత్సవాలను టిటిడి, జిల్లా యంత్రాంగం సమిష్టిగా కృషి చేసి విజయవంతం చేద్దామని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆదేశించారు. ఇందుకోసం అన్ని విభాగాల, శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 15వ తేదీ నుండి మొదలుకానున్న శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు 23వ తేదీతో ముగుస్తాయి. గురువారం ఉదయం తిరుమలలో పద్మావతి అతిథి గృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో బ్రహ్మోత్సవాల సమీక్ష సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, డిఎఫ్ఒ ఫణికుమార్ నాయుడుతో కలిసి వివిధ శాఖల ఏర్పాట్ల పై సమగ్రంగా సుదీర్ఘంగా సమీక్షి ంచారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల నేపథ్యం లో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసి బస్సుల సంఖ్యను అవసరానికి అనుగుణంగా పెంచాలని సూచిం చారు. వాహనాల పార్కింగ్‌లో ఎలాంటి ఇబ్బం దులు తలెత్తకుండా ముందుగానే పార్కింగ్ స్థలాల ను కేటాయించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాలలో ముఖ్యంగా గరుడ వాహనం, చక్రస్నానం రోజున అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని సూచించారు.

జెఇఒ శరత్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో 25 రాష్ట్రాలకు చెందిన కళా బృందాలతో పాటు సింగపూర్, జర్మనీ నుండి కూడా కళా బృందాలు విచ్చేసేలా చర్యలు చేపట్టామని తెలియజేశారు. టిటిడి సిఇ మనోహరం, డిప్యూటీ ఇఒలు రాజేంద్ర, భాస్కర్, సిఎంఒ డాక్టర్ కుసుమ కుమారి, డిఎఫ్ఒ ఫణి కుమార్ నాయుడు, తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, విఎస్ఒ అల్లం సురేంద్ర, విజిలెన్స్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



## సనాతన ధర్మ పరిరక్షణకు 8న 'ధర్మ రక్షణ యజ్ఞం'

**తిరుపతి, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** సనాతన ధర్మ పరిరక్షణకు ప్రజల సమిష్టి సంకల్పాన్ని ఒక నిరంతర ఆధ్యాత్మిక ఉద్యమంగా మలుస్తూ శక్తిపీఠం ఆధ్వర్యం లో 'ధర్మ రక్షణ యజ్ఞం - ప్రజా హోమ కుండం' నిర్వహిస్తున్నారు. ఈ విశిష్ట వైదిక కార్యక్రమం శనివారం ఉదయం 10 గంటలకు తిరుపతి రాయలచెరువు కట్టసమీపంలోని శక్తిపీఠం మహాక్షేత్రంలో ప్రారంభం కానుంది. అనంతరం ప్రజా హోమం ప్రతిరోజూ రెండు సమయాలలో కొనసాగుతుంది. సాధారణంగా ఆలయా ల్లో జరిగే యజ్ఞ, హోమ కార్యక్ర మాలలో భక్తులు పాల్గొని ఆశీర్వాదం పొందుతారు. శక్తిపీఠంలో ఏర్పాటు చేస్తున్న ప్రజా హోమ కుండం ద్వారా ప్రతి భక్తుడు ఆచార్యుల మార్గదర్శకత్వం లో స్వయంగా హోమ ద్రవ్యాన్ని సమ ర్పించి యజ్ఞంలో ప్రత్యక్ష భాగస్వామి కావచ్చని తెలిపారు. "ధర్మరక్షణకు సమిష్టి సంకల్పం - కామ్యసిద్ధికి వ్యక్తిగత సమర్పణ" అనే పవిత్ర భావనతో ఈ కార్యక్రమం రూపొందించబడిందని కుర్తాళ సిద్ధేశ్వరీ పీఠాధిపతి సిద్ధేశ్వరా నంద భారతీ మహాస్వామి, శక్తిపీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించ బడుతుంది. భక్తులందరూ కుటుంబ సమేతంగా విచ్చేసి, తమ పవిత్ర సంకల్పాన్ని ధర్మరక్షణకు సమర్పించాలని శక్తిపీఠం ఆహ్వానించింది.

## హరోం హరా... కావళ్లతో కళకళ

దక్షిణ కైలాసంలో ఆడికృత్తిక సంబరాలు


విజ్ఞాన గిరిపై బారులు తీరిన భక్తులు

**శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పట్టణం గురువారం సుబ్రమణ్యస్వామి ఆలయం కావళ్లతో కళకళ లాడింది. ఎటుచూసినా కావళ్ల భక్తులతో 'హరోం..హర..' అంటూ విజ్ఞానగిరికి తరలివచ్చారు. పట్టణమంతా పసుపుపచ్చ దుస్తులు ధరించిన భక్తులు భుజాలపై కావళ్లతో కుమారస్వామి కొండకు చేరుకున్నారు. ఆడికృత్తిక సందర్భంగా పట్టణంలోని విజ్ఞానగిరిపై వెలసిన సుబ్రమణ్యస్వామి దర్శించుకోవడానికి వేలాది మంది భక్తజనం తరలివచ్చారు. వేకువ జాము నాలుగుగంటల నుంచే పుష్కరిణి కిట కిట లాడింది. సాయంత్రం మూడు గంటల నుంచి ఆలయంలో స్వామివారికి మొక్కులు చెల్లించేందుకు తండోపతండాలుగా భక్త జనం క్యూకట్టింది. ఓవైపు స్థానికులు, మరోవైపు కావళ్లతో విజ్ఞానగిరి కిటకిటలాడింది. పోలీసులు కూడా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటరలు చోటుచేసుకోకుండా భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకున్నారు.

## ఇంద్రవిమానంపై కుమారస్వామి దర్శనం

**శ్రీకాళహస్తి, ఆగస్టు 6 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలో జరుగుతున్న ఆడికృత్తిక మహోత్సవాల్లో గురువారం కృత్తిక సందర్భంగా వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యం స్వామి ఇంద్రవిమానంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఉదయం శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక సందర్భంగా గురువారం స్వామి అమ్మవార్లను చక్కగా అలంకార మండపంలో అలంకరించారు. అనంతరం సురేష్ గురుకుల్ హారతులిచ్చారు. తొలి హారతుల్ని ఇఒ బికె వెంకటేశులు తీసుకున్నారు.



ఆయనే ఆలయ ప్రాకారం లోపల స్వామి అమ్మవార్ల గ్రామోత్సవ పల్లకిని మోసు కుంటూ తెచ్చారు. తరువాత యాగశాలలో పూజలు నిర్వ హించారు. అక్కడ నుంచి బోయిలు మోసుకుంటూ తేరువీధిలోని వాహనాల మండపం వద్దకు తెచ్చారు. అక్కడ ఇంద్ర విమానంలో ప్రతిష్టించి గ్రామోత్సవం నిర్వహించారు. నాలుగుమాడ వీధులతో పాటు బాబూ అగ్రహారంలలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

## మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి: వైసిపి



**కోవూరు (నెల్లూరు), ఆగస్టు 6 ప్రభాతవార్త:** డిఎస్సీ వ్యవహారంలో జరిగిన అవకతవకలకు నిరసనగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ చేపట్టిన ఉద్యమం కార్యక్రమంలో భాగంగా కోవూరు పట్టణంలో నిర్వహించిన నిరాహార దీక్షకు మాజీ మంత్రి, వైసిపి పిఎసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఈ దీక్షకు మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న వైసిపికి ప్రజల నుంచి వస్తున్న మద్దతు ప్రభుత్వానికి కనువిప్పు కావాలన్నారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కంటే దోపిడీ అరాచకాలు పెరిగిపోయాయని ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై కేసులు పెట్టడం తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. డిఎస్సీ ప్రక్రియలో లోపాలు చోటు చేసుకున్నాయని, అర్హులైన అభ్యర్థులకు కాకుండా అనుకూలమైన వారికే అవకాశాలు కల్పించారన్నారు. దీనిపై విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. యువత ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్‌రెడ్డి, కోవూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల పరిశీలకులు కొండూరు అనిల్‌బాబు, వీరి చలపతిరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిఎస్సీపై సిబిఐతో విచారణ జరిపించాలి



**కావలి, ఆగస్టు 6 ప్రభాతవార్త:** డీఎస్సీ అక్రమాలపై బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేసి సిబిఐతో విచారణ జరిపించి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ నందు గురువారం వైసిపి కావలి నియోజవకర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన అంతా అవినీతి, అరాచక పాలన అని డిఎస్సీ నియామక పక్రియలో వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర పారదర్శక విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడుతున్న నిరుద్యోగ యువతకు అన్యాయం జరిగిందనే ఆరోపణలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయరాదన్నారు. డీఎస్సీ అభ్యర్థులు వ్యక్తం చేస్తున ప్రతి సందేహాన్ని ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అద్యక్షులు పందిటి కామరాజు, జిల్లా ఉపాధ్యక్షులు కనుమర్లపూడి వెంకటనారాయణ, జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, జిల్లా నాయకులు షేక్ షాహుల్, హమీద్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నెల్లూరులో వైసిపి రిలే నిరాహారదీక్షలు



**నెల్లూరు(విద్య), ఆగస్టు 6 ప్రభాతవార్త:** మెగా డిస్సీలో చోటుచేసుకున్న అక్రమాలను నిరూపిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్చార్జి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నగరంలోని స్థానిక వీఆర్సీ సెంటరులో రిలే నిరాహార దీక్షలని చేపట్టారు. విద్యార్థులు మెడలో నల్ల కండువాలు ధరించి రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్ర మానికి నెల్లూరు నగర నియోజకవర్గ పరిశీలకులు కొండ్రెడ్డి రంగారెడ్డి, వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి చైతన్య వైసిపి రాష్ట్ర జిల్లా, నాయకులు, విద్యార్థి యువజన సంఘాల నేతలు విద్యార్థులు హాజరై నిరసన తెలియజేశారు. డిఎస్సిపై సిబిఐ ద్వారా విచారణ జరిపించాలని, అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేష్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## చిత్తూరులోనూ రిలే దీక్షలు



**చిత్తూరు, ఆగస్టు 6 ప్రభాతవార్త:** రాష్ట్రంలో డిఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో జరిగిన అక్రమాలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రోడ్డెక్కారు. చిత్తూరు పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఆగస్టు నెలాఖరు వరకు 30 పోలీసు యాక్టు అమలులో వున్నప్పటికీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ కేంద్రాల్లో రిలే నిరాహారదీక్షలను ప్రారంభించారు. డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణకు ఆదేశించి, అక్రమాలకు బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా విధులు నిర్వహిస్తున్న నారా లోకేష్ తన మంత్రి పదవికి సత్వరం రాజీనామా చేసి విచారణను ఎదుర్కొవాలని వైకాపా నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## మెగా డిఎస్సీపై వైకాపా విష ప్రచారం: ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్



**చిత్తూరురూరల్, ఆగస్టు 6 ప్రభాతవార్త:** అత్యంత పారదర్శకంగా నిర్వహించిన మెగా డిఎస్సి 2025పై వైకాపా నాయకులు విషప్రచారం చేస్తున్నారని, రిలే నిరాహారదీక్షల పేరుతో డ్రామాలు ఆడుతున్నారనీ ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ఆరోపించారు. డిఎస్సీ పై వైకాపా నాయకులు చేస్తున్న రిలే నిరాహార దీక్షల డ్రామాలను ఖండిస్తూ గురువారం ఎమ్మెల్యే కార్యాలయం ప్రజాదర్బార్‌లో డిఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులతో కలసి విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన హామి మేరకు మెగా డిఎస్సీని పారదర్శకంగా నిర్వహించి 16,347 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. ఐదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు భర్తీ చేయని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేడు డిఎస్సీపై ఆరోపణలు చేయడం తగదని, డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ చేయాలంటూ వైకాపా ఎమ్మెల్సీ వేసిన పిల్‌ను హైకోర్టు కొట్టి వేసిందనే విషయాన్ని గుర్తించాలన్నారు.

## వైసిపి రిలే దీక్షలకు సిపిఐ మద్దతు



**అనంతపురం, ఆగస్టు 6 ప్రభాతవార్త బ్యూరో:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థి, నిరుద్యోగ సమస్యలతోపాటు డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని మంత్రి నారాలోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు సిపిఐ నేతలు మద్దతును ప్రకటించారు. అనంతరం జిల్లా వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ తమ పార్టీ నేతలతో కలిసి హాజరై సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిఎస్సీలో అక్రమాలు జరిగాయని పోస్టుల భర్తీ ప్రక్రియ పారదర్శకంగా జరగలేదన్నారు. వీటిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అదే విధంగా అనంతపురం జిల్లా యాడికిలోనూ, విజయవాడలోనూ వైసిపి దీక్షలపై టిడిపి దాడులు చేయడం అప్రజాస్వామిక చర్యలు అన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే ఉద్యోగాలు కల్పిస్తాం, ఉద్యోగం ఇవ్వకుంటే రూ.3వేలు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చినా రెండేళ్లు గడిచినా హామీ నెరవేర్చలేదన్నారు. అదే విధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద రూ.9,500 కోట్లు బకాయిలు పెండింగ్‌లో పెట్టారని, మెగా డిఎస్సీ పేరుతో దగాచేసి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్‌లు స్పోర్ట్స్ కోటా పేరిట అనర్హులకు ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగులను వంచించారని మండి పడ్డారు. విద్యార్థి, యువత సమస్యలపై వైసిపి ఆధ్వర్యంలో ప్రజా స్వామ్య యుతంగా రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే విజయవాడలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుపై ఎమ్మెల్యే బోండా ఉమా ఆధ్వర్యంలో దాడులు చేయడం అప్రజాస్వామికం అన్నారు. నియంతల్లా వ్యవహరించిన ఎంతో మంది కాల గర్భంలో కలిసి పోయారని చంద్రబాబుకు కూడా అదే పరిస్థితి వస్తుందని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. అనంతరం సాయంత్రం రిలే దీక్షలో కూర్చున్న పార్టీ నేతలు, శ్రేణులకు జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింప జేశారు. కార్యక్రమంలో పలువురు వైసిపి పార్టీ ముఖ్య నేతలు నాయకులు పాల్గొన్నారు.

## పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన అమలులో

# ఆంధ్రప్రదేశ్ గణనీయ పురోగతి



- నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలి
- రాష్ట్రవ్యాప్త పురోగతిని సమీక్షించిన ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**విజయవాడ, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచిందని రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక పథకం అమలు పురోగతిని సమీక్షించేందుకు గురువారం ఆయన ఏపీ డిస్కంల ఛైర్మన్‌లు, మేనేజింగ్ డైరెక్టర్లు, ఇంధన శాఖ ఉన్నతాధికారులు, ఇతర సంబంధిత అధికారులతో ఉన్నతస్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటు వేగవంతం చేయడం, పరిశుభ్ర ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించడం, అర్హులైన లబ్ధిదారులకు కేంద్ర ఆర్థిక సహాయం సకాలంలో అందేలా చూడడం పట్ల రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ లక్ష్యాల సాధనకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పీఎం సూర్య ఘర్ పథకం అమలులో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవాలని ఆకాంక్షించారు. ఈ నెల 4 నాటికి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4,11,915 రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో 2,78,438 వ్యవస్థలను జాతీయ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయగా, మరో 1,33,477 వ్యవస్థలను ఎస్సీ/ఎస్టీ యుటిలిటీ లెడ్ అగ్రిగేషన్ మోడల్ కింద భౌతికంగా ఏర్పాటు చేసి, జాతీయ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రగతితో ఆంధ్రప్రదేశ్ దేశంలో తొలి నాలుగు రాష్ట్రాల్లో స్థానం సంపాదించిందని పేర్కొన్న ఆయన, ఇదే వేగాన్ని కొనసాగిస్తూ దేశంలోనే తొలి స్థానాన్ని సాధించే దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. రూఫ్‌టాప్ సోలార్ విస్తరణకు తక్కువ వడ్డీతో రుణాలు అత్యంత కీలకమని పేర్కొన్న విజయానంద్, ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే అందుబాటు ధరలో రుణ సౌకర్యాలు కల్పించడం అవసరమన్నారు. అర్హులైన వినియోగదారులు సులభంగా సోలార్ రుణాలు పొందేలా జిల్లా కలెక్టర్లు, లీడ్ బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో డిస్కంలు సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. వెనుకబడిన తరగతుల (బీసీ) కోసం ప్రతిపాదిత యుటిలిటీలెడ్ అగ్రిగేషన్ మోడల్ పురోగతిని కూడా సమావేశంలో సమీక్షించారు. ఈ సమావేశంలో ఏపి ఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్– మేనేజింగ్ డైరెక్టర్ ఎల్. శివశంకర్, ఏపి ఇపిడిసిఎల్ ఛైర్మన్– మేనేజింగ్ డైరెక్టర్ ఐ.పృథ్వీతేజ్, ఏపి సిపిడిసిఎల్ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ పి.పుల్లారెడ్డి, ఎన్ఆర్ఇడి క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.కమలాకర్ బాబు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'ఎన్‌టిఆర్ జిల్లాలో ఎరువుల కొరత లేదు'





ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, ఆగస్టు 6 ప్రభాతవార్త:** ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన రసాయనిక ఎరువుల కొరత ఎన్‌టిఆర్ జిల్లాలో లేదని కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా స్పష్టం చేసారు. గురువారం నందిగామ పట్టణంలోని సత్యసాయి ఎరువుల దుకాణంలో గురువారం ఉదయం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేసారు. దుకాణంలో రికార్డులు, ఎరువుల స్టాకును పరిశీలించిన ఆయన దుకాణ యజమానుల నుండి పలు వివరాలు సేకరించారు. ప్రభుత్వ నిబంధనలు తూచతప్పకుండా పాటించాలని ఆదేశించారు. ఈసందర్భంగా ఏపిఏఐయంఎస్ యాప్ ద్వారా రైతులకు అందించిన ఎరువుల వివరాలను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, ఎరువుల కోసం రైతులు క్యూలైన్‌లలో నిలబడాల్సిన అవసరం లేదన్నారు. యాప్‌లో నమోదు చేసుకున్న ప్రతిరైతుకు అవసరం మేరకు ఎరువులు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రాఘవాపురంలో సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలను కలెక్టర్ పరిశీలించారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించి రైతులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీఓ ఎ.అనీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**'సర్' పరిశీలన:** నందిగామలో జరుగుతున్న 'సర్' కార్యాక్రమాని న్ కలెక్టర్ పరిశీలించారు. ముసాయిదా ఓటరు జాబితా జులై 31వ తేదీ విడుదల చేసామని, ఏదైనా కారణంతో ఓటరు జాబితాలో పేరులేకపోతే అర్హులైన ఓటర్లు నిరాశపడకుండా వెంటనే బిఎల్‌ఓను సంప్రదించి అవసరమైన ధ్రువపత్రాలతో క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ధాఖలు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం నందిగామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్ పలు సూచనలిచ్చారు.

## మాజీ సైనికుల పిల్లలు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

**విజయవాడ, ఆగస్టు 6 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి ఉపకారవేతన పథకం ద్వారా ఉపకారవేతనము పొందేందుకు అర్హత కలిగిన మాజీసైనికుల పిల్లలు దరఖాస్తు చేసుకోవాలని న్యూఢిల్లీలోని కేంద్రీయ సైనిక్‌బోర్డు ఓ ప్రకటనలో తెలిపింది. 2026–27 విద్యాసంవత్సరంలో బిఈ, బిటెక్, యంబిబిఎస్, బిడిఎస్, బిఎడ్, బిబిఏ, బి.ఫార్మసీ, ఎల్‌ఎల్‌బి, యంబిఏ, యంసిఏ, బిఎస్సీ(నర్సింగ్) తదితర వృత్తివిద్యా కోర్సుల్లో మొదటి సంవత్సరం చదువుతున్న మాజీ సైనికుల పిల్లలు ధరఖాస్తు చేసుకోవాలన్నారు. వృత్తివిద్యాకోర్సుల్లో చేరుటకు నిర్వహించిన అర్హత పరీక్షల్లో 60శాతం మార్కులు పొంది ఉండాలని తెలిపారు. ఈపథకంలో ఎంపికయిన విద్యార్థికి ఏడాదికి రూ.30వేలు, విద్యార్థినికి రూ.36వేలు చొప్పున ఉపకారవేతనము మంజూరు చేస్తామన్నారు. అర్హత కలిగిన విద్యార్థినీవిద్యార్థులు తమ దరఖాస్తులను డిసెంబర్ 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను జిల్లాసైనిక సంక్షేమ కార్యాలయంలో అందచేయాలన్నారు.

## కృష్ణా జిల్లాలో కుటుంబం ఆత్మహత్యాయత్నం

**విజయవాడ, ఆగస్టు 6 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లాలో ముగ్గురు ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది. వీరవల్లి సొసైటీ కార్యదర్శి హేమ, భర్త బాలాజీ, కుమారుడు గురువారం వేకువజామున పురుగుల మందు తాగారు. అపస్మారక స్థితికి వెళ్లే ముందు వీరు బంధువులకు ఫోన్ చేసి చెప్పారు. వారు వెంటనే అక్కడికి చేరుకుని ముగ్గురినీ విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సొసైటీలో అక్రమాలపై విచారణ జరగడమే ఈ ఘటనకు కారణమని పోలీసులు తెలిపారు.

## వ్యసనాల కోసం వరుస చోరీలు

# అంతర్‌రాష్ట్ర గజదొంగ అరెస్ట్

- రూ.14.87 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం



నిందితుని అరెస్ట్ చేసి సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు

**వెంకటగిరి, ఆగస్టు 6 ప్రభాతవార్త:** వెంకటగిరి, డక్కిలి ప్రాంతాల్లో జరిగిన వరుస 80 చోరీల కేసులను పోలీసులు ఛేదించారు. దీర్ఘకాల నిఘా, సాంకేతిక ఆధారాలు, క్షేత్రస్థాయి సమాచారంతో నిందితుడిని ప్రత్యేక నిగా బృందం అదుపులోకి తీసుకుంది. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా దొంగతనాల నియంత్రణ, నేరస్థుల అరెస్టుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్న నేపథ్యంలో వెంకటగిరి పోలీసులు మరో కీలక విజయాన్ని నమోదు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 80కి పైగా చోరీలకు పాల్పడిన అంతర్‌రాష్ట్ర నేరస్థుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి సుమారు రూ.14.87 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కరక రాజాబాబు (47) అనకాపల్లి జిల్లాకు చెందినవాడు. వ్యసనాలకు బానిసైన అతను డబ్బు అవసరమైనప్పుడల్లా రైళ్లలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణిస్తూ తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడేవాడు. గతంలో దేవాలయాల హుండీలు, గృహచోరీలు, రైళ్లలో ప్రయాణికుల వస్తువుల దొంగతనాలు సహా అనేక నేరాలకు పాల్పడి, పలు కేసుల్లో జైలు శిక్ష అనుభవించాడు. వెంకటగిరి, డక్కిలి ప్రాంతాల్లో ఇటీవల జరిగిన వరుస చోరీలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారాన్ని సమన్వయం చేస్తూ నిందితుడి కదలికలను నిరంతరం పర్యవేక్షించారు. నిందితుడి వద్ద నుంచి సుమారు 64 గ్రాముల బంగారం, 3 కిలోల 400 గ్రాముల వెండి ఆభరణాలు, స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాల మొత్తం విలువ సుమారు రూ.14.87 లక్షలుగా అంచనా వేశారు. ఈ స్వాధీనంతో వెంకటగిరి, డక్కిలి ప్రాంతాల్లో నమోదైన కేసులలో 6 చోరీ కేసులు, బాపట్లలో నమోదైన 2 చోరీ కేసులు ఛేదించబడ్డాయి. క్రైమ్ సీఐ ఎ.శ్రీనివాసులు, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో వెంకటగిరి సీఐ ఎం.రోశయ్య, వెంకటగిరి ఎస్ఐ టి.స్వరూప్, బాలాయపల్లి ఎస్ఐ డి.సురేష్‌బాబు, డక్కిలి ఎస్ఐ బ్రహ్మానాయుడు, వారి సిబ్బంది గిరిబాబు, రాజేంద్ర ప్రసాద్ సమన్వయంతో నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు.



## ప్రధాని మోడీతో నెట్‌ఫ్లిక్స్ సిఇఒ భేటీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 6:** నెట్‌ఫ్లిక్స్ సీఈవో టెడ్ సారండోస్ భారత ప్రధాని నరేంద్ర మోడీని ఢిల్లీలో కలిశారు. ఆ ఇద్దరూ విస్తృత స్థాయిలో చర్చించుకున్నారు. భారతీయుల స్టోరీటెల్లింగ్ సామర్థ్యాన్ని కూడా డిస్కస్ చేసుకున్నారు. సృజనాత్మకత కలిగిన భారతీయులకు నెట్‌ఫ్లిక్స్ సీఈవో సారండోస్ ఆహ్వానం పలికారు. తమ ఫ్లాట్‌ఫామ్‌ను వినియోగించి అద్భుతమైన కథలను చెప్పాలన్నారు. భారతీయులు ఎటువంటి కథలను చెప్పబోతారో అన్న ఆసక్తితో ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్‌లోకి నెట్‌ఫ్లిక్స్ ప్రవేశించి పదేళ్లు అవుతోంది. సీఈవో టెడ్ సారండోస్ ఇవాళ ప్రధాని మోడీని కలవడం సంతోషంగా ఉన్నట్లు నెట్‌ఫ్లిక్స్ కంపెనీ తన స్టేట్మెంట్‌లో తెలిపింది. భారతీయ మీడియా, ఎంటర్‌టైన్మెంట్ పరిశ్రమను విశ్వస్థాయికి తీసుకెళ్లే అంశాన్ని చర్చించినట్లు చెప్పారు. నెట్‌ఫ్లిక్స్ ఇండియా స్టోరీటెల్లింగ్ ఇనిషియేటివ్‌ను ఆవిష్కరిస్తున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. ఐఐసీటీ, ఎన్ఎఫ్‌డీసీతో కలిసి భవిష్యత్తు తరాలకు చెందిన భారత క్రియేటివ్ టాలెంట్‌ను ప్రోత్సహించనున్నారు. ఇండియా తన రాబోయే రోజుల్లో ఎటువంటి సృజనాత్మకను ప్రదర్శిస్తుందో చూసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు నెట్‌ఫ్లిక్స్ తెలిపింది. భారత మీడియా, ఎంటర్‌టైన్మెంట్ రంగానికి చెందిన సామర్థ్యాన్ని డిస్కస్ చేసినట్లు ప్రధాని మోడీ తెలిపారు. స్టోరీటెల్లింగ్ అంశంలో భారత్‌కు సుసంపన్న సంప్రదాయం ఉందని, అసాధారణ రీతిలో క్రియేటివ్ ట్యాలెంట్ ఉందన్నారు. కాంటెంట్ క్రియేషన్‌లో ఇండియా బలోపేతంగా ఉన్నట్లు చెప్పారు.

## ఎటిఎఫ్‌లో ఇథనాల్ కలుస్తున్న వార్తలు అవాస్తవం



**న్యూఢిల్లీ,ఆగస్టు 6:** ఏవియేషన్ టర్బన్ ఫ్యూయల్‌లో ఇథనాల్ కలిపేందుకు ప్రభుత్వం ప్రణా ళికలు వేస్తున్నట్లు వచ్చిన వార్తలను పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కొట్టిపారేశారు. అవన్నీ తప్పుడు వార్తలు అని, బాధ్యతారాహితంతో కూడిన వార్తలను నమ్మవద్దు అన్నారు. విమాన ఇంధనంలో ఇథనాల్ కలిపే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద లేదని మంత్రి రామ్మోమన్ నాయుడు తెలిపారు. ఇథనాల్, సస్టేనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ అనేవి రెండూ భిన్నమైనవని, వాటిని కలపరాదు అని మంత్రి తెలిపారు. సస్టేనియబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ అనేది అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఇంధమని, ఏసీఏట గుర్తింపు దానికి ఉందనన్నారు. చాలా టెస్టింగ్ తర్వాత అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం తయారు చేస్తారన్నారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడాన్ని మానుకోవా లన్నారు. విమాన ప్రయాణికుల్లో గుబులు నింపడం తప్ప ఏమీ లేదన్నారు. ప్రయాణికుల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

## భారీగా పెరిగిన బియ్యం ధరలు

### రూ.500 నుండి రూ. వెయ్యి వరకూ పెరుగుదల

**హైదరాబాద్, ఆగస్టు 6, ప్రభాతవార్త:** బియ్యం ధరలు అమాంతం పెరిగిపోవడంతో సామాన్య ప్రజలు విలవిలలాడుతున్నారు. భారీగా పెరిగిన రేట్లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వరి సాగు అంతంతే ఉండే అవకాశాలు ఉంటాయని చెప్పడంతో మార్కెట్‌లో బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. నెల రోజులుగా ధరలు ఊహించని రీతిలో రూ.500 నుండి రూ.వెయ్యి వరకూ పెరిగాయి. దీంతో మధ్య తరగతి, పేదలు ఎలా బతకాలో అర్థం కాకా సతమతమవుతున్నారు. సాధారణ ప్రజలు ఎక్కువగా వినియోగించే హంస రకం బియ్యం ధర క్వింటాల్‌కు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు చేరింది. హెచ్‌ఎంటీ బియ్యం రూ.6,500 నుంచి రూ.7 వేలకు, సోనా మసూరి రూ.5,200 నుంచి రూ.5,800లకు, జైశ్రీరాం సన్న రకం బియ్యం రూ.7వేల నుంచి రూ.7,500లకు పెరిగాయి.

మరోపక్క రాష్ట్రంలో సన్నరకం బియ్యం దిగుబడి గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో వ్యాపారులు ముందుగానే ధరలు పెంచినట్లు తెలుస్తోంది. రేషన్ దుకాణాల ద్వారా పొందిన బియ్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సన్నబియ్యం వైపు ప్రజలు మొగ్గు చూపడం కూడా డిమాండ్ పెరగడానికి తెలుస్తోంది. కాగా బియ్యంతో పాటు ఇతర నిత్యావసరాల ధరలు కూడా అదే రీతిలో పయనిస్తున్నాయి. నాణ్యమైన తెల్ల జొన్నలు క్వింటాల్‌కు రూ.7.500లకు, డయాబెటిక్ బాధితులు ఎక్కువగా వాడే పచ్చ జొన్నలు రూ.6వేల నుంచి రూ.8వేలకు పెరిగాయి. కందిపప్పు కిలోకు రూ.120, పెసరపప్పు రూ.110, మినపప్పు రూ.115, ఎర్ర పప్పు రూ.90కి చేరింది. గోదుమల ధర సైతం క్వింటాల్‌కు రూ.300 పెరిగింది.

## ఎల్‌నినోతో 27.9 కోట్ల మందికి ఆహారభద్రత ముప్పు

### సమితి ఆహారభద్రతా విభాగం కొత్త అంచనాలు

**న్యూయార్కు, ఆగస్టు 6:** అత్యంత శక్తివంతమైన ఎల్‌నినో వాతావరణ సంఘటన వచ్చే ఏడాది చివరి నాటికి ప్రపంచంలోని అత్యంత బలహీనమైన కొన్ని ప్రాంతాలలో అదనంగా దాదాపు 49 మిలియన్ల జనాభాకు ఆహారభద్రత కొరవడే ముప్పు ఉందని ప్రపంచ ఆహారభద్రత పథకం విభాగం వెల్లడించింది. బలమైన ఎల్ నినో సంభవించడానికి 81 శాతం అవకాశం ఉందని, దీనితో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు కనీసం 1982 నుండి అత్యంత వేడి స్థాయికి చేరుకుంటాయని, 1950 తర్వాత అత్యంత బలమైన సంఘటనగా మారే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి సంస్థ ఒక నివేదికలో తెలిపింది. పసిఫిక్ మహాసముద్రంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు కాలానుగుణంగా పెరగడం వల్ల కలిగే ఎల్ నినో, ప్రపంచ వాతావరణ సరళిని మారుస్తుంది మరియు ఇది తరచుగా దక్షిణ ఆఫ్రికాలో కరువు, ఆసియాలోని కొన్ని ప్రాంతాలలో రుతుపవనాల ఆలస్యం మరియు ఇతర చోట్ల అస్తవ్యస్తమైన వర్షపాతంతో ముడిపడి ఉంటుందని తెలిపింది. గతంలో భారీస్థాయిలో ఆకలికి కారణమైన సంఘటనలు ఇవేనని డబ్ల్యూఎఫ్‌పి ఆహార భద్రత మరియు పోషకాహార విశ్లేషణ సేవల డైరెక్టర్ జీన్‌మార్టిన్ బాయర్ మీడియాతో అన్నారు. ఎల్ నినో యొక్క ప్రతికూల ప్రభావాలకు గురయ్యే అవకాశం ఉన్న 45 దేశాలపై జరిపిన విశ్లేషణ ఆధారంగా, తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొంటున్న ప్రజల సంఖ్య దాదాపు 49 మిలియన్లు పెరిగి మొత్తం 274 మిలియన్లకు చేరుకోవచ్చని డబ్ల్యూఎఫ్‌పి అంచనా వేసింది. ఇప్పటికే సంక్షోభ స్థాయి లేదా అంతకంటే తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొంటున్న ప్రాథమిక జనాభాతో పోలిస్తే 22శాతం పెరుగుదల ఉదన్నారు. మధ్య అమెరికా, దక్షిణ ఆఫ్రికా అత్యంత తీవ్రంగా ప్రభా వితమయ్యే ప్రాంతాలలో ఉంటాయని అంచనా వేయబడింది, మధ్య అమెరికాలో ఆహార అభద్రతతో బాధపడే ప్రజల సంఖ్య 83 శాతం, దక్షిణ ఆఫ్రికాలో దాదాపు 75శాతం పెరగనుందని డబ్ల్యుఫ్‌పి నివేదిక పేర్కొంది.


సెమ్వాల్ కాంస్యం

# స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో సూరజ్‌కు తొలి స్వర్ణం



**న్యూఢిల్లీ:** ప్రపంచ విశ్వవిద్యాలయ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో సూరజ్ చంద్ భారతదేశానికి తొలి స్వర్ణాన్ని తీసుకొచ్చాడు. గురువారం ముంబైలో జరిగిన ప్రపంచ విశ్వవిద్యాలయ స్క్వాష్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకున్న తర్వాత సూరజ్ కుమార్ చంద్ భారతదేశానికి మొట్టమొదటి స్వర్ణ పతక విజేతగా నిలిచాడు. స్వదేశీ ప్రేక్షకుల ముందు పోటీపడిన సూరజ్, గంటా ఐదు నిమిషాల పాటు ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్‌లో హంగేరీకి చెందిన బెనెడెక్ టకాక్స్‌ను 5-11, 11-8, 11-5, 6-11, 11-4 స్కోరుతో ఓడించాడు. సూరజ్ తొలి గేమ్‌ను కోల్పోయి తడబడి ఆరంభం చేసినప్పటికీ, తదుపరి కోలుకుని తర్వాతి రెండు గేమ్‌లను గెలుచుకుని ఆధిక్యం సాధించాడు. ఆ తర్వాత హంగేరి ప్రత్యర్థి నాలుగో గేమ్‌ను 11-6 తేడాతో కైవసం చేసుకుని నిర్ణయాత్మక గేమ్‌కు దారితీశాడు. ఒత్తిడిలోనూ సంయమనం పాటిస్తూ, ఫైనల్ గేమ్‌లో 11-4 తేడాతో ఆధిపత్యం చెలాయించి టైటిల్‌ను కైవసం చేసుకున్న సూరజ్, గత ఎడిషన్‌లో సాధించిన పతకాన్ని మరింత మెరుగుపరుచుకున్నాడు. అలాగే సెమీఫైనల్స్‌లో బెనెడెక్ చేతిలో ఓడిపోయిన ఓం సెమ్వాల్ కాంస్యం కైవసం చేసుకోవడంతో, పురుషుల సింగిల్స్ విభాగంలో భారత్ డబుల్ పోడియంను దక్కించుకుంది. అయితే, మహిళల సింగిల్స్‌లో ఏ భారత క్రీడాకారిణి కూడా రౌండ్ ఆఫ్ 16 దాటి ముందుకు వెళ్లలేదు. నిరుపమ దుబే, షమీనా రియాజ్ మరియు పూజా ఆర్తి రఘు ముగ్గురూ రౌండ్ ఆఫ్ 16 వద్దే నిష్క్రమించారు.

# డబ్ల్యూటిటి ఛాంపియన్స్‌లో శ్రీజ తొలి విజయం




**న్యూఢిల్లీ:** 2026 డబ్ల్యూటిటి ఛాంపియన్స్‌లో శ్రీజ ఆకుల తొలి విజయాన్ని కైవసం చేసుకుంది. అయితే మణికా బాత్రా, మానవ్ థక్కర్, మనుష్ షా ముగ్గురూ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించడంతో, శ్రీజ ఒక్కతే భారత క్రీడాకారిణిగా ఈ టోర్నీలో నిలిచింది. జపాన్‌లోని యోకోహామాలో జరుగుతున్న మొదటి రౌండ్‌లో ఆస్ట్రేలియాకు చెందిన సోఫియా పోల్కనోవాను 3-2 తేడాతో ఓడించి, శ్రీజ ఛాంపియన్స్ ఈవెంట్‌లో తన కెరీర్‌లో తొలి విజయాన్ని నమోదు చేసింది. భారత ప్యాడ్లర్ తన తొలి గేమ్‌ను 911 తేడాతో కోల్పోయినప్పటికీ, పుంజుకుని తర్వాతి మూడు గేమ్‌లను 11-8, 11-6, 12-10 తేడాతో గెలుచుకుని, కేవలం 32 నిమిషాల వ్యవధిలోనే వెనుకబడిన స్థితి నుండి విజయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత, వైల్డ్‌కార్డ్ ద్వారా ప్రవేశించిన బాత్రా, చైనాకు చెందిన రెండో సీడెడ్ కువాయ్ మాన్‌తో ఏమాత్రం పోరాడకుండా 1-11, 7-11, 7-11 తేడాతో ఓడిపోయాడు. పురుషుల సింగిల్స్‌లో కూడా షా, ఠక్కర్‌లకు ఇలాంటి ఫలితమే ఎదురైంది. స్లోవేకియాకు చెందిన డార్కో జోర్గిచ్‌తో హోరాహోరీ పోరులో ఠక్కర్ 2-3 తేడాతో ఓడిపోగా, ఫ్రాన్స్‌కు చెందిన ఆరో సీడ్ అలెక్సిస్ లెబ్రన్ చేతిలో షా 3-0 తేడాతో చిత్తుగా ఓడిపోవడంతో, ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో శ్రీజ ఒక్కరే మిగిలిన భారత ఆటగాడిగా నిలిచింది.

# కొరియా మాస్టర్స్‌లో క్వార్టర్స్‌కు తన్వి

**న్యూఢిల్లీ:** భారత్ టీనేజ్ షట్లర్ తన్వి శర్మ కొరియా మాస్టర్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లగా, హోరాహోరీ పోరు తర్వాత మరో భారత్ షట్లర్ అన్మోల్ ఖర్బ్ టోర్నీ నుండి నిష్క్రమించింది. కొరియా మాస్టర్స్‌లో మహిళల సింగిల్స్‌లో గురువారం తన్వి శర్మ, అష్మిత చలిహా, రక్షిత రామ్‌రాజ్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోవడంతో ఊపు లభించింది. అయితే అన్మోల్ ఖర్బ్, మరో ఇద్దరు భారత షట్లర్లు అద్భుతమైన ప్రదర్శనల తర్వాత నిష్క్రమించారు. తన్వి శర్మ తోటి భారత క్రీడాకారిణి శ్రియాంశి వలిశెట్టిపై 21-16, 17-21, 21-13 తేడాతో విజయం సాధించి తన ఫామ్‌ను కొనసాగించింది. ఆరంభంలో వెనుకబడిన తన్వి పుంజుకుని తొలి గేమ్‌ను కైవసం చేసుకోగా, శ్రియాంశి రెండో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. చివరి గేమ్‌లో, విరామం తర్వాత తన్వి పట్టు సాధించి 57 నిమిషాల్లోనే మ్యాచ్‌ను సునాయాసంగా ముగించింది. అలాగే కొరియాకు చెందిన కిమ్ మిన్‌జిపై 21-17, 21-6 తేడాతో ఆధిపత్య విజయం సాధించి అష్మిత చలిహా కూడా ముందంజ వేయగా, జపాన్‌కు చెందిన మనామి సుయిజును 22-20, 21-10 తేడాతో ఓడించిన రక్షిత రామ్‌రాజ్ క్వార్టర్‌ఫైనల్‌కు అర్హత సాధించింది. అయితే, ఐదవ సీడ్ ఇషారాణి బరువా, మాన్సీ సింగ్ తదుపరి రౌండ్‌కు అర్హత సాధించడంలో విఫలమయ్యారు. కొరియాకు చెందిన కిమ్ మిన్ సన్‌తో జరిగిన హోరాహోరీ పోరులో ఇషారాణి 21-17, 18-21, 19-21 తేడాతో ఓడిపోగా, చైనాకు చెందిన నాల్గవ సీడ్ హాన్ క్వియాన్సీ చేతిలో మాన్సీ 12-21, 21-14, 17-21 తేడాతో పరాజయం పాలైంది. వియత్నాం ఒలింపియన్ వు థి ట్రాంగ్‌తో హోరాహోరీగా జరిగిన పోరులో 21-23, 21-15, 18-21 తేడాతో ఓటమి పాలవడంతో ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లోనే అన్మోల్ ఖర్బ్ ప్రస్థానం ముగిసింది.






# శ్రీలంక సిరీస్‌లో బెంచ్‌కే యంగ్ ప్లేయర్లు

## ఒక్క మ్యాచ్‌లోనూ నో ఛాన్స్

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో జరగబోయే కీలక టెస్టు సిరీస్‌లో భారత తుది జట్టు కూర్పుపై స్పష్టత ఇచ్చింది. ఘనమైన ఫామ్‌లో ఉన్నప్పటికీ, జట్టులోని అనుభవజ్ఞుల పోటీ తట్టుకోలేక నలుగురు యంగ్ క్రికెటర్లు బెంచ్‌కే పరిమితం కానున్నారు. కనీసం ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం కూడా లభించక, డ్రెస్సింగ్ రూమ్‌తోనే సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. శ్రీలంక పర్యటనలో మొదటి టెస్టు కోసం బిసిసిఐ అత్యంత బలమైన ప్లేయింగ్ ఎలెవన్‌ను సిద్ధం చేసింది. అక్కడి స్పిన్ పిచ్‌లు, వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పక్కా వ్యూహంతో వెళుతోంది. జట్టు కలయికను సమతుల్యంగా ఉంచాలనే ఉద్దేశంతో అనుభవజ్ఞులైన ఆటగాళ్లకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో జట్టులోకి ఎంపికైన కొందరు యువ ఆటగాళ్లకు నిరాశ తప్పడం లేదు. సీనియర్లు ఫామ్‌లో ఉండటం, ఏ ఒక్కరికీ గాయాలు కాకపోవడంతో తుది జట్టులోకి కొత్తవారికి ప్రవేశం లభించడం దాదాపు అసాధ్యంగా మారింది. ఎలాంటి అవాంఛనీయ మార్పులు లేకపోతే ఈ సిరీస్ పొడవునా నలుగురు ఆటగాళ్లు కేవలం వాటర్ బాయ్ పాత్రకే పరిమితం కావాల్సి వస్తుంది. దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన స్పిన్ బౌలింగ్‌తో ఆకట్టుకున్న మానవ్ సుథార్‌ను బ్యాకప్ స్పిన్నర్‌గా జట్టులోకి తీసుకున్నారు. లంక పిచ్‌లపై భారత ప్రధాన స్పిన్ దళం అనుభవం ముందు అతనికి చోటు దక్కడ దాదాపు అసాధ్యం. తొలి టెస్టులోనే కాకుండా సిరీస్ అంతటా అతనికి బెంచ్ తప్పేలా లేదు. మరొకవైపు అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో రాణిస్తూ ఆల్ రౌండర్ ప్రతిభను చూపించిన సారాంశ్ జైన్ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. జట్టులో ఇప్పటికే తుది కూర్పు కుదిరిపోవడంతో ఈ ఇద్దరు స్పిన్నర్లు తమ వంతు అవకాశం వచ్చే వరకు నిరీక్షించక తప్పడం లేదు. ఇక యంగ్ స్పీడ్‌స్టర్ గుర్‌నూర్ బ్రార్ తన వేగంతో సెలక్టర్లను ఆకట్టుకుని జట్టులో చోటు దక్కించుకున్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్లు జట్టులో ఉండటంతో గుర్‌నూర్‌కు అవకాశం లభించడం కష్టంగా మారింది. పేస్ విభాగంలో గట్టి పోటీ ఉండటంతో అతను మైదానంలోకి దిగే సూచనలు కనిపిస్తుండవు. టాప్ ఆర్డర్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ పరిస్థితి కూడా భిన్నంగా ఏమీ లేదు. ఓపెనింగ్, మిడిల్ ఆర్డర్‌లో ఇప్పటికే స్టార్ బ్యాటర్లు స్థానాలు ఖాయం చేసుకోవడంతో పడిక్కల్ రిజర్వ్ బెంచ్‌పైనే కూర్చోవాల్సి వస్తుంది. ఎవరైనా ఆటగాడు గాయపడితే తప్ప అతనికి ఆడే ఛాన్స్ రాదు.

# వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో ఫైనల్‌కు అమానత్, ఆశిష్



**న్యూఢిల్లీ:** ఈ సీజన్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత క్రీడాకారిణి అమానత్ కంబోజ్, ప్రపంచ అథ్లెటిక్స్ అండర్20 ఛాంపియన్‌షిప్‌లోని మహిళల డిస్కస్ త్రో ఫైనల్‌లో స్థానం దక్కించుకుంది. పురుషుల జావెలిన్ క్వాలిఫికేషన్‌లో ఆశిష్ సైతం ఫైనల్‌కు చేరుకున్నాడు. గురువారం జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లో యువ భారత్ ప్లేయర్ కంబోజ్ 52.58 మీటర్ల అత్యుత్తమ త్రోను నమోదు చేసింది. క్వాలిఫికేషన్ స్టాండింగ్స్‌లో ఓవరాల్‌గా ఆరో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించింది. పురుషుల జావెలిన్‌లో ఆశిష్ 69.87 మీటర్ల త్రోతో తన క్వాలిఫికేషన్ గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరుకున్నాడు. ఓవరాల్‌గా రెండో స్థానంలో నిలవగా, ధరణిధరన్ 68.07 మీటర్ల ప్రదర్శనతో క్వాలిఫై అయ్యాడు. ఓవరాల్‌గా 12వ స్థానంలో అర్హత సాధించాడు. దక్షిణాఫ్రికా అండర్20 ఛాంపియన్ జాన్‌హెండ్రిక్ హేమన్స్ 76.02 మీటర్ల త్రోతో పురుషుల జావెలిన్ క్వాలిఫికేషన్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. అలాగే పోలాండ్‌కు చెందిన అలెక్సాండర్ వోజ్నా, చైనాకు చెందిన యాంగ్ జావోయి కూడా 69 మీటర్ల మార్కును దాటడంతో, ఫైనల్ హోరాహోరీగా సాగనుంది. మరోవైపు, పురుషుల 800 మీటర్ల పరుగులో, మొగలి వెంకట్రామ్ తన హీట్‌లో 1:52.81 సమయంతో మూడవ స్థానంలో నిలిచి సెమీఫైనల్స్‌కు అర్హత సాధించాడు. అయితే, ఉవిన్ ఆనంద్ 1:52.37 వేగవంతమైన సమయాన్ని నమోదు చేసినప్పటికీ, మరింత వేగవంతమైన క్వాలిఫైయింగ్ హీట్‌లో పోటీపడటం వల్ల సెమీఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయాడు.



# ఎల్‌ఐసి జూన్ త్రైమాసికంలో 23% లాభాల వృద్ధి

## కొత్తవ్యాపారంలో మెరుగైన లాభదాయకత



**ముంబయి, ఆగస్టు 6:** దేశీయ అతిపెద్ద జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసీ ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. నికర లాభం వార్షిక ప్రాతిపదికన రూ.10,987 కోట్లనుంచి 23 శాతం పెరిగి రూ.13,492 కోట్లకు చేరింది. త్రైమాసికంలో నికర ప్రీమియం ఆదాయం 7 శాతం పెరిగి రూ.1.27 లక్షల కోట్లకు చేరగా, ఇతర ఆదాయం రూ.130 కోట్ల నుంచి రూ.635 కోట్లకు పెరిగింది. పెట్టుబడి ఆదాయం పెరగడం, ప్రీమియం వృద్ధి, కొత్త వ్యాపారంలో మెరుగైన లాభదాయకత సంస్థ పనితీరుకు ప్రధాన బలంగా నిలిచాయి. ఈ త్రైమాసికంలో వాల్యూ ఆఫ్ న్యూ బిజినెస్ విఎన్‌బీ 61 శాతం పెరిగి రూ.3,136 కోట్లకు చేరింది. అలాగే విఎన్‌బి మార్జిన్ 15.4 శాతం నుంచి 22.9 శాతానికి పెరగడం కొత్త పాలసీల లాభదాయకత మెరుగైనట్లు సూచిస్తోంది. మొదటి సంవత్సరం ప్రీమియం ఆదాయం కూడా 22 శాతం పెరిగి రూ.9,217 కోట్లకు చేరడం కొత్త పాలసీల విక్రయాలు బలంగా ఉన్నాయని వెల్లడించింది. సంస్థ ఆర్థిక స్థితి మరింత బలపడగా, సాల్వెన్సీ రేషియో గత ఏడాది 2.17 నుంచి 2.42కు మెరుగుపడి నియంత్రణ సంస్థ నిర్దేశించిన కనీస స్థాయికంటే ఎంతో ఎక్కువగా కొనసాగింది. పాలసీ కొనసాగింపు పరంగా పర్సిస్టెన్సీ రేషియో స్వల్పంగా 70.9 శాతం నుంచి 70.4 శాతానికి తగ్గింది. దీర్ఘకాలికంగా 61వ నెల పర్సిస్టెన్సీ రేషియో 58.3 శాతం నుంచి 61.3 శాతానికి పెరగడం పాలసీదారుల నిలకడ మెరుగుపడినట్లు సూచిస్తోంది. గురువారం ఎల్‌ఐసీ షేరు 1.39 శాతం తగ్గి రూ.387.55 వద్ద ముగిసింది. గత వారం రోజుల్లో 8.35 శాతం, నెల రోజుల్లో 9.68 శాతం, ఈ ఏడాది ఆరంభం నుంచి 9.11 శాతం, గత ఏడాది కాలంలో 13.18 శాతం మేర షేరు విలువ క్షీణించింది.

# లాభాల్లో ముగిసిన మార్కెట్లు

**ముంబయి, ఆగస్టు 6:** మధ్యప్రాచ్య ఉద్రిక్తతలకు దౌత్యపరమైన ఆశలు, జూన్ త్రైమాసిక కార్పొరేట్ ఫలితాలు అంచనాలకు మించి రావడంతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు గురువారం వరుసగా రెండో రోజు లాభాల్లో ముగిశాయి. రోజంతా ఒడిదుడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో ప్రభుత్వ రంగ బ్యాంకులు , ఆయిల్ గ్యాస్ షేర్లలో బలమైన కొనుగోళ్లు సూచీలకు మద్దతునిచ్చాయి. మెటల్, ఆటో, ఐటీ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి లాభాలను పరిమితం చేసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లలో నమోదైన ర్యాలీతో నిఫ్టీ 24,600 మార్కును అధిగమించి ముగిసింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ 373.76 పాయింట్లు పెరిగి 78,954.76 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 11.35 పాయింట్లు లాభపడి 24,636 వద్ద స్థిరపడింది. వరుసగా రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1.33 శాతం, నిఫ్టీ 1.29 శాతం మేర పెరిగాయి. నిఫ్టీకి రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.52 శాతం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2.84 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 0.51 శాతం లాభాలతో మద్దతు ఇచ్చాయి. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.01 శాతం పెరగగా, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.25 శాతం లాభపడింది. బీఎస్ఈలో మొత్తం 2,100 షేర్లు లాభాల్లో ముగియగా, 2,191 షేర్లు నష్టపోయాయి. మరో 209 షేర్లలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. కమోడిటీ మార్కెట్‌లో అక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ చమురు ధర బ్యారెల్‌కు 64 సెంట్లు పెరిగి 80.09 డాలర్లకు చేరుకుంది. విదేశీ మారక మార్కెట్‌లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. పాక్షికంగా మార్పిడి చేయగల రూపాయి విలువ డాలర్‌కు 95.2450 వద్ద ట్రేడవగా, గత సెషన్ ముగింపు 95.0850గా నమోదైంది. ఎంసీఎక్స్‌లో డిసెంబర్ 4, 2026 డెలివరీ బంగారం ఫ్యూచర్స్ ధర 0.80 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,50,980కు చేరుకుంది. న్యూలాండ్ ల్యాబొరేటరీస్ షేరు 8.24 శాతం ఎగిసింది. నవీన్ ఫ్లోరిన్ ఇంటర్నేషనల్ 13.27 శాతం భారీ లాభం నమోదు చేసింది. కమ్మిన్స్ ఇండియా 0.70 శాతం క్షీణించింది. జీఎంఎం ఫాఫ్లర్ 14.57 శాతం జంప్ చేసింది. బయోకాన్ 2.68 శాతం పెరిగింది. కొల్టేపాటిల్ డెవలపర్స్ 10.10 శాతం ఎగిసింది. గార్వేర్ టెక్నికల్ ఫైబర్స్ 5.16 శాతం లాభపడింది. సయాజీ హోటల్స్ 0.96 శాతం తగ్గింది. వర్ల్‌పూల్ ఆఫ్ ఇండియా 2.07 శాతం పెరిగింది. భారతి హెక్సాకామ్ 2.43 శాతం నష్టపోయింది.






# బ్రిటానియా నికర లాభం రూ.591 కోట్లు

**ముంబయి, ఆగస్టు 6:** ఎఫ్ఎంసీజీ దిగ్గజం బ్రిటానియా ఇండస్ట్రీస్ తొలి త్రైమాసికంలో నికర లాభం వార్షిక ప్రాతిపదికన 13.4 శాతం పెరిగి 521కోట్లనుంచి రూ.591 కోట్లకు చేరుకుంది. మార్కెట్ విశ్లేషకులు అంచనా వేసిన రూ.606 కోట్లతో పోలిస్తే కంపెనీ లాభం తగ్గింది. కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 8.2 శాతం పెరిగి రూ.ఐదువేలకోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.4,622 కోట్లు ఉండగా, విశ్లేషకుల అంచనా రూ.4,999 కోట్లుగా ఉంది. దీంతో ఆదాయం దాదాపు అంచనాలకు అనుగుణంగానే నమోదైంది. కంపెనీ నిర్వహణ లాభం 11 శాతం పెరిగి 757.2 కోట్లనుంచి రూ.840.4 కోట్లకు చేరుకుంది. మార్కెట్ అంచనా రూ.871 కోట్లుగా ఉంది. దీంతో నిర్వహణ లాభం కూడా అంచనాలను అందుకోలేకపోయింది. ఇక ఎబిడిటా మార్జిన్ 16.4 శాతం నుంచి 16.8 శాతానికి పెరిగింది. అంటే 40 బేసిస్ పాయింట్లు మెరుగుపడింది.

# హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ నాలుగో క్లౌడ్ రీజియన్ ప్రారంభం

## భారత్‌లో రూ.20.5 బిలియన్ పెట్టుబడులకు ఊతం

**హైదరాబాద్, ఆగస్టు 6:** భారత్‌లో క్లౌడ్, కృత్రిమ మేధస్సు మౌలిక వసతుల విస్తరణలో భాగంగా మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌లో తన నాలుగో క్లౌడ్ రీజియ న్‌ను ప్రారంభించింది. దేశంలో క్లౌడ్, ఏఐ రంగాల అభివృద్ధికి ప్రకటించిన 20.5 బిలియన్ డాలర్ల పెట్టుబడి ప్రణాళికలో ఇది కీలక ముందడుగని కంపెనీ వెల్లడించింది. హైదరాబాద్ క్లౌడ్ రీజియన్‌ను మూడు అందుబాటు జోన్లతో నిర్మించారు. ఏఐ, క్లౌడ్ వర్క్‌లోడ్స్‌కు అత్యంత విశ్వసనీయత, నిరంతర సేవలు అందించే సామర్థ్యం ఏర్పడుతుందని మైక్రోసాఫ్ట్ తెలిపింది. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ హైదరాబాద్ డేటా సెంటర్‌లో జీరోవాటర్ కూలింగ్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది. హైదరాబాద్ రీజియన్ ప్రారంభంతో ప్రస్తుతం మైక్రోసాఫ్ట్ పుణే, చెన్నై, ముంబై, హైదరాబాద్ నగరాల్లో క్లౌడ్ రీజియన్లను నిర్వహిస్తోంది. దీంతో భారత్‌లో అతిపెద్ద హైపర్‌స్కేల్ క్లౌడ్ నెట్‌వర్క్ తమదేనని కంపెనీ పేర్కొంది. జియో భాగస్వామ్యంతో మరో రెండు డేటా సెంటర్లను కూడా నిర్వహిస్తూ దేశీయ క్లౌడ్ సామర్థ్యాన్ని మరింత విస్తరించింది. కొత్త క్లౌడ్ రీజియన్ ద్వారా డేటా ఉత్పత్తి, ప్రాసెసింగ్ జరిగే ప్రాంతాలకు సమీపంలోనే అత్యంత వేగంగా సేవలుఅందించడం సాధ్యమవుతుందని మైక్రోసాఫ్ట్ తెలి మైక్రోసాఫ్ట్ ఇండియా అండ్ సౌత్ ఏషియా అధ్యక్షుడు పునీత్ చందోక్ మాట్లాడుతూ, భారీ స్థాయి క్లౌడ్ మౌలిక వసతులు, భద్రత, నైపుణ్యాభివృద్ధి, సార్వభౌమ క్లౌడ్ సామర్థ్యాలను కలిపి భారత్‌లో ఏఐ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడమే ఈ పెట్టుబడి లక్ష్యమని తెలిపారు.









Print and Published by Gireesh Sangh, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at 11-37, Moramputi, Rajamahendravaram-533 103. Phone: 24 2460408. RNI No.64863/96, Editor: Damerla Sai Baba, Responsible for selection of News-under the PRB Act. Regd: No.H/SD/337/09-11 . Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

రాజమహేంద్రవరం | శుక్రవారం 07 ఆగస్టు 2026 | I






# యానాం మంత్రి మల్లాడి కృష్ణారావుకు ఏడు కీలక శాఖల బాధ్యతలు

**యానాం, ఆగస్టు 6:(ప్రభాతవార్త)** పుదుచ్చేరి రాష్ట్ర మంత్రివర్గంలో యానాం ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రివర్యులు మల్లాడి కృష్ణారావుకి ప్రభుత్వం ఏడు కీలక శాఖల బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు శాఖల కేటాయింపులు ఖరారైనట్లు అధికారిక సమాచారం వెల్లడైంది.

**మంత్రి మల్లాడి కృష్ణారావుకి కేటాయించిన శాఖలు ఇవి:** ప్రజా పనుల శాఖ, పర్యాటక శాఖ., మత్స్య శాఖ పరిశ్రమల శాఖ, కార్మిక శాఖ, పోర్టు శాఖ, పౌర విమానయాన శాఖ, ఈ శాఖల బాధ్యతలతో మంత్రి మల్లాడి కృష్ణారావు పాత్ర మరింత కీలకంగా మారిందని రాజకీయ, ప్రజా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. యానాం ప్రాంత అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పర్యాటక రంగం, పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు వంటి అంశాల్లో ఆయన నాయకత్వంలో మరింత పురోగతి సాధించాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ఈ సందర్భంగా యానాం ప్రాంతానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంత్రి మల్లాడి కృష్ణారావు కి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## వైద్య విద్యార్థినిపై జరిగిన దాడిని ఖండించిన ఎంపీ పురందేశ్వరి

### నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి



**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 6( ప్రభాతవార్త)** రాజమహేంద్రవరంలో వైద్య విద్యార్థిని ప్రియాంకపై జరిగిన దాడి గో రక్షణ పేట హత్య ఘటనలపై ఎంపీ పురందేశ్వరి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరం జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థిని డాక్టర్ ప్రియాంక(28) పై కొందరు యువకులు ఉద్దేశ పూర్వకంగా కారుతో ఢీ కొట్టిన ఘటన అత్యంత దారుణమని ఈ దాడిని తీవ్రంగా ఖండించినట్లు తెలిపారు. ప్రస్తుతం పార్లమెంటు సమావేశంలో పాల్గొంటున్న ఆమె ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి పరిస్థితి అత్యంత విషమంగా మారి వైద్యులు బ్రెయిన్డెడ్ గా ప్రకటించాల్సిన రావడం ఎంతో కలిసివేసిందని పేర్కొన్నారు. మంచి భవిష్యత్తు ఉన్న యువ వైద్య విద్యార్థినిపై ఇంత అమానుషంగా ప్రవర్తించడం సమాజానికి మచ్చని బాధ్యత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ప్రభుత్వం తరఫున పూర్తిస్థాయిలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనలో నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుని వారికి తగిన శిక్ష విధించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గోరక్షణ పేటలో జరిగిన బుజ్జిబాబు హత్యను కూడా ఆమె ఖండించారు. ఈ ఘటనలలో సంబంధిత నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు.

## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి..

### విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలి

### అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి





**రావులపాలెం, ఆగస్ట్ 06 (ప్రభాతవార్త) :** డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపించి, నిజానిజాలు వెలికితీయాలని అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ పరీక్ష రాయని వారికి ఉద్యోగాలు కల్పించారనే ఆరోపణలు, ప్రశ్నపత్రాల రూపకల్పనకు సంబంధించిన విభాగంలో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగికి రాష్ట్ర స్థాయి ర్యాంకు రావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటా కేటాయింపుల్లోనూ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. అలాగే 421 ఉద్యోగాలను అధికార పార్టీ కార్యకర్తలకు కట్టబెట్టేలా వ్యవహరించారంటూ విమర్శించారు. విద్యావ్యవస్థలో ఇప్పటికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల పంపిణీ పూర్తిస్థాయిలో జరగలేదని, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలు కూడా సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు భారీగా పేరుకుపోయాయని, ప్రభుత్వ పాఠశాలల నుంచి లక్షలాది మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. స్కూల్ బ్యాగులు, పాఠ్యపుస్తకాల నాణ్యతపైనా నిజాలు నిగ్గుతేల్చాలని తెలిపారు.

**సీబీఐ విచారణ జరిపించాలి**

డీఎస్సీ వ్యవహారంపై ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం స్పందించకపోతే యువతతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 2029 ఎన్నికల్లో యువతే తగిన సమాధానం చెబుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, కర్రి నాగిరెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## పటవల పంచాయతీ ప్రజల సమస్యలు పరిష్కరించాలి.



**తాళ్లరేవు ఆగస్టు 6 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పటవల గ్రామ పంచాయతీలో దళిత పేటలలో ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘం వ్యతిరేక పోరాట సంఘం నిర్వహించిన సర్వేలో వచ్చిన సమస్యలపై గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ వి జె వి రమణ, పంచాయతీ డెవలప్మెంట్ ఆఫీసర్ పి. రామరాజు ఆ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, గ్రామ పెద్దలు సమస్యలు వివరిస్తూ గ్రామంలో దళితుల స్మశాన భూమి సుమారు 8 ఎకరాలలో కొంత భూమి ఆక్రమణ గురైందని దానిని సర్వే చేయించి హద్దులు నిర్వహించి గ్రామస్తులకు అప్పగించాలని కోరారు. గ్రామంలో గతంలో వేసిన సీసీ రోడ్స్ కు, సిసి డ్రైన్లు నిర్మించాలని ,వీధిలైట్లు, పారిశుద్ధ్య పనులు గ్రామంలో వెంటనే చేపట్టాలని పరిశుభ్రమైన త్రాగునీరును సంపూర్ణంగా అందించాలన్నారు.గ్రామంలో ఉన్నటువంటి బెల్ట్ షాపులు ఎత్తివేయాలని కోరారు. వీటిపై ప్రత్యేక అధికారి రమణ స్పందిస్తూ ఒక వారం రోజులలో ప్రయారిటీ ప్రకారం వీధిలైట్లు పనులు చేయిస్తామని మంచినీరు విషయమై ఆర్డబ్ల్యూఎస్ అధికారులతో కలసి కృషి చేస్తామన్నారు. మరి ముఖ్యంగా గ్రామంలో 8 ఎకరాలు స్మశాన భూమి రికార్డుల్లో నమోదయి ఉన్నదని దీనిని రెవిన్యూ ఉన్నత అధికారులు హద్దులు చూపించి గ్రామపంచాయతీకి అప్పగిస్తే ఆ భూమిని పరిరక్షించే బాధ్యత గ్రామపంచాయతీ తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సంఘం నాయకులు గోడి భాస్కరరావు, నేల లక్ష్మణరావు, పోతుల అప్పారావు, మురముళ్ళ సత్తిబాబు, పులప కూర గోపాలకృష్ణ, నేల పండు, దడాల వంశి తదితరులు పాల్గొన్నారు.

## పిఠాపురం బ్రాంచ్ కెనాల్ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేశీధిర ప్రసాద్



**పిఠాపురం, ఆగస్టు 6 ( ప్రభాతవార్త )** పిఠాపురం బ్రాంచ్ కెనాల్ కింద ఉన్న ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీటిని పుష్కలంగా అందించేలా కాలువ అభివృద్ధి పనులను సరవేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేశీధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అత్యంత నాణ్యత ప్రమాణాలతో కాలువ పనులను పూర్తి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం జలవనరుల శాఖ అధికారులతో కలిసి పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా గొల్లప్రోలు కొత్త కళింగలు,బల్లకట్టు,నల్లగొండ,గాలికొండ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల తోపాటు, రాజారావు బహుదూర్ చెరువు పనులను, చెరువు మిగులు జలాల నిర్వహణను పరిశీలించారు. 12వ స్లూయిస్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు, కాండ్రకోట– పిఠాపురం కాలువ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు సాగునీటి కొరత తలెత్తకుండా ప్రతిపాదనల ప్రకారం పనులను నిర్దేశిత కాలపరిమితిలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యత లోపించకుండా ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ధవలేశ్వరం సర్కిల్ ఎస్. ఈ, శ్రీనివాస్, గోదావరి డెల్టా ఛైర్మెన్ సునీల్ కుమార్, జలవనరుల శాఖ ఈఈ శేషగిరిరావు,డివిజనల్ ఇంజనీర్లు,సంతోష్ కుమార్, రవికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## పిఠాపురంలో “ పోలీసుల పల్లెనిద్ర “



**పిఠాపురం, ఆగస్టు 6( ప్రభాతవార్త )** పిఠాపురం పట్టణ పరిధిలోని అగ్రహారంలో గురువారం రాత్రి పిఠాపురం సీఐ శ్రీనివాస్, “ పల్లెనిద్ర “కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ “ నో డ్రగ్స్ బ్రో “ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల వినియోగం యువత జీవితాలను నాశనం చేస్తుందని, ఎవరైనా విక్రయం లేదా, వినియోగానికి పాల్పడితే పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు. “ మద్యం నాకు బానిస కాకూడదు “ అనే సందేశం తో మద్యపాన వ్యసన కుటుంబాలు, ఆరోగ్యం, తోపాటు సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు, అలాగే మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతి భద్రతలు కాపాడాలని, రాజకీయ విభేదాల విభేదాల పేరుతో ఎటువంటి గొడవలు, దాడులు, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే బైండోవర్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని తెలియజేశారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు, మాదక ద్రవ్యాల వ్యాపారం, జూదం, అక్రమ మద్యం విక్రయం, ఇతర నేర కార్యకలాపాలను గమనించిన తక్షణం పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు. యువత విద్య, ఉపాధి పై దృష్టి పెట్టి మంచి పౌరులుగా ఎదగాలని గ్రామంలో శాంతి, సామరస్యం, సోదర భావం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు సిఐ శ్రీనివాసుకు సమస్యలు వివరించగా వాటిని పరిష్కరించేందుకు పోలీస్ శాఖ నుండి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిఠాపురం ఎస్సై మణికుమార్, ప్రజలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్త టీ. డి. పి. పార్టీ బలోపేతం కోసం పని చేయాలి

### చింతూరు మండలం టీడీపీ ఎస్టీ సెల్.



**చింతూరు ఆగస్టు 6 ప్రభాత వార్త.** ప్రతి కార్యకర్త టీ. డి. పి. పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని చింతూరు టీ. డి. పి. ఎస్. టీ. సెల్ తీర్మానం చేసింది. గురువారం చట్టి గ్రామములో సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించింది. ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు తూరం ముత్తయ్య, మండల కార్యదర్శి కరణం లక్ష్మణ్ లు మాట్లాడుతూ పార్టీ బలోపేతం, ఎస్టీ సెల్‌ను గ్రామ స్థాయిలో మరింత విస్తరించడం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, అలాగే రాబోయే పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడం, పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎస్టీ సెల్ ఆర్గనైజర్ సునం సుమన్, సావిత్రి, జోగారావు, మాజీ ఎంపీటీసీ సుశీల, ఐటీడీపీ నాయకుడు వినోద్, మనోజ్, రాంశెట్టి తదితరులతో పాటు టీడీపీ గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆగస్టు 9న ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమానికి ఎస్టీ సెల్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గిరిజన ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

## డీఎస్సీ ‘లీకేజీ’పై సీబీఐ విచారణ జరపాల్సిందే..

### విద్యాశాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి



**రామచంద్రపురం, ఆగస్టు 6 (ప్రభాతవార్త):** డీఎస్సీ--2025 పరీక్షల నిర్వహణలో జరిగినట్లు ఆరోపిస్తున్న ప్రశ్నాపత్రాల లీకేజీలు,అక్రమాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో నిష్పాక్షిక విచారణ జరిపించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని వైకాపా నేతలు డిమాండ్ చేశారు.పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రామచంద్రపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో గురువారం కాజులూరు మండల వైకాపా నాయకులు,కార్యకర్తలు పట్టణంలో మున్సిపాలిటీ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్ష నిర్వహించారు.ప్రభుత్వం తీరుపై వైకాపా నేతలు తీవ్ర విమర్శలు చేశారు.ఈ సందర్భంగా పిల్లి సూర్యప్రకాష్ మాట్లాడుతూ డీఎస్సీ పరీక్షల్లో జరిగినట్లు వస్తున్న అవకతవకలతో లక్షలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆయన పేర్కొన్నారు.సీబీఐ దర్యాప్తు ద్వారానే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని,విద్యాకు హామీలను అమలు చేయాలని సూర్య ప్రకాష్ డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని,అవసరమైతే సచివాలయాలను ముట్టడిస్తామని వైకాపా నేతలు హెచ్చరించారు.ఈ దీక్షల్లో పార్టీ ప్రజాప్రతినిధులు,అనుబంధ విభాగాల నాయకులు,యువజన,విద్యార్థి,మహిళా విభాగాల ప్రతినిధులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వరి సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులే మేలు



**శంఖవరం ఆగస్టు 6 ప్రభాతవార్త** వరి సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించి రైతులకు మేలు కలుగుతుందని వ్యవసాయాధికారి పి గాంధీ పేర్కొన్నారు. మండల కేంద్రం శంఖవరంలో వరిసాగులో ప్రకృతి వ్యవసాయ విధానంలో వివిధ వనరుల వినియోగం ద్వారా దిగుబడి అంచనా కొరకు ప్రయోగం ఏఓ గాంధీ ఆధ్వర్యంలో నిర్వహించారు. దేశీయ రకమైన కుజె పటాలిలో 15 సెంట్లలో మూడు ట్రీట్మెంట్లలో భాగంగా మొదటిది 20 కిలోల ఘన జీవామృతం, రెండోది 5 కిలోల బయోచార్ తో 20 కిలోల ఘన జీవామృతం మరియు మూడోది 10 కిలోల బయోచార్ తో 20 కిలోల ఘన జీవామృతం వాడినపుడు ఏ ట్రీట్మెంట్ ద్వారా ఈ పంట కాలంలో నేల సారం వృద్ధి, పంట పెరుగుదల, పిలకల సంఖ్య, నేలలో తేమ, సూక్ష్మ జీవుల వృద్ధి, చీడపీడల ప్రభావం, దిగుబడి అంచనా వేయడం జరుగుతుందని వివరించారు. అనంతరం ట్రీట్మెంట్ల వారీగా నిర్దేశించిన పదార్థాలను వరి పొలంలో వాడడం జరిగినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్, వ్యవసాయ సహాయకుడు క్రాంతి, ప్రకృతి వ్యవసాయ ఎంటి రామరాజు, జగదాంబ, సిబ్బంది, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## వరుస బైక్ దొంగతనాలు బి బాధితులకు న్యాయం ఎప్పుడు?

### కృష్ణునిపాలెంలో రాత్రికి రాత్రే బైక్ మాయం - వరుస బైక్ చోరీలతో ప్రజల్లో ఆందోళన

### పోలీసుల గస్తీ పెంచాలని బాధితులు డిమాండ్




**గోకవరంఆగష్టు 6 ప్రభాతవార్త** గోకవరం మండలం కృష్ణునిపాలెం గ్రామంలోని కుమ్మరపేటలో భరణి కొట్టు ఎదురుగా గురువారం అర్ధరాత్రి ఓ మోటార్‌సైకిల్ దొంగతనానికి గురైంది. దీంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ఇటీవలి కాలంలో గోకవరం మండలంలోని పలు ప్రాంతాల్లో బైక్ దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయని బాధితులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా జరుగుతున్న ఈ ఘటనల నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి, రాత్రి వేళల్లో గస్తీని మరింత కట్టుదిట్టం చేయాలని వారు కోరుతున్నారు. దొంగలను గుర్తించి, చోరీకి గురైన వాహనాలను స్వాధీనం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు

## నేడు పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ 157 వ జయంతి వేడుకలు..



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధిఆగస్టు 6, ప్రభాత వార్త:** కోనసీమ జిల్లా అగ్నికుల క్షత్రియ జీవో నెంబర్ 371 పోరాట యోధుడు అగ్నికుల క్షత్రియ జాతిపిత పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ 157 వ జయంతి సందర్భముగా శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ, 7 ఆగస్టు 2026 న నియోజకవర్గం సంఘాల నాయకులు కోరంగి చేరుకోవాలని పిలుపునివ్వడం జరిగినది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వివేకానంద హాలులో అధికారికంగా జరుగు ఏర్పాట్లను డిఆర్ఓ తో చర్చించడమైనది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం అధ్యక్షులు ఇల్లింగి వెంకటరమణ, అగ్నికుల క్షత్రియ రాష్ట్ర నాయకులు తిరుమణి ఆచార్య, కమిటీ సభ్యులు పాల్గొనినారు.

## రాజవొమ్మంగి మండలంలో రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యులు పర్యటన

### గర్భిణీలు ఆరోగ్యంపట్ల అవగాహన కల్పించండి..

### బి. సి. వసతి గృహ నిర్వహణ పట్ల అసంతృప్తి





**రాజవొమ్మంగి, ఆగస్టు 06 : ప్రభాతవార్త**

రాజవొమ్మంగి మండలంలో రాష్ట్ర ఫుడ్ కమిటీ సభ్యులు గంజిమాల దేవి గురువారం ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. జడ్డంగి పిహెచ్ సి ని తనిఖీ చేసి గర్భిణీల రికార్డులను పరిశీలించారు. పి. హెచ్ సి పరిధిలో గర్భిణీల హెచ్.బి శాతం బాగానే ఉందని సంతృప్తిని వ్యక్తం చేసారు. వైద్య సిబ్బంది, ఆశలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతు ప్రతీ గర్భిణీ 5, 6, 7 నెలల్లో హెచ్.బి శాతం తక్కువగా ఉంటే వారికి అవగాహన కల్పించి ఐరన్ సుక్రోజ్ ను ఎక్కించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలు ద్వారా ఇచ్చే గుడ్లు గర్భిణీలు రోజూ తినాలని తెలుపాలన్నారు. రాజవొమ్మంగి గిరిజన సంక్షేమ గురుకుల బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేసి స్టోర్ రూమ్ లో నిత్యావసర వస్తువులు భద్రతలో జాగ్రత్తలను పాటించాలని ప్రిన్సిపాల్ సత్యవేణికి సూచించారు. మెనూను ఆమె రుచి చూశారు. రాజవొమ్మంగి బి.సి బాలుర వసతి గృహంను సందర్శించారు. హాజరు శాతంపై అసంతృప్తిని వ్యక్తం చేసారు. మరుగుదొడ్లకు తలుపులు, విద్యుత్ సౌకర్యం లేవన్నారు. బిల్డింగులు బాగా లేవన్నారు. జిల్లా బి.సి వెల్ఫేర్ అధికారి, అసిస్టెంట్ బి.సి వెల్ఫేర్ ఆఫీసర్ కూడా రాజమండ్రి వారు చూస్తున్నారని వెల్ఫేర్ ఆఫీసర్ విజయ్ కుమార్ ఆమెకు వివరించారు. రాజవొమ్మంగి ఏకలవ్య ఇంగ్లీష మోడల్ పాఠశాలలో స్టోర్ రూమ్, వంటశాలను తనిఖీ చేశారు. జీలకర్ర కిలో ప్యాకెట్ కాలపరిమితి అయిందని గుర్తించారు. మిరియాల్లో కల్తీపై ప్రిన్సిపాల్ కృష్ణారావుకు అవగాహన కల్పించారు. నిత్యావసర వస్తువుల్లో నాణ్యత లేకపోతే వెంటనే త్రిప్పి పంపాలని ప్రిన్సిపాల్ కృష్ణారావుకు సూచించారు. గంగవరం గిరిజన ఆశ్రమ పాఠశాలలో 170 మంది విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం పెట్టడం లేదని, కనీస సౌకర్యాలు కూడా లేవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలికి విద్యార్థులు మొర పెట్టుకొన్నారు ఆమెతో పాటు పర్యటనలో ఉన్న డీడీ వెంటనే స్పందించి బాధ్యులపై మెమో జారీ చేసి, సంబంధిత అధికారులను డీడీ కార్యాలయంలో సరెండర్ కావాలని ఆదేశించారు. లోపాలపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. 108 వాహనం ఆమె పర్యటన లో వెంట ఉంది. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ రుక్మంగదయ్య, సివిల్ సప్లైస్ డియం రాజేశ్వరి, ఐసిడిఎస్ పిడి ఉమా, రాజమండ్రి తూనికలు కొలతలు శాఖ అధికారి ప్రశాంత్ కుమార్, ఫుడ్ ఇన్స్పెక్టర్ సాయితేజ, గురుకుల సెల్ అధికారి నాగేంద్ర, డా. పి.వి.ఎల్ నీలిమ, ఏటిడబ్ల్యూఓ కృష్ణమోహన్, శంభుడు, ఏజెన్సీ డిఈఓ మల్లేశ్వరరావు, సిడిపిఓలు క్రాంతికుమారి, సుచరిత, సివిల్ సప్లయి అధికారి అనూష, జి.సి.డి.ఓ శిరీష, సూపర్వైజర్ అరుణలత, ఎంఈఓ 2 బి. సూర్యారెడ్డి, సీఆర్పీలు శ్రీనివాస్, విష్ణువర్ధన్, డా. పావని, డా. నాగార్జున, వెంకటరమణ, నాగవాసు, ఎస్.బి హెడ్ కానిస్టేబుల్ మదన్ పాల్గొన్నారు.

## మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఆదిత్య యూనివర్సిటీ ప్రొ.ఛాన్సలర్ డా. సతీష్ రెడ్డి దంపతులు





**గండేపల్లి. ఆగస్టు 6. ప్రభాతవార్త** పెద్దాపురం పట్టణం లో వేంచేసియున్న శ్రీ మరిడమ్మ అమ్మవారి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న సంగతి విదితమే.. ఈ సందర్భంగా గురువారం ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి శ్రీమతి శృతి రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వారికి ఆలయ పరిపాలనాధికారి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వేదాశీర్వచనం,శేష వస్త్రం, ప్రసాదం అమ్మవారి చిత్రపటం, అందించి శుభాశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమానికి లక్ష రూపాయల విరాళం అందజేశారు.

### వాడపల్లి క్షేత్రంలో రెండవ రోజు ఘనంగా వరుణ యాగం

## స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణం..పాల్గొన్న అశేష భక్త జనం.

### నిత్యాన్న పథకానికి రూ.101116/-విరాళం...





**ఆత్రేయపురం, ఆగస్టు 06.(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం గురువారం వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ఏడు వారాల నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం గోపూజ పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు, రైతాంగం సుభిక్షంగా ఉండాలని సంకల్పిస్తూ నిర్వహిస్తున్న వరుణ యజ్ఞ కార్యక్రమాలు రెండవ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు నేతృత్వంలో భక్తిశ్రద్ధలతో వరుణసూక్త సహిత పారాయణం, వరుణ జపం ఘనంగా నిర్వహించారు.ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు నిర్వహణలో జరుగుతున్న ఈ వరుణ యాగ మహోత్సవం ఉదయం నుంచి వేద మంత్రోచ్చారణల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో పండితులు వరుణ దేవునికి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రకృతి అనుకూలంగా ఉండి సమయానికి వర్షాలు కురవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖశాంతులతో కలగాలని సంకల్పిస్తూ వరుణసూక్త పారాయణం చేశారు.వ ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో జరిగే అభివృద్ధి పనులను ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విజయవాడ చెందిన యక్కల వీరేంద్ర సాయి మణికంఠ, శ్రీ సుప్రజ దంపతులు, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 101116/- విరాళంగా అందించారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు లు శ్రీ స్వామివారి చిత్రపటం ,ప్రసాదాలను అందజేశారు.

## డీఎస్సీ పేరుతో వైసీపీ దీక్షలు సిగ్గుచేటు

### ఇంటింటికి తెలుగుదేశం’ కార్యక్రమంలో పిల్లి అనంతలక్ష్మి దంపతులు



**కాకినాడ రూరల్, ఆగస్ట్ 6 (ప్రభాత వార్త):** అధికారంలో ఉన్నప్పుడు నిరుద్యోగ యువతకు డీఎస్సీ నోటిఫికేషన్లు సక్రమంగా ఇవ్వలేకపోయిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేడు డీఎస్సీ పేరుతో దీక్షలు చేయడం సిగ్గుచేటని కాకినాడ రూరల్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పిల్లి అనంతలక్ష్మి దంపతులు ఘాటుగా విమర్శించారు.రాజకీయ అవకాశవాదానికి నిదర్శనమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారాన్ని పక్కనబెట్టి రాజకీయ దీక్షల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం వైసీపీకి అలవాటుగా మారిందని మండిపడ్డారు.ఇంద్రపాలెంలో నిర్వహించిన ‘ఇంటింటికి తెలుగుదేశం’ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించిన పిల్లి సత్యనారాయణ మూర్తి, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుండి “విద్య, ఉపాధి రంగాలకు ప్రాధాన్యత ఇస్తు ప్రభుత్వం బాధ్యతాయుతంగా పనిచేస్తుంటే, మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేయడం వైసిపి రాజకీయ దివాలాకోరుతనమే అన్నారు. ప్రజల ప్రజా సమస్యలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే ప్రజల్లోకి వెళ్లి వారి కష్టాలు తెలుసుకోవాలని, రాజకీయ ప్రయోజనాల కోసం దీక్షలు చేయడం వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, ఏఎంసీ చైర్మన్ మాసుమేను మంగ గంగయ్య, క్లస్టర్ కన్వీనర్లు కర్రి వెంకటరాజు, సరిదే నాగహరినాథ్, ప్రకాష్, మద్దూరి స్వామి, ఇంద్రపాలెం గ్రామ కమిటీ అధ్యక్షురాలు పిల్లి రమణమ్మ స్థానిక కూటమి నాయకులు, టీడీపీ కార్యకర్తలు, మహిళలు, యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రభాత వార్త

## న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను

విస్తృతమైన వార్తా సేకరణ యంత్రాంగం ఉన్న వార్త న్యూస్ నెటవర్క్‌ను మరింత పటిష్ఠవంతంగా చేయాలనుకుంటోంది. పాఠకులకు మరింత తాజా వార్తలను అందించేందుకు తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో విలేకరుల యంత్రాంగాన్ని విస్తృతపరచాలని నిర్ణయించింది. ఆసక్తి గల వారికి న్యూస్ కంట్రిబ్యూటర్లయ్యే సదవకాశం కల్పిస్తోంది.”

**అభ్యర్థులకు కావలసిన అర్హతలు**

- 35 ఏళ్ళ లోపు వయస్సు
- స్థానికంగా నివాసం
- ఇంటర్, డిగ్రీ
- ప్రజల జీవన స్థితిగతులపై అవగాహన

**న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలసిన కేంద్రాలు**

రాజానగరం, రంగంపేట, రాయవరం, మండపేట, కోరుకొండ, కొవ్వూరు, నిడదవోలు, తాళ్ళపూడి, ఉండ్రాజవరం, నల్లజర్ల, రాజమహేంద్రవరం

ఇంటర్వ్యూలకు ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటాతో సంప్రదించగలరు.

‘వార్త’ యూనిట్ కేంద్రం, రాజమహేంద్రవరం

వివరములకు: 9666685998, 8096661682

నెంబర్లను సంప్రదించగలరు

## బ్రహ్మకుమారి సంస్థ చేస్తున్న కృషి అభినందనీయం ప్రభుత్వ విప్ దాట్ల



ముమ్మిడివరం ఆగస్టు 6 (ప్రభుత్వ వార్త ) భారత్ అభివృద్ధి దిశగా దేశాన్ని తీసుకువెళ్లడానికి ప్రధాని మోదీ చేస్తున్న కృషికి వ్యసన ముక్త భారత్ అభియాన్ ఎంతో దోహదం చేస్తుంది అని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. బ్రహ్మకుమారీ సంస్థ నేటి నుండి పదిహేను రోజులు పాటు నిర్వహిస్తున్న వ్యసన విముక్తి ప్రతిజ్ఞల కార్యక్రమాన్ని ముమ్మిడివరం సంస్థ భవనంలో ఎమ్మెల్యే బుచ్చిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ వైద్యులు, నాయకులు, పోలీసులు, విద్యార్థులు, బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు. ఈ సందర్భంగా విప్ సుబ్బరాజు మాట్లాడుతూ ప్రధాని మోదీ బ్రహ్మకుమారీ సంస్థ సహకారంతో పదికోట్ల మందిచే వ్యసనాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించాలని పూనుకోవడం సమాజహితం కోసం బ్రహ్మకుమారీ సంస్థ చేస్తున్న కృషికి అభినందనీయమని పేర్కొన్నారు. వ్యసనాలకు బానిసలై అనేక మంది జీవితాలు, కుటుంబాలు చిన్నా భిన్న మవుతున్నాయని, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ ప్రచారంతో ఎంతో కొంత మార్పు తీసుకువస్తే జీవితాలలోనైనా మార్పు తీసుకురాగలమని విప్ సుబ్బరాజు తెలిపారు. జీవనపోరాటంలో ఎదురౌతున్న ఒత్తిడిలను తట్టుకునేందుకు చాలా మంది వ్యసనాలకు భానిసలవు తున్నారని ఆ ఒత్తిడి తట్టుకునేందుకు ప్రజలను మెడిటేషన్, యోగాలవైపు మళ్లించగలిగితే వ్యసనాలవైపు వెళ్లే అవకాశం ఉండదన్నారు. ఆగస్టు ఆరు నుండి ఇరువై వరకు పదిహేను రోజులు పాటు నిర్వహిస్తున్న ఈ ప్రచార, ప్రతిజ్ఞ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ, ముఖ్యంగా విద్యార్థులు పాల్గొని సమాజంలో మార్పుకు కృషి చెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ సి కార్పొరేషన్ డైరెక్టర్ చెల్లి అశోక్ తెలుగుదేశం పార్టీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉపాధ్యక్షులు తాడి నరసింహారావు ములపర్తి బాలకృష్ణ ముమ్మిడివరం సిఐ ఎం మోహన్ కుమార్ మాధవి డాక్టర్ తనుజ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## నవజాత శిశువు ఆరోగ్యానికి శ్రీరామ రక్ష

### తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా





(కాట్రేనికోన ఆగస్టు 06(ప్రభాతవార్త) అద్భుతమైన పోషక విలువలు ఉన్న తల్లి ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా వంటిదని ముమ్మిడివరం మహిళ శిశు సంక్షేమ శాఖ సిడిపిఒ మదుసూరి నిహారిక హితవు పలికారు. నవజాత శిశువు ఆరోగ్యవంతమైన జీవితానికి తల్లి ముర్రుపాలు శ్రేష్టమైనవని వైద్యులు తెలుపు తున్నారు. తల్లి ముర్రుపాలలో అద్భుతమైన పోషక విలువలు ఉన్నాయన్నారు. బిడ్డ ఆరోగ్యవంతంగా ఎదుగుదలకు, ఆయుస్సు పెంచేందుకు తల్లి ముర్రుపాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు ముమ్మిడివరం కేంద్రంగా ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం మండలాలలో 10 సెక్టార్లు పరిధిలో 252 అంగన్ వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. అంగన్ వాడీ కేంద్రాలలో చిన్నారులకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుంది. అంగన్ వాడీ కేంద్రాల పరిధిలో చిన్నారులకు, కౌమార బాలికలకు, గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారంను అందజేస్తున్నారు. రోగ నిరోధక శక్తి కలిగి నవజాత శిశు వు పెరుగుదలకు కీలయ పాత్ర పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

## ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్ 'పెయ్యల శ్రీదేవి'కు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ



గండేపల్లి. ఆగస్టు 6. ప్రభాతవార్త గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న"పెయ్యల శ్రీదేవి" ఆంధ్రా యూనివర్శిటీ విశాఖపట్నం నుండి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీ విశాఖపట్నం కి చెందిన ప్రొఫెసర్ ఎన్.కిషోర్ బాబు నేతృత్వంలో శ్రీదేవి సమర్పించిన "థీసిస్ శీర్షిక: " ఇంపాక్ట్ ఆఫ్ స్ట్రాటజిక్ హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్మెంట్ ప్రాక్టీసెస్ ఆన్ ఆర్గనైజేషన్ ఎఫక్ టీవ్నెస్" అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. "డా." పెయ్యల శ్రీదేవి" భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య అధినేత, యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి, శుభాకాంక్షలు తెలిపారు. డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ . డా.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్. ప్రో. ఎం.బి. శ్రీనివాస్. ప్రో. వైస్ ఛాన్సలర్. డా. ఎస్. రమశ్రీ, డా. ఆదిరెడ్డి రమేష్, డా. రవి తంగజన్, రిజిస్ట్రార్ డా జి.సురేష్, మరియు వివిధ విభాగాల విభాగాధిపతులు ఉపాధ్యాయ సిబ్బంది డా.పెయ్యల శ్రీదేవి కు అభినందనలు తెలియజేశారు.

## అనుమతి ఉన్న లేఅవుట్ లోనే భవన నిర్మాణాలు చేపట్టాలి



రాజమహేంద్రవరం సిటీ ,ఆగస్టు 6 (ప్రభాతవార్త) అనుమతి పొందిన లే అవుట్ లోనే భవన నిర్మాణాలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా స్పష్టం చేశారు. గురువారం టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఆయన పర్యటించారు. ఏవి రోడ్, జే ఎన్ రోడ్ ,దానవాయిపేట లో భవన నిర్మాణాల అనుమతికి దరఖాస్తు చేసుకున్న పలు లేఔట్లను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు అర్బన్ లో బహుళ అంతస్తు భవన నిర్మాణాలు ప్రణాళిక బద్ధంగా జరగాలని సూచించారు. ప్లాన్ అప్రూవల్ లేకుండా ఎక్కడ నిర్మాణాలు జరగకూడదన్నారు ముఖ్యంగా రోడ్లు ,కాలువలు నీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాతే లేఔట్లలో నిర్మాణాలు జరగాలన్నారు. నిబంధనలు మీరితే చర్యలు తీసుకుంటామని ఆమోదిత ప్లాన్ అన్ని భద్రత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టాలని అప్పుడే నివాసయోగ్య ధ్రువీకరణ పత్రం జారీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట సిటీ ప్లానర్ జీవి ఎస్ ఎన్ మూర్తి ఏసిపి కొండలరావు ఇతర సిబ్బంది ఉన్నారు.

## తల్లి పాలు శిశువుకు మొదటి ఆహారం



యు.కొత్తపల్లి, ఆగస్టు 6 (ప్రభాతవార్త) : తల్లిపాలు శిశువుకు అన్ని ముఖ్యమైన పోషకాలను కలిగి ఉన్న ఉత్తమమైన మొదటి ఆహారమని సీడీపీఓ శ్రీకర, నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రిదా అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గురువారం మండలంలోని నాగులపల్లిలో తల్లి పాల విశిష్టతపై 148 అంగన్వాడీ సెంటర్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలు చిన్న పిల్లలకు వివిధ రకాల వ్యాధుల నుండి రక్షిస్తుందని తాజాగా, శుభ్రంగా, సరైన ఉష్ణోగ్రతతో ఉంటాయని సులభంగా జీర్ణం అవుతాయన్నారు. శిశువు ఆహారవు అవసరాలకు, పెరుగుదలకు అనుగుణంగా ఉండడంతో పాటు కొన్ని అనారోగ్యాల నుండి రక్షణను ఇస్తుందన్నారు. బిడ్డకు తల్లి పాల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్ సారమ్మ, పలువురు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎంపెడా ఆక్వా ట్రేస్ స్పాట్ నమోదు శిబిరం...



సఖినేటిపల్లి ఆగస్టు 6, ప్రభాత వార్త: అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం గొంది గ్రామంలో ఎంపెడా ఆక్వా ట్రేస్ స్పాట్ నమోదు శిబిరం 150 మందికి పైగా రొయ్యల రైతుల పాల్గొనడం, 50కి పైగా ఫామ్‌లకు తక్షణ నమోదు రొయ్యల సాగులో డిజిటల్ ట్రేసబిలిటీ, ఎగుమతి ప్రమాణాలు ప్రోత్సహించే లక్ష్యంతో ఆక్వా సాథి ఫౌండేషన్, మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ ఎంపేడా వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం సహకారంతో గొంది గ్రామ సచివాలయం లో ఎంపెడ ఆక్వా ట్రేస్ స్పాట్ ఎన్‌రోల్‌మెంట్ క్యాంప్ను విజయవంతంగా నిర్వహించినారు. ఈ శిబిరానికి 150 మందికి పైగా ఆక్వాకల్చర్ రైతులు హాజరై, 50కి పైగా ఫామ్‌లను అక్కడికక్కడే ఎంపెడ ఆక్వా ట్రేస్లో విజయవంతంగా నమోదు చేయించుకున్నారు. మరికొన్ని దరఖాస్తు లను పరిశీలించి నమోదు ప్రక్రియలోకి తీసుకువచ్చారు. శిబిరంలో రైతులకు ఆక్వా ట్రేస్ డిజిటల్ నమోదు విధానం, అవసరమైన పత్రాలు, ట్రేసబిలిటీ ప్రాముఖ్యత, ఎగుమతి మార్కెట్లలో డిజిటల్ రికార్డుల అవసరం తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించడంతో పాటు, వారి సందేహాలను అక్కడికక్కడే నివృత్తి చేసి నమోదు ప్రక్రియను సులభతరం చేశారు. ఆక్వా సాథి ఫౌండేషన్ వ్యవస్థాపకులు చైర్మన్ ఎన్.ఆర్. ఉమేష్, ప్రాజెక్ట్ మేనేజర్ ఎ.ఈ. వరప్రసాద్, సిబ్బంది, ఎంపేడా డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్ నాయక్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ ఆనందరావు, నూకేష్ పాల్గొని, రైతులతో ప్రత్యక్షంగా మమేకమై నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న స్పాట్ ఎన్‌రోల్‌మెంట్ శిబిరాలు రైతుల సమయం, ప్రయాణ ఖర్చులను గణనీయంగా తగ్గించడంతో పాటు, ప్రభుత్వ సేవలను రైతుల వద్దకే తీసుకెళ్తున్నాయని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా మరింత మంది చిన్న, మధ్య తరహా రొయ్యల రైతులను ఆక్వా ట్రేస్ పరిధిలోకి తీసుకువచ్చి, డిజిటల్ ట్రేసబిలిటీ, అంతర్జాతీయ మార్కెట్ అవసరాలకు అనుగుణమైన ఉత్పత్తి వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు తమ గ్రామంలోనే నమోదు సేవలు అందుబాటు లోకి తీసుకు రావడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఆక్వా సాథి ఫౌండేషన్, ఎంపేడా అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి గ్రామ స్థాయి సేవలను మరిన్ని ప్రాంతాలకు విస్తరించాలని వారు కోరారు.

## లో వోల్టేజీ సమస్యను పరిష్కరించాలి..

### రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు బలరామమూర్తి..



అంబాజీపేట,ఆగస్టు 6, (ప్రభాతవార్త ): డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని పలు గ్రామాల్లో ఎదురవుతున్న విద్యుత్ లో వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సభ్యులు,కోకో ఫెడ్ చైర్మన్ అరిగెల బలరామ్మూర్తి కోరారు. విశాఖపట్నంలోని ఈపీడిసిఎల్ సిఎండి కార్యాలయంలో డైరెక్టర్ ప్రాజెక్ట్ సూర్య ప్రకాష్ ను కలిసి సమస్యలను వివరించారు. విద్యుత్ లో వాల్టేజీ సమస్యతో పాటు లైన్ స్టాఫ్ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యుత్ సరఫరా విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరిస్తూ వినతి పత్రం సమర్పించారు.విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డైరెక్టర్ సూర్య ప్రకాష్ హామీ ఇచ్చారని బలరామమూర్తి తెలిపారు.

## క్రీమ్ సంస్థ ఆధ్వర్యంలో...

## 10 న ఉచిత కంటి వైద్య శిబిరం

తాళ్లరేవు, ఆగస్టు 5( ప్రభాతవార్త): ఈనెల 10వ తేదీన తాళ్లరేవులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్రీమ్ సేవా సంస్థ డైరెక్టర్ దొమ్మేటి వసంతరావు, జడ్పిటిసి సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక హై స్కూల్ పక్కన ఉన్న బాప్టిస్ట్ చర్చిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు ఈ శిబిరం ఉంటుందన్నారు. ఈ శిబిరంలో పిఠాపురం సిఎంసి కంటి వైద్య నిపుణులు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్ళజోళ్ళు అందజేస్తారన్నారు. ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి ఆపరేషన్లు చేయించడం జరుగుతుందన్నారు. దీంతోపాటు ఉచిత జనరల్ సర్జరీ, ఆర్థోపెటిక్ ఓపీలలో పరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఘనంగా తల్లిపాలు వారోత్సవాలు...



ఆత్రేయపురం, ఆగస్టు,06,(ప్రభాత వార్త) శిశువులకు తల్లిపాలివ్వడం వల్ల కలిగే లాభాలపై మండలంలోని లొల్ల అంగన్‌వాడీ కేంద్రం నందు గురువారం సూపర్వైజర్ కె. పద్మశ్రీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.ఆగస్టు 1నుండి 7తేదీ వరకు జరిగే తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. పిల్లల్లో విద్య, ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే గర్భిణీలు, బాలింతలు ప్రభుత్వ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పిల్లలకు పోషకాహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నాగలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ సుజాత, ఆశా వర్కర్ అరుణతో పాటు గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

## తొమ్మిది నెలలుగా జీతాలు లేని ఆర్డబ్ల్యూఎస్ కార్మికులు



ముమ్మిడివరం. ఆగస్టు 6 (ప్రభాతవార్త ) పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే ఈ నెల పదహారు నుండి విదులు బహిష్కరించి ఆందోళన బాట పడతామని స్పష్టం చేశారు. ఆర్. డబ్ల్యు. ఎస్. మరియి సి. పి. డబ్ల్యు.ఎస్..స్కీమ్ లలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు ముమ్మిడివరం ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు ను కలసి వినతిపత్రం అందించారు. గత తొమ్మిది నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, ఉద్యోగాలు ఇచ్చిన కాంట్రాక్టు సంస్థ నిర్వాకంతో కుటుంబ పోషన భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేసిన కార్మికులు. వీరి బాధను విన్న ముమ్మిడివరం శాసనసభ్యులు ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు వెంటనేఆర్. డబ్ల్యు. ఎస్. అదికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి జీతాలు సక్రమంగా సకాలంలో అందేలా సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం కందికుప్ప నడవపల్లి మురమళ్ళ గుత్తిన దీవి ప్రాజెక్టులలో పని చేసే కార్మికులతో పాటు నాయకులు బీర వెంకటేశ్వరరావు దొమ్మేటి సూర్య భగవాన్ దేవరపల్లి ప్రకాష్ గుర్రాల అశోక్ లతోపాటు పలువురు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీ శివ కుమారికి మాజీ మంత్రులు పరామర్శ.



రౌతులపూడి, ఆగస్టు 6,(ప్రభాత వార్త) మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివ కుమారిని మాజీ మంత్రులు గురువారం పరామర్శించారు. ఇటీవల కాలంలో లక్ష్మి శివ కుమారి భర్త అంగూరి బాలకృష్ణ అనారోగ్యంతో మరణించారు. ఆయన సొంత గ్రామమైన ఏ,మల్లవరంలో మాజీ మంత్రి కురసాల కన్నబాబు, తోట నరసింహం తదితర ప్రముఖులు మాజీ ఎమ్మెల్సీ లక్ష్మీ శివ కుమారిని పరామర్శించి, బాలకృష్ణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు, ప్రస్తుతం లక్ష్మీ శివ కుమారి రాష్ట్ర అంగన్వాడీ విభాగ వైసీపీ అధ్యక్షురాలుగా ఉన్నారు. మాజీ మంత్రులు మాట్లాడుతూ పార్టీ ఆమెకు అన్నివిధాల అండగా ఉంటుందని ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



మామిడికుదురు.ఆగస్టు 06(ప్రభాతవార్త) పి.గన్నవరం నియోజకవర్గం పాశర్లపూడి గ్రామంలో కూటమి నాయకులు 17 మంది లబ్ధిదారులకు సుమారు రూ.60లక్షల విలువ చేసే చెక్కులను గురువారం అందజేశారు.ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఈ చెక్కులు లబ్ధిదారులకు అందించడం జరిగిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ సభ్యులు జాలెం శ్రీనివాసరాజా,టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు బోనం బాబు,మాజీ సర్పంచ్ల సమాఖ్య అధ్యక్షులు అడబాల తాతకాపు,సొసైటీ అధ్యక్షులు మంద గాంధీ,పినిశెట్టి శేఖర్,తెలగారెడ్డి యేసు,చుట్టుగుల్ల కిషోర్,కొల్లు ఏడుకొండలు,బొక్కా త్రిమూర్తులు,మల్లాడి విష్ణు,కంకిపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## జక్కంపూడి సేవలు మరువలేనివి..పాముల



మామిడికుదురు.ఆగస్టు 06(ప్రభాతవార్త) మాజీ మంత్రి స్వర్గీయ జక్కంపూడి రామ్మోహనరావు సేవలు మరువలేనివని రాజోలు నియోజకవర్గం వైఎస్ఆర్ సీపీ కో-ఆర్డినేటర్ పాముల రాజేశ్వరీదేవి పేర్కొన్నారు.ఆయన 73 వ.జయంతి సందర్భంగా గురువారం స్థానిక బస్ స్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన జక్కంపూడి చిత్రపటానికి పార్టీ శ్రేణులతో కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.జక్కంపూడి పేద ప్రజలు, కార్మికుల కోసం చేసిన పోరాటాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు.కార్యక్రమంలో వైసీపీ నాయకులు కొమ్ముల రాము, కటకంశెట్టి ఆదిత్య,తోరం భాస్కర్,జక్కంపూడి వాసు,మొల్లేటి త్రిమూర్తులు, కాండ్రేగుల బాబి,నెల్లి దుర్గా ప్రసాద్, గెద్దం వెంకటేశ్వరరావు, కొల్లాబత్తుల మున్నా, కంచి శ్రీరామ్,జోగి రామకృష్ణ,కడలి శ్రీను,ఎండివై షరీఫ్,నయినాల కన్న,కుసుమ శ్రీనివాస్,మట్టపర్తి శివ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలి...

### మండల వ్యవసాయ అధికారి జె.వి. పట్టాభిరామయ్య..



ఆత్రేయపురం, ఆగస్టు 06,(ప్రభాత వార్త) ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటు లభిస్తుందని మండల వ్యవసాయ అధికారి జె.వి. పట్టాభిరామయ్య పేర్కొన్నారు.మండలంలోని వెలిచేరు గ్రామంలో గురువారం ఆత్మ (ఎటిఎంఎ) సౌజన్యంతో కొత్తపేట ఆత్మ బ్లాక్ చైర్మన్ జక్కంపూడి బాలాజీ, మండల వ్యవసాయ అధికారి జె.వి. పట్టాభిరామయ్య, వెలిచేరు సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి సత్యనారాయణలు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో రైతులకు పూర్తి రాయితీపై డ్రమ్ముల పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయ విధానాలను విస్తృతంగా అమలు చేయడానికి అవసరమైన జీవామృతం, ఘన జీవామృతం వంటి సేంద్రియ ద్రావణాల తయారీలో ఈ డ్రమ్ములు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మొత్తం 13 మంది రైతులకు పూర్తి రాయితీతో డ్రమ్ములను అందజేశారు.రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా నేల సారాన్ని పెంపొందించుకోవడంతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవచ్చని వ్యవసాయ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీల్ నాయకులు మిద్దె గోపాలకృష్ణ, హార్టికల్చర్ అసిస్టెంట్ రేణుక, విజయ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్వేది బీచ్లో స్వామివారి భారీ విగ్రహం....

### ఎమ్మెల్యే దేవ..



సఖినేటిపల్లి ఆగస్టు 6, ప్రభాత వార్త: డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవాలయ అభివృద్ధికి చేపట్టాల్సిన పలు కీలక ప్రతిపాదనలపై అధికారులతో విస్తృతంగా చర్చించి, టీటీడీ ఆధ్వర్యంలో కళ్యాణ మండపం, గుర్రాలక్క గుడి పునర్నిర్మాణం, కొత్త రథశాల నిర్మాణం, పశు సంరక్షణశాల ఏర్పాటు, కోనేరు నిర్మాణం, నీల కంటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణంతో పాటు సముద్ర స్నానాల రేవులో శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి భారీ విగ్రహ నిర్మాణానికి అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అంతర్వేది క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక పరంగా రాష్ట్రంలోనే ఒక విశిష్ట పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

## నవ కంద్రవాడలో 'ఈగల్ పల్లె బాట'




పిఠాపురం, ఆగస్టు 6( ప్రభాతవార్త) పిఠాపురం మండలం నవకంద్రవాడ గ్రామంలో గురువారం నిర్వహించిన" ఈగల్ పల్లెబాట " కార్యక్రమంలో భాగంగా విబిజి-రామ్- జి, ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు మాదకద్రవ్యాల దుష్పరి ణామాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ సిబ్బంది మాట్లాడుతూ గంజాయి మాదక ద్రవ్యాల వల్ల వ్యక్తులు, కుటుంబాలు నాశనమవుతా యన్నారు . యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, తల్లితండ్రులు తమ పిల్లల ప్రవర్తన పై అప్రమత్తంగా ఉండాలని ఉంటూ వారికిమార్గదర్శనం చేయాలన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు, లేదా సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న కూలీలు మాదకద్రవ్యాల నిర్మూలన తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఈగల్ సిబ్బంది సూర్యచక్ర, షరీఫ్, ఏపీవో నాయుడు పాల్గొన్నారు.


## కూటమి పాలనలో స్వర్ణయుగం : ఏఎంసి ఉపాధ్యక్షుడు కంఠం శెట్టి



కొత్తపేట, ఆగస్టు06, (ప్రభాతవార్త) రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో స్వర్ణ యుగం సాధించిందని ఏ ఏం సి ఉపాధ్యక్షుడు కంఠం శెట్టి శ్రీనివాసరావు బిజెపి మండల శాఖ అధ్యక్షుడు సంపద కనకేశ్వరరావు జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చంటి అన్నారు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు వారు కొత్తపేట మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా కూటమి నాయకులు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలను ఆత్మీయంగా పలకరించారు ప్రభుత్వ ప్రగతి నివేదికను అందజేస్తూ స్థానిక సమస్యలు ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని వాటిని ప్రాధాన్యత క్రమంలో నమోదు చేశారు ఈ కార్యక్రమంలో వాసంశెట్టి సత్యనారాయణ నక్క విజయ్ సాదా సత్తిబాబు కొత్తపల్లి సూరిబాబు రాంబాబు మానే ప్రసాదు సిహెచ్ వెంకటేశ్వరరావు అలాగే కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరువు

### దిశ రద్దు నిర్ణయంపై కుటిల రాజకీయం,జమ్మలమడక



కాకినాడ రూరల్ ఆగస్టు 6 (ప్రభాతవార్త): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుండి మహిళలకు భద్రత కరువైందని, ముఖ్యంగామహిళా భద్రత కొరకు గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన దిశ చట్టాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయడాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి తప్పుబట్టారు. గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆమె మాట్లాడుతూ మహిళల భద్రతపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. నిందితులకు 21 రోజుల్లో శిక్షలు పడి బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగే అంశంపై హోం మంత్రి అనిత తప్పుబట్టడం దురదృష్టకరమని అన్నారు. ఎన్నికలకు ముందు మహిళల భద్రతపై పెద్ద పెద్ద మాటలు చెప్పిన చంద్రబాబు ఇప్పుడు అధికారం చేపట్టాక దిశ చట్టాన్ని రద్దు చేయడం సరైన పద్దతి కాదన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల మహిళల భద్రత కరువైందని , గత ప్రభుత్వంలో దిశ యాప్ ద్వారా ఆపదలో ఉన్న మహిళ జిపిఎస్ ప్రదేశాన్ని గుర్తించి పోలీసులు అక్కడి చేరుకునేలా రూపొందించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మహిళలకు భద్రతను ఇచ్చే ఇటువంటి చట్టాలను ఇస్తే స్వాతంత్ర్య దినోత్సవానికి కొద్ది రోజుల ముందు రద్దు చేయడం మహిళలను అవమానించడమే అని జమ్మలమడక స్పష్టం చేశారు.

## లోకోస్ యాప్ పై వి. ఓ. ఏ. లకు శిక్షణ



రాజవొమ్మంగి, అగస్టు06, ప్రభాత వార్త రాజవొమ్మంగి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం (ఆగస్టు 06) న ఏ. పి. యం. యం. లక్ష్మి అధ్యక్షతన 50 వి.ఓ.ఏ. లకు లోకోష్ యాప్ పై శిక్షణా కార్యక్రమం జరిగింది. ప్రతీ ఒక్క మహిళా సంఘ సభ్యురాలు ఫోటో తో ఇ. కె. వై. సి చేసి ప్రొఫైల్ సిద్ధం చేయాలని ట్రైనర్లు రామకృష్ణ, శ్రీరామ్, రాజశేఖర్ లు శిక్షణలో వివరించారు. ప్రతీ నెలా లోకోస్ యాప్ లో ఆన్ లైన్ ద్వారా సంఘాలు ప్రగతి, ఆర్ధిక లావాదీ వీలను వి. ఓ. ప్రతినిధులు, వి. ఓ. ఏ లు ఆన్ లైన్ లో చెప్పాల్సి వస్తాదని ఏ. పి. యం లక్ష్మి వివరించారు. వీఎం ప్రతినిధి సాగిన దేవి, సింహాచలం, సూర్యనారాయణ, లింగమ్మ, చిలకమ్మ, 59 వి. ఓ. ఏ లు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రి పార్థసారధిని కలిసిన టిడిపి అధ్యక్షులు నరేష్ కుమార్



వి.ఆర్.పురం,ఆగస్టు6,ప్రభాతవార్త రాష్ట్ర గృహనిర్మాణ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు.పార్థసారధిని గురువారం వి.ఆర్.పురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొర్రా.నరేష్ కుమార్ కలిశారు. వి.ఆర్.పురం మండలం పోలవరం ప్రాజెక్ట్ ముంపు మండలం అయిన నేపధ్యంలో, ఇందుకు సంబంధించి వి.ఆర్.పురం మండల సమస్యలను నరేష్ కుమార్ మంత్రి దృష్టికి తీసుకొని వెళ్ళారు. సమస్యలను తెలుసుకున్న మంత్రి తన శాఖ పరిధిలోని సమస్యల పరిష్కారానికి పాటుపడతానని నరేష్ కుమార్ కు హామీ ఇచ్చారు.

## తూకం విషయంలో మోసాలు చేస్తే చర్యలు తప్పవు



కాట్రేనికోన ఆగస్టు 06 (ప్రభాతవార్త) తూకం విషయం లో వినియోగదారులను మోసగిస్తే చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతల శాఖ అమలాపురం ఇన్స్పెక్టర్ వి ఎస్ మోహన్ పేర్కొన్నారు. వచ్చిన పిర్యాదుల మేరకు కాట్రేనికోనలో గురువారం పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ తూనికలు కొలతల శాఖ నిబంధనలు సక్రమంగా పాటించని పలు దుకాణాల కటాలను పరిశీలన చేశారు. ఒక మటన్, ఎరువులు, షాపులలో కాటాలకు సీల్ లేకపోవడంతో కేసులు నమోదు చేశామని మోహన్ తెలియజేశారు. వ్యాపారులు వినియోగించే ఎలక్ట్రానిక్ పరికరాలకు ఒక సంవత్సరం, రాళ్లు ఉపయోగించే ఆర్డినరీ కాటాలకు రెండు సంవత్సరాలు గడువు తీరిన తరువాత సీల్ తప్పనిసరిగా వేయించుకోవాలని, ఈ విధంగా నిబంధనలను పాటించకుండా తప్పుడు తూకాలు నిర్వహిస్తూ వ్యాపారాలు చేస్తే కేసులు నమోదు చేసి జరిమానా విధించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధితో ఆర్థిక భరోసా..



అంబాజీపేట, ఆగస్టు 6, (ప్రభాతవార్త ): ముఖ్యమంత్రి సహాయ నిధితో పేద మధ్యతరగతి కుటుంబాలలో ఆర్థిక భరోసా కలుగుతుందని రాష్ట్ర ఇరిగేషన్,శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్లు శిరిగినీడి వెంకటేశ్వరరావు,బొంతు పెదబాబులు అన్నారు. అనారోగ్యంతో పాటు వివిధ కారణాలతో వైద్య చికిత్స పొంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబాలకు కూటమి శ్రేణులు గురువారం అందజేశారు. మండలంలోని మాచవరం పంచాయతీ పరిధిలోని నాలుగు కుటుంబాలకు రూ.1,55,989లను చెక్కుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా మీరు మాట్లాడుతూ పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆదేశాల మేరకు బాధిత కుటుంబాలకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను వారి వారి ఇళ్లకు వెళ్లి అందజేశామన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి కో కన్వీనర్ దాసరి వీర వెంకట సత్యనారాయణ, టిడిపి జనసేన బిజెపి మండల శాఖల అధ్యక్షులు గూడాల ఫణి, దొమ్మేటి సాయికృష్ణ,కురసా అంజిబాబు, ఆత్మ కమిటీ జిల్లా డైరెక్టర్ పత్తి దత్తుడు, ఏఎంసి వైస్ చైర్మన్ కొర్లపాటి ఢిల్లీ, నాయకులు రవణం రాము, మైపాల తాతాజీ, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, పెదపూడి శ్రీను, సుంకర బాలాజీ, చిటికెన నాని, ములపర్తి రమేష్, పళ్ళ రామ్మూర్తి, దుర్గబాబు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆధ్వర్యంలో మాదకద్రవ్య వ్యతిరేక ర్యాలీ



రామచంద్రపురం, ఆగస్టు 6 (ప్రభాతవార్త): ద్రాక్షారామలో మండల బీజేపీ అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో 'నిషా ముక్త్ యువ -- వికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్'కు మద్దతుగా గురువారం మాదకద్రవ్య వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్‌రావు మాట్లాడుతూ,వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలన కోసం చేపట్టిన '100 వారాలు -- 100 బలమైన అడుగులు' కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని కోరారు.మండల అధ్యక్షుడు మాట్లాడుతూ,యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలు అభినందనీయమన్నారు.మండల ప్రధాన కార్యదర్శి పుల్లెల రామమూర్తి మాట్లాడుతూ,యువత భవిష్యత్తే దేశ భవిష్యత్తని,మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి దేశ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అయ్యప్ప, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు ఇంధన సత్యనారాయణ,ఆర్ఎస్ఎస్ నాయకుడు ఆళ్ల నారాయణ (బుజ్జి), బీజేపీ మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి రాజేశ్వరి,ఎస్వీ కళాశాల విద్యార్థులు ,అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు 6లో

# విజయవంతంగా ఆదిత్యయూనివర్సిటీలో మెగా రక్తదాన శిబిరం



**గండేపల్లి. ఆగస్టు 6. ప్రభాతవార్త** గురు వారం ఆదిత్య యూనివర్సిటీ నందు ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం విజయవంతం గా ముగిసినట్లు డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలియజేశారు. ఆదిత్య సిబ్బంది మరియు విద్యార్థుల సౌజన్యంతో నిర్వహించబడిన ఈ మెగా రక్తదాన శిబిరం ఉదయం 9-30 ని.లకుప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. ఎన్. సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఆదిత్య సూరంపాలెం క్యాంపస్ నందు 2005 సంవత్సరం నుండి ప్రతీ సంవత్సరం జనవరి మరియు ఆగస్టు నెలలో ఈ మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి జిల్లాలో గల ప్రభుత్వ ఆస్పత్రులకు సంబంధించిన బ్లడ్ బ్యాంకు లకు మరియు ప్రముఖ ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్ లకు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ సందర్భాలలో సంభవించిన ప్రమాదాలలో సరైన సమయానికి రక్తం అందని కారణంగా ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు ఈ విషయాన్ని అవగాహన చేసుకున్న ఆదిత్య సిబ్బంది విద్యార్థులు ప్రతీ సంవత్సరం ఈ మెగా రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో విద్యార్థులు మరియు సిబ్బంది పాల్గొని అత్యధిక యూనిట్ల రక్తం ఇవ్వడమే కాకుండా అవసరమైన సందర్భాల్లో కూడా రక్త దానం చేయడం అభినందనీయం అని అన్నారు. ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ మరింత ఎక్కువ యూనిట్ల రక్తాన్ని ఆదిత్య సంస్థ ద్వారా అందించడానికి కృషి చేస్తామని డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా.ఎం. శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ మెగా రక్తదాన శిబిరంలో కాకినాడ, రాజమహేంద్రవరం, రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి సంబంధించిన బ్లడ్ బ్యాంక్ లతో పాటు సిదార్ధ, రోటరీ, ఇండియన్ రెడ్ క్రాస్ కాకినాడ వారు, విజయశ్రీ,డా. వై.ఎస్.ఆర్. జక్కంపూడి రామ్మోహనరావు,ధన్వంతరి రాజమహేంద్రి, యువసేన బ్లడ్ బ్యాంక్, అక్షయ బ్లడ్ బ్యాంక్, సత్య సూర్య బ్లడ్ బ్యాంక్, సహస్ర బ్లడ్ బ్యాంక్,ఏ.ఎస్.ఎన్.రాజు చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్' పెద్దాపురం కు చెందిన రోటరీ బ్లడ్ బ్యాంక్ పాల్గొన్న ఈ శిబిరంలో 911 యూనిట్ల రక్తం సేకరించారు. ఆ యా సంస్థలకు చెందిన డాక్టర్లు వారి సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.బి.శ్రీనివాస్, ప్రో.వైస్ ఛాన్సలర్ లు డా.ఆదిరెడ్డి రమేష్, డా. ఎస్.రమాశ్రీ, డా. తంగజం, డా.కె.రవిశంకర్,డా. డి. సతీష్ కుమార్, ఎస్.టి.వి.ఎస్.కుమార్, వివిధ విభాగాల డీన్స్, విభాగాధిపతులు, సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్.కో.ఆర్డినేటర్ లు మరియు రెడ్ క్రాస్ లియో కో.ఆర్డినేటర్లు, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జక్కంపూడి సేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

**73వ జయంతి సందర్భంగా బుర్రిలంకలో మెగా ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు**



**కడియం, ఆగస్టు 6 (ప్రభాతవార్త)** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాజకీయ జీవితాన్ని ప్రజాసేవకు అంకితం చేసిన దివంగత మాజీ మంత్రి డాక్టర్ జక్కంపూడి రామ్మోహన్‌రావు సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. ఆయన 73వ జయంతి సందర్భంగా గురువారం కడియం మండలం బుర్రిలంక గ్రామంలో కొత్తపల్లి బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం విశేష స్పందన పొందాయి. కార్యక్రమానికి మాజీ మంత్రి వెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు ముఖ్య అతిథులుగా హాజరై జక్కంపూడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కడియం ఎమ్మెల్యేగా, మంత్రిగా జక్కంపూడి రామ్మోహన్‌రావు అందించిన సేవలు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచాయని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన చూపిన సేవా తత్వం యువతకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. డాక్టర్ వైఎస్సార్ జక్కంపూడి రామ్మోహన్‌రావు బ్లడ్ బ్యాంక్ వైద్యుల పర్యవేక్షణలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో యువత స్వచ్ఛందంగా పాల్గొని పెద్దఎత్తున రక్తదానం చేశారు. అలాగే హైదరాబాద్ కాంటినెంటల్ హాస్పిటల్ వైద్య బృందం క్యాన్సర్ స్క్రీనింగ్, ఈసీజీ, ఎకో--2డీ, స్కానింగ్, రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు వైద్య సలహాలు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేసింది. రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా శిబిరాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించిన కొత్తపల్లి శివాజీ, కొత్తపల్లి మూర్తి సోదరులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శులు గిరజాల బాబు, రాయపాటి రామచంద్రరావు, మండల పార్టీ అధ్యక్షుడు యాదల సతీష్ చంద్ర స్టాలిన్, తాడాల చక్రవర్తి, నక్క రాజబాబు, ఈలి గోపాలం, వెలుగుబంటి అచ్యుత్ రామ్, తిరుమలశెట్టి శ్రీను, ముత్యం జగదీష్, సింగంశెట్టి శ్రీను, సలాది ప్రసాద్, చిరుమామిళ్ల రామకృష్ణ, తాడాల వీర వెంకటరావు గురుస్వామి తదితర నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## 8 న మన్యం బంద్‌కు ఆదివాసీ గిరిజన సంఘాల విస్తృత ప్రచారం



**వి.ఆర్.పురం,ఆగస్టు6,ప్రభాతవార్త**

ఆదివాసీ గిరిజనుల రక్షణ కవచం లాంటి 1/70 చట్ట పరిరక్షణ, ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన 3 జీఓ కు ప్రత్యామ్నాయ జీఓ ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ 8 వ తేదీన తలపెట్టిన మన్యం బంద్ ను విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రం రేఖపల్లిలో ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏజెన్సీ మండల ప్రధాన కార్యదర్శి పూనెం ప్రదీప్ కుమార్, ఆదివాసీ నాయకపోడ సంఘం జిల్లా నాయకులు చిక్కాల.బాలు లు మాట్లాడారు. 8వ మన్యం బంద్ ను విజయవంతం చేసినట్లుగానే, 9.ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గ్రామ గ్రామాన పండగ వేడుకలా నిర్వహించాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం జీఓ నెంబర్ 3 కి ప్రత్యామ్నాయ జీఓ తీసుకొని వచ్చి, ఏజెన్సీలో 100% ఉద్యోగాలు ఆదివాసీలకే భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 1/70 చట్టం పై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలన్నారు. లేని పక్షంలో ఆదివాసీ లను అణచి వేసే ప్రభుత్వ చర్యలను ఆదివాసీలు ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఆగస్టు 9వ ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలన్నారు. అంతే కాకుండా ప్రభుత్వమే అధికారిక కార్యక్రమంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష ఆదివాసీ నాయకులు కారం.సుందరయ్య, పాయం.లక్ష్మణరావు, పోడియం రాజు, పిట్టా.రామారావు, కోటం.జయరాజు, కుర్సం.రమేష్ పాల్గొన్నారు.

## యానాం బాల్ బాడ్మింటన్ క్లబ్ క్రీడాకారుల ఘనత క్రీడాకోటాలో ఉచిత విద్యావకాశాలు



**యానాం, ఆగస్టు 6: (ప్రభాతవార్త)** మన యానాం ప్రాంతం నుండి యానాం బాల్ బాడ్మింటన్ క్లబ్ సెక్రటరీ కాపగాని అనురాగ ఆధ్వర్యంలో శేషసాయి గారి ప్రోత్సాహంతో బాల్ బాడ్మింటన్ క్రీడ ద్వారా ఉచితంగా ఇద్దరు విద్యార్థులు విద్యావకాశాలు పొందడం జరిగింది. 1. కర్రి శివ సత్య కిషోర్ (ఇ.ఇ.ఇ - వి.ఎస్.ఎస్.ఎ. ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీ కళాశాల, సేలం, తమిళనాడు) 2. లక్కవరపు దర్శన్ కుమార్ (బి.ఎ. ఇంగ్లీష్ – లయోలా కళాశాల, చెన్నై, తమిళనాడు) ఎంపికైన క్రీడాకారులను మరియు వారికి కోచింగ్ ఇచ్చిన కోచ్ బొక్కా శ్రీనివాస్ పి ఈ టి రీజెన్సీ పబ్లిక్ హై స్కూల్ మరియు రాయపురెడ్డి విజయ్ లను పుదుచ్చేరి మంత్రి మల్లాడి కృష్ణారావు గారు అభినందించారు.

## పిఠాపురం గవర్నమెంట్ పాలిటెక్నిక్ లో" స్పాట్ అడ్మిషన్లు."

**పిఠాపురం, ఆగస్టు 6 ( ప్రభాతవార్త )** పిఠాపురం పాలిటెక్నిక్ కళాశాలలో అన్ని బ్రాంచిలలో మిగిలిన సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో మిగిలిన నాలుగు సీట్లకు ఈనెల 10వ తేదీన రెండు గంటలకు కౌన్సిలింగ్ ఏర్పాటు చేయడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ సెక్రెటరీ కె.మాణిక్యరావు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 10వ తేదీ 12 గంటలకు కళాశాల సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

## జగ్గంపేటలో తోట నరసింహం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు



**జగ్గంపేట ఆగస్టు 6 (ప్రభాతవార్త)** జగ్గంపేట టౌన్ లో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు జగ్గంపేట నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు తోట నరసింహం , రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట రాంజీ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 5 గంటల వరకు డీఎస్సీ విషయంలో జరిగిన అవకతవకలు గురించి మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేయడం జరిగింది, రిలే నిరాహార దీక్ష చేపట్టిన వారికి తోట నరసింహం నిమ్మరసం ఇచ్చి మొదటి రోజు దీక్షను విరమింపచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థి విభాగం, యువత విభాగం,రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ మండలం వివిధ అనుబంధ కమిటీ సభ్యులు, నాయకులు, పాల్గొన్నారు.

## దారిమార్గంపై అడ్డుకుంటున్నారని తహశీల్దారుకు పిర్యాదు

**యు.కొత్తపల్లి, ఆగస్టు 6 (ప్రభాతవార్త):** మండలంలోని మూలపేటలో ఇంటి నిర్మాణానికి సంబంధించి దారి మార్గం విషయమై ఇరువర్గాల మధ్య వివాదం గత కొంత కాలంగా జరుగుతుంది. మూలపేటకు చెం దిన ఆర్. శివ 2022 సంవత్సరంలో సుమారు 288 గజాలు స్థలం కలిగిన తాటాకు పాక కొనుగోలు చేశారు. పాక ఉన్న స్థలంలో 6అడుగుల దారిమార్గంతో రిజిస్ట్రేషన్ కూడా చేయించుకొన్నారు. ఇటీవల పాకస్థలంలో ఇంటి నిర్మాణం కోసం శివ పనులు ప్రారంభించాడు. పాక సరిహద్దులో ఉంటున్న ఎం కృష్ణ, పెద్దాపురం, దుర్గ అనే వ్యక్తులు పాక స్థలానికి వెళ్ళేందుకు దారి మార్గం లేదని చెబుతూ ఇంటి నిర్మాణ పనులను అడ్డుకుంటున్నారంటూ శివ తహసీల్దార్ చిన్నారావుకు పిర్యాదు చేయడం జరిగింది. తమ వద్ద డాక్యుమెంట్లు నకలును సమర్పించారు. ఆయన సర్వేయర్ మణికంఠతో కలిసి మూలపేట వెళ్ళి డాక్యుమెంట్ల ఆధారంగా 6అడుగులున్న దారి మార్గం చూపుతూ కొర్రీలు ఏర్పాటుచేశారు. దీంతో కృష్ణ, పెద్దాపురం, దుర్గ అధికారుల సూచనలతో దారి మార్గానికి ఏర్పాటు చేసిన కొర్రీలు తొలగించారు. ఈ సమస్యను కోర్టు ద్వారా తేల్చుకొంటామని చెప్పడం జరిగిందని తహసీల్దారు తెలియజేశారు.

## గ్రామీణ సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలం.

**జిల్లా వైయస్సార్సీపి అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి.**



**ఆత్రేయపురం ఆగస్టు 6,(ప్రభాత వార్త)** రెండేళ్ల కూటమిపాలనలో గ్రామాల్లో సమస్యలు పేరుకు పోతున్నాయని వాటి పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ఏమాత్రం చర్యలు చేపట్టడం లేదని జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షులు కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆరోపించారు. ఆయన గురువారం సాయంత్రం మండల కేంద్రమైన ఆత్రేయపురంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అన్ని వర్గాల ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. మహిళలు కు రాయితీ డ్వాక్రా రుణాలు సక్రమంగా అందడం లేదని అన్నారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ అందడం లేదని ఆరోపించారు. ఇక్కడి రైతాంగం ఎరువులు సక్రమంగా అందక యాప్ లు గురించి తెలియక నానాయాతాలను పడుతున్నట్లు ఆయన దృష్టికి తెచ్చారు. ఎన్నికల్లో హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయడం లేదని నూతనంగా పెన్షన్లు, ఎస్సీ ఎస్టీ వెనుకబడిన వర్గాలకు 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్లు ఇవ్వడం లేదని తెలిపారు. ప్రజల నుంచి అందిన కొన్ని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరించారా నికి కృషి చేశారు. అనంతరం ఆయన గ్రామంలో ఇటీవల ముదునూరి సుబ్బలక్ష్మి మృతి చెందినందున ఆమె భర్త వేములూరి సుబ్బరాజును కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామ శివారు మత్స్యకార పేటలో మత్స్యకార నేత నాటి స్వామిని కలసి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో పలు ప్రాంతాలకు చెందిన 16 బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్ర మాలలో రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ కె.నాగిరెడ్డి మాజీ జడ్పిటిసి సభ్యులు చిలువూరి రామకృష్ణరాజు, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ముదునూరి బండ కృష్ణంరాజు, మాజీ సర్పంచ్ చిలువూరి నాగరాజు, మాజీ సహకార సొసైటీ చైర్మన్ మారిశెట్టి సత్యనారాయణ, వైఎస్ ఆర్సిపి నాయకులు రొట్టె రాజబాబు, వేగేశ్న గోపిరాజు బసవయ్య, శ్రీనివాస రాజు, పండు, నాని, పెద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



**సీతానగరం, ఆగస్టు 06, (ప్రభాతవార్త) :** మండలంలోని రఘుదేవపురంలో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారు, అభయాంజనేయ స్వామి విగ్రహాలను ధ్వంసం చేసిన అసాంఘిక శక్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని తూర్పుగోదావరి జిల్లా బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పవిత్రమైన శ్రావణమాసం ప్రారంభమవుతున్న సమయంలో ఇలాంటి దుశ్చర్యకు పాల్పడటం హిందూ సమాజాన్ని కలచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులు వేగంగా దర్యాప్తు జరిపి దోషులను గుర్తించాలని, స్థానిక ఎమ్మెల్యే తక్షణమే స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండా సోంబాబు, ఆరాధ్యుల రమేష్, రామకృష్ణ (బున్నీ), పల్లేటి సత్యనారాయణ, రామకృష్ణ, మడిచర్ల మూర్తి,దూళ్ళ సూర్యనారాయణ, రవీంద్ర, మద్దూరి నాగార్జున శర్మ, హనుమంతువర్జుల సత్యనారాయణ, ఆరాధ్యుల సాయి, ఆర్.ఎస్.ఎస్.సుబ్బరాజు, సత్యం రమేష్ బాబు, హెచ్.శేషగిరి, కేశవ తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా ట్రాక్టర్లతో ఇసుక తరలింపు పనులు



**కాట్రేనికోన ,ఆగస్టు 06 (ప్రభాతవార్త)** కాట్రేనికోన మండలం గచ్చకాయలపొర నుంచి అనుమతులు లేని ఇసుక తరలింపు పనులు జోరుగా సాగుతుంది.గచ్చకాయల పొరలో ఇటీవల తవ్విన ఓ చెరువులో ఇసుకను గుట్టగా పోగుచేసి ఉంచారు. ఆ ఇసుకను గురువారం ట్రాక్టర్ల సాయంతో ఎటువంటి అనుమతులు లేకుండా తరలింపు పనులు చేపట్టారు. సుమారు ఐదారు ట్రాక్టర్లు రోడ్లపై అధికలోడుతో ,మితిమీరిన వేగంతో వెళ్తున్నా సంబంధిత అధికారులు ఎవరు పట్టించుకున్న దాఖలాలు లేవు. క్షేత్రస్థాయిలో వీఆర్వోలు పోలీస్ సిబ్బంది ఎవరు కూడా పట్టించుకోకపోవడంతో ఇసుకాసురులు యాదేచ్ఛగా రెచ్చిపోతున్నారు.దాంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది .ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతులు లేని మట్టి తరలింపు పనులు చేపడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## వైద్య విద్యార్థినిపై కారుతో ఢీకొట్టిన ఇరవురి యువకులు

**డాక్టర్ ప్రియాంక బ్రెయిన్ డెడ్ హైదరాబాద్ తరలింపు**

**రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 6( ప్రభతవార్త)**

రాజమండ్రి ప్రసాదిత్య మాల్ వద్ద జరిగిన కారు ఢీకొట్టిన ఘటనలో వైద్య విద్యార్థిని తీవ్ర గాయాలై అయ్యాయి. ప్రకాష్ నగర్ పోలీసులు తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి. ఈనెల మూడో తేదీన నామవరం చెందిన ఇద్దరు యువకులు సురావరపు దాస్వంత్, ఆంద్రు జోసెఫ్ ఆడ్వార్డ్స్ లు ఇద్దరు మద్యం సేవించి సినిమాకు వచ్చారు. మద్యం సేవించి ఉండటంతో వీరిద్దరూ నీ గేటు వద్ద సెక్యూరిటీతో గార్డు అడ్డుకోవడంతో గొడవకు దిగారు. దీంతో కోపంగా కారుతో బయటికి వస్తుండగా స్కూటీపై వెళ్తున్న వైద్య విద్యార్థిని కారుతో ఢీకొట్టారు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో రాజమండ్రిలోని స్వతంత్ర ఆసుపత్రికి తరలించారు. జిఎస్ఎల్ మెడికల్ కాలేజీలో ధర్మటాలజి పీజీ చదువుతున్న ప్రియాంక తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కుటుంబ సభ్యులు తరలించారు. ఈ ఘటనపై రాజమండ్రి వైద్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు సంఘటనకు సంబంధించి ప్రకాష్ నగర్ పోలీసులు పోలీసులు ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డిఎస్సీ అక్రమాలపై విచారణ చేయాలి....

**విద్యామంత్రి లోకేష్ రాజీనామా చేయాలి**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు6,ప్రభాతవార్త.** వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ అదినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు,మాజీ మంత్రి, పి.ఎ.సి. సభ్యులు,పార్లమెంట్ ఇన్‌చార్జ పినిపే విశ్వరూప్ అధ్యక్షతన డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరపాలని, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చెయ్యాలని,ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగ భృతి ఇవ్వాలని అమలాపురం లో రిలే నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ విద్యార్థులు, యువతను నమ్మించి మోసం చేస్తూ వారి భవిష్యత్తుతో రాజకీయం చేయడం ఎంతమాత్రం సమంజసం కాదని తీవ్రంగా మండిపడ్డారు. దేశంలో 'నీట్' పేపర్ లీకేజ్ వివాదంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసిన విషయాన్ని గుర్తుచేస్తూ, ఇక్కడ కూడా కూటమి ప్రభుత్వం చేసిన మోసంపై సీబీఐ విచారణ జరిపించి, బాధ్యుడైన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు ఈ పోరాటాన్ని ఇంతటితో ఆపకుండా మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ,ఎమ్మెల్సీ లు కుడుపూడి సూర్యనారాయణ రావు,బొమ్మి ఇజ్రాయేల్,రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు,వంటెద్దు వెంకన్నాయుడు,త్రినాథ రెడ్డి, రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షులు జిన్నూరి బాబీ,మాజీ ఎంపీ చింతా అనురాధ,ఎస్ ఇ సి మెంబర్ కుడుపూడి భరత్, అమలాపురం అసెంబ్లీ ఇన్‌చార్జ్ డాక్టర్ పినిపే శ్రీకాంత్,ఎంపీపీ ఇళ్ల శేషారావు,మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనాగేంద్ర మణి,రాష్ట్ర బూత్ వింగ్ కార్యదర్శి ఉంద్రు వెంకటేష్, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి నూలు రమేష్ ,విద్యార్థి విభాగ జాయింట్ సెక్రటరీ మద్దింశెట్టి ప్రసాద్,రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి సరేళ్ళ రామకృష్ణ, మైనార్టీ సేల్ అధ్యక్షులు ఖాదర్,సుదా గణపతి, జిన్నూరి వెంకటేశ్వరరావు నాయకులు,అభిమానులు పాల్గొన్నారు.

## 8 న జరిగే పోలవరం జిల్లా వ్యాప్త ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలి..!

**ఆదివాసి గిరిజన సంఘం నాయకులు తెల్లం తమ్మయ్య**




**కూనవరం, ఆగస్టు 6, ప్రభాతవార్త :** పోలవరం జిల్లా వ్యాప్తంగా అన్ని అఖిలపక్ష ఆదివాసి సంఘాలు, ప్రజా సంఘాలు, యువజన సంఘాలు ఐక్యంగా ఈ నెల 8వ తేదీన జరిగే ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని పోలవరం జిల్లా కూనవరం మండలంలోని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు తెల్లం తమ్మయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసుల భూములను రక్షించే 1/70 చట్టంపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టేందుకు అన్ని ఆదివాసి సంఘాలు ఒక్కటిగా ఉద్యమిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసుల రాజ్యాంగబద్ధ హక్కులు, చట్టాల పరిరక్షణ కోసం ప్రతి ఆదివాసి ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జీవో నెంబరు 3 అమలులో లేకపోవడం వల్ల ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసి యువతకు లభించాల్సిన అనేక ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారన్నారు. ఫలితంగా వేలాది మంది యువతీ యువకులు నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసుల విద్యా, ఉద్యోగ హక్కులను కాపాడే విధంగా జీవో నెం. 3ను పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 8న జరిగే ఏజెన్సీ బంద్‌కు ప్రతి గ్రామం నుంచి వందలాది మంది ఆదివాసులు పెద్ద ఎత్తున తరలివచ్చి పాల్గొనాలని పిలుపునిచ్చారు. అలాగే పోలవరం జిల్లా వ్యాప్తంగా ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు స్వచ్ఛందంగా సహకరించి ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుండం బాబురావు, బొగ్గ రామారావు, బొగ్గ సుబ్బయ్య తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు

## కాకినాడ పర్యటన కు విచ్చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఘన స్వాగతం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 6 (ప్రభాతవార్త):** కాకినాడ జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం విచ్చేసిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కు కాకినాడలోని జీఆర్టీ గ్రాండ్ హోటల్ వద్ద కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, కుడా చైర్మన్ తలాటం సత్య ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి బాబు పుష్పగుచ్ఛం అందజేసి మంత్రి మనోహర్ ను సాదరంగా ఆహ్వానించి, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రైతుల అభ్యున్నతి, పేదల సంక్షేమం, పారదర్శక పాలన లక్ష్యంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, ఆ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తున్నారని తుమ్మల రామస్వామి పేర్కొన్నారు. అలాగే, జిల్లాలో రెండు రోజుల పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, ఈ పర్యటన ద్వారా ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నేతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



**కె.గంగవరం,ఆగస్టు 06, (ప్రభాతవార్త):** చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించి, వారికి గౌరవప్రదమైన జీవనం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. రామచంద్రపురం నియోజ కవర్గంలోని కె గంగవరం మండలం అద్దంపల్లి గ్రామంలో గురువారం నేతన్నలతో ముఖాముఖి సమావేశం నిర్వహించి వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత రంగాన్ని పునరుజ్జీవింపజేయడానికి కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చీరాలలో అర్హులైన నేతన్నలకు ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సాయం అందించే ప్రతిష్టాత్మక పథకాన్ని ప్రారంభించడం చేనేత కుటుంబాలకు ఎంతో ఊరటనిస్తుందన్నారు. మగ్గంపై పనిచేసే నేతన్నలకు 200 యూనిట్ల వరకు, మరమగ్గంపై పనిచేసే వారికి 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. అంతేకాకుండా ముద్ర రుణాలు, థ్రిఫ్ట్ ఫండ్ నిధులు వంటి పథకాల ద్వారా చేనేత కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. చేనేత వస్త్రాలను కొనుగోలు చేయడం ద్వారా మన సంస్కృతిని, సంప్రదాయాన్ని కాపాడటమే కాకుండా వేలాది నేతన్న కుటుంబాలకు ఉపాధి కల్పించిన వారమవుతామని చెప్పారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి స్థానిక నేతన్నలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అనంతరం వాసంశెట్టి సత్యం స్వయంగా చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి నేతన్నలకు ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో కె గంగవరం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్ కూటమి పార్టీ నాయకులు, చేనేత కార్మికులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఉనికిని కాపాడుకునేందుకే వైసిపి పార్టీ పాకులాట

**శాసనసభ్యులు వనమాడి కొండబాబు.**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి ఆగస్టు 6 (ప్రభాతవార్త)** మెగా డీఎస్సీ నియామకాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు, నిరసనలు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవేనని, వైసిపి పార్టీ తన ఉనికిని కాపాడుకొనుందుకు ఫేక్ నిరసనలు చేపడుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు విమర్శించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 16 వేల డీఎస్సీ పోస్టులను పూర్తి పారదర్శకతతో భర్తీ చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందని, మెగా డీఎస్సీపై వైసీపీ చేపడుతున్న నిరసనల్లో అసలు విద్యార్థులు లేరని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వైసీపీ పార్టీ కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీపై అసత్య ప్రచారం చేస్తోందని, కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ నియామకాలను అడ్డుకునేందుకు వైసిపి పార్టీ దొంగ సంతకాలతో హైకోర్టులో కేసులు కూడా వేసిందని, వాటిని అన్నింటినీ ఎదుర్కొని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పూర్తి పారదర్శకతతో 16 వేల మెగా డీఎస్సీ నియామకాలను పూర్తి చేసిందని, ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా యువతను మోసం చేసిన జగన్ మోహన్ రెడ్డి ఇప్పుడు డీఎస్సీపై మాట్లాడటం హాస్యాస్పదమని, డీఎస్సీలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న వైసీపీ ఆధారాలతో ముందుకు రావాలని సవాల్ విసిరారు. ఇప్పటికే మంత్రి నారా లోకేష్ పలుమార్లు బహిరంగ చర్చకు ఆహ్వానించినా జగన్ రెడ్డి స్పందించలేదని, డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన 16 వేల మంది అభ్యర్థులు వైసీపీ ఆరోపణలతో నేడు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారని, ఐదేళ్లు అవకాశం ఇవ్వని గత వైసీపీ ప్రభుత్వం ఇప్పుడు తాము కష్టపడి సాధించిన ఉద్యోగాలను కూడా అపవాదులు వేయడం బాధాకరమని అభ్యర్థులు వాపోతున్నారని, కూటమి ప్రభుత్వం ప్రతి ఏడాది ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ముందుకు సాగుతుందని, రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాల కల్పన కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే వైసీపీ పార్టీ ప్రతి అంశాన్ని కోర్టులకు తీసుకెళ్లి అడ్డంకులు సృష్టిస్తోందని, రాష్ట్ర ప్రజలు వైసిపి పార్టీని 11 సీట్లకు పరిమితం చేసి చీకొట్టిన బుద్ధి రాలేదని కొండబాబు పేర్కొన్నారు.

## పిబిసి ఆయకట్టు శివారు భూములకు నీరు అందిస్తాం

**-జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్**



**గొల్లప్రోలు, ఆగస్టు 6,(ప్రభాతవార్త)** పిఠాపురం బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) కింద ఉన్న ఆయకట్టు చివరి భూముల వరకు సాగు నీటిని సమర్థవంతంగా అందించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన జలవనరుల శాఖ అధికారులతో కలిసి పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని గొల్లప్రోలు చేబ్రోలు తదితర ప్రాంతాలలో క్షేత్రస్థాయి పర్యటన చేశారు. ఈ పర్యటనలో భాగంగా గొల్లప్రోలు కొత్త కలింగలు,బలకట్టు ప్రాంతాల్లో జరుగుతున్న కాలువ అభివృద్ధి పనులను పరిశీలించారు. అలాగే మండల పరిధి మల్లవరం గ్రామంలో గల రాజా రావు బహాదుర్ చెరువు (ఆర్ఆర్బి) అభివృద్ధి పనులు,చెరువు మిగులు జలాల నిర్వహణను కూడా ఆయన నిశితంగా పరిశీలించి అంచనా వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు సాగునీటి కొరత తలెత్తకుండా ప్రతిపాదనల ప్రకారం పనులన్నీ నిర్దేశిత కాలపరిమితి లోగా పూర్తి కావాలని స్పష్టం చేశారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా ఇంజనీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. పిబీసీ ఆయకట్టు శివారు భూములకు సైతం సాగునీరు అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి అధికారులు సాగినీటిని సమర్థవంతంగా అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ధవలేశ్వరం సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్.ఇ.) పి. శ్రీనివాస్, గోదావరి డెల్టా చైర్మన్ ఎం సునీల్ కుమార్, జలవనరుల శాఖ ఈఈ శేషగిరిరావు, గొల్లప్రోలు కమిషనర్ దివిజా సంపతి తహసిల్దార్ వెంకట భాస్కర్,ఎంపీడీవో సాలట్ రాజు, డివిజనల్ ఇంజనీర్లు సంతోష్ కుమార్, రవి కుమార్, ఏఈ పద్మజ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ప్రోత్సాహక పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

**ఏపీ ఈడీఏ అసిస్టెంట్ మేనేజర్ కేవీ విజయ బాలాజీ**

**జిల్లా స్థాయి ఉద్యాన పంటల ఎగుమతులపై రైతులకు శిక్షణ**



**శంఖవరం ఆగస్టు 6 ప్రభాతవార్త** రైతుల సంక్షేమం కోసం ఏపీ ఈ డి ఏ అందిస్తున్న ప్రోత్సాహపథకాలను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఈపీఈడిఏ అసిస్టెంట్ మేనేజర్ కె.వి విజయ బాలాజీ పేర్కొన్నారు వ్యవసాయ మరియు ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, కాకినాడ జిల్లా ఉద్యాన శాఖ సహకారంతో శంఖవరం మండలం సీతంపేట సచివాలయ భవనంలో జిల్లా స్థాయి "ఉద్యాన పంటల ఎగుమతి అవకాశాలపై రైతులు, ఎఫ్‌పీఓలు, ఎగుమతిదారులు , వ్యాపారుల కోసం అవగాహన కార్యక్రమం" నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఏపీ ఈ డి ఏ అసిస్టెంట్ మేనేజర్ కె.వి. విజయ్ బాలాజీ యాదవ్, మాట్లాడుతూ ఏపీ ఈ డి ఏ ద్వారా రైతులు, ఎఫ్ పి ఓ ఎగుమతిదారులకు అందిస్తున్న ఆర్ సి ఎం సి నమోదు, ఎగుమతి సౌకర్యాలు, ప్యాక్‌హౌస్ గుర్తింపు, ట్రేసబిలిటీ వ్యవస్థ, నాణ్యత ప్రమాణాలు, ఫైటోసానిటరీ ధృవీకరణ, అవశేషాల నియంత్రణ, అంతర్జాతీయ మార్కెట్ అనుసంధానం , ఎగుమతి ప్రోత్సాహక పథకాల గురించి వివరించారు. ముఖ్యంగా మామిడి, జీడిమామిడి, కూరగాయలు, పండ్లు మరియు ఇతర ఉద్యాన పంటల ఎగుమతులకు అందిస్తున్న అవకాశాలు రైతులకు వివరించారు. అనంతరం జిల్లా ఉద్యాన అధికారి బి.వి. రమేష్, ఏడీహెచ్ కేంద్రం సమన్వయకర్త. సీతారామ శర్మ, రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డా. భవాని ప్రసాద్, పెద్దాపురం వ్యవసాయ పరిశోధన స్థానం అధికారిని ఎన్. సుజాత, జె. సోమ రమేష్ బాబు లు రైతులకు పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉద్యాన శాఖ అధికారిని ఎస్.కె. చాందిని, వై. పద్మలత, డా. ఎస్. సుజాత, కె. దివ్యశ్రీ, ఉద్యాన సహాయకులు వివిధ మండలాల లా రైతులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps